1951 లో „

FILM BUSINESS PP

"పూర్ణా రిలీజులు"

...అశ్విని వారి...

మాయలమారి

...యువా వారి...

టింగ్ రంగా

...అంజలీ వారి...

చిత్రం, నెం. 1.

...ప్రతిభా వారి...

చిన్నకోడలు

...వినోదా వారి...

స్త్రీసాహసము
సువర్ణమాల
దేవదాసు
బాలసన్యాసమ్మ కథ

...భరణీ వారి...

LOVE

...మనోహార పరిమళా వారి...

స్వర్గ ద్వారము

...మనోహార్ వారి... **మనోహార**

ఇంకనూ ఎన్నో తమిళ, హిందీ, చిత్రాలు

నిర్దోషి, స్వప్నసుందరి, బాలరాజు, తైలామఱ్ఱ, రక్షరేఖ, మొ,, ఉత్తమచిత్రములు సమర్పించి విశాలాంధ్ర ప్రజల ఆదరాభిమానములందుకొన్న ఏకైక సంస్థ

ది పూర్ణా పిక్చర్స్ లిమిటెడ్

విజయవాడ, సికింద్రాబాద్, గుంటకల్, మద్రాసు, విశాఖపట్టణం

CH. E. PRASAD

MATA

ఆంధ్రమహిళ

సంపుటి 7 :: ఏప్రిల్ '51 :: సంచిక 12

ముఖచిత్రం : చెన్నపురి విద్యార్థిని
చిత్రకారుడు . "బాబూ"

సంపాదకురాలు : శ్రీమతి దుర్గాబాయి, యం. యే., బి. యల్
సహసంపాదకురాలు శ్రీమతి చన్నఘంటమ్మ, యం యే యల్. టి.

ఆంధ్ర మహిళా సభ, మైలాపూర్

సంవత్సర చందా	అయిదు రూపాయలు

జాజిమల్లి

కారణాంతరములచేత 'జాజిమల్లి' నవలా భాగాన్ని యీ సంచికలో ప్రచురించలేక పోయినాము. జన్మదిన సంచికలో 'జాజిమల్లి' 1, 12 గుచ్ఛములను ఒకేమారుగా ప్రచు ంచుదుమని, దానితో సీరియల్ సంపూర్ణము ాగలదని మా చదువరులకు మనవి చేయు ున్నాము.

సంపాదకురాలు.

ఆంధ్ర మహిళాసభ
నర్సింగ్ హోమ్

అడయారు స్థలంలో ఆంధ్ర మహిళా సభవారు కట్టబోయే నర్సింగ్ హోమ్ నిర్మాణం ప్రారంభమైనది. జూన్ నెలలోగా యీ నిర్మాణము పూర్తి అగును.

స్త్రీ, శిశువుల ఉపయోగార్థం నిర్మింపబడుచున్న యీ భవనానికి, ఎక్కువైన ధనసహాయము కావలసియున్నది. ఉదార హృదయులు తగిన విరాళములిచ్చి, యీ ధర్మ కార్యాన్ని ప్రోత్సహించ వలసినదిగా మనవి.

అ. గిరిజ. జ. జమునాబాయి.

ఆంధ్ర మహిళ

7వ జన్మదిన సంచిక

మే - మొదటి వారములో వెలువడును

చక్కని ఆర్టుపేపరు అట్టమీద, త్రివర్ణ ముఖచిత్రముతో

మనోరంజకమైన కథలు

రమ్యమైన నాటికలు

అనేక ఆధునిక సమస్యలపై అనుభవజ్ఞుల రచనలు

త్రివర్ణ, ద్వివర్ణ చిత్రములు, ఛాయా చిత్రములు, రేఖాచిత్రములు కలిగి చదువరులకు

విజ్ఞాన వినోదములను కలిగించుతుంది

వనితా విజ్ఞానం, బాలానందం, చిత్రసమీక్ష, గ్రంథసమీక్ష యిత్యాది మామూలు శీర్షికలతో యింకా అనేక ఆకర్షణీయమైన క్రొత్త శీర్షికలతోనూ వెలువడుతుంది. ఈ సంచిక 120 పేజీలు కలిగి ఉంటుంది.

వెల సంచిక ఒకటి రూ 1—8—0

వలయువారికి

హిగ్గిన్ బాథమ్స్ అన్ని బుక్కు స్టాల్సులోనూ లభించును

లేకున్న

ఆంధ్రమహిళ మేనేజరుకు వ్రాసి తెప్పించుకోవచ్చును.

అశోకా టాయిలెట్ పౌడరు

తమ తళుకు బెళుకులతో వెండితెరకు వెలుగు వెన్నెలలనిచ్చే ఫిలింతారలకేమి—గృహిణీ ధర్మ నిర్వహణమే ఏకైక లక్ష్యంగాగల మహిళామణులకేమి, ఆటపాటలతో అల్లారు ముద్దుగా పెరిగే చిన్ని పాపలకేమి, వారు వీరననేల ఎల్లరకు కావలసినది ఒక్కటే!

అది.

అశోకా టాల్కమ్ పౌడరు



మీరు అనేకమైన పౌడర్లు వుపయోగించవచ్చు, కాని దీనికిసాటి మరొకటి లేదు. దీనిని వాడినచో ముఖమున కందము నిచ్చును, చర్మమును నునుపుగా నిగనిగలాడు నట్లు చేయుటే గాక వేసవికాలపు ఉష్ణతాపమునణచి మీకు హాయినొసగును. పిల్లలకు దీనిని వాడినచో, పేలుట, చిడుములు మొదలైనవి లేకుండ చర్మమును పరిశుభ్రముగా నుంచును.

అశోకా మార్కును గమనించి కొనవలయును.

అందము - ఆనందము

నగలు పెట్టుకుంటే, మంచి చీరలు కడితే అందం రాదు. మరెలా గొస్తుంది అందం? కురులే అందాన్ని, ఆనందాన్నిస్తాయి. తలవెంట్రుకలు చిన్నవయితే అందం రాదు. కేశాభివృద్ధికి మార్గంచూడాలి. కేశ్‌రీన్ వాడాలి.

కేశ్ రీన్ హేర్ టానిక్



వెల 0—12—0

(పోస్టేజి ప్రత్యేకము)

విక్టోరియా డిపో, మద్రాసు, 4.

ఆంధ్ర విద్యా సంఘం—ఢిల్లీ

కార్య కలాపాలు

ఢిల్లీలో, శ్రీమతి దుర్గాబాయిగారిచే స్థాపింపబడిన ఆంధ్ర విద్యా సంఘమువారి యాజమాన్యాన్న, ఆ సంఘ సహాయార్థం జరుపనున్న తెలుగు ఫిల్ము ప్రదర్శనములను మంత్రి దివాకరుగారు, 25—3—1951 ఉదయం శోభనాచలవారి కీలుగుఱ్ఱం చిత్రముతో ప్రారంభిస్తూ, భారతీయులంతా తమ పరిసరప్రాంతీయ భాషలను మాతృ భాషలుగా భావించాలని చెప్పి, శ్రీమతి దుర్గాబాయిగారు చేయుచున్న సంఘసేవను అభినందించి, వారి కార్యక్రమము విజయవంతముగా జరుగవలెనని శుభాకాంక్షలు తెలిపిరి చిత్రములో నటించిన అంజలీదేవి నృత్యములను ప్రేక్షకులు చాలా అభినందించిరి గొల్లభామ చిత్రము 1—4—51 నాడు ఈ ప్రణాళిక ప్రకారము ప్రదర్శింప బడుతుంది.

ఐ. ఎన్. చారీ.

కార్యదర్శి.

ఆంధ్రమహిళ

సంపుటి 7 ఏప్రిల్ 1951 సంచిక 12

కాల పరిభ్రమణము

వికృతాట్టహాసంతో, వికృతి, అతి వికృతంగా వీడ్కోలు కోరుతూ ఉంది. "నాకు స్వాగత మిచ్చెదరా, యీయరా" యని ఖర ఖండించి ప్రశ్నిస్తూంది. "ఏమైనాసరే, ప్రభుత్వోద్యోగి వలె, కాలచక్రగతిలో నాప్రాబల్యాన్ని చూపి తీరుదున"ని, పైగా గ్రుడ్లురిమి చూస్తూ ఉన్నది కూడాను. సూర్య భగవానుని ఆజన్మాంత కొలువులో, భూమాత ఆచరించే ఆత్మ ప్రదక్షిణ, పరిభ్రమణముల ఫలితముగా, నిరంతరాయమానముగా ఏర్పడుచున్నది వారాత్రములు, దినవారములు, మాస వర్షములు, తరములు, యుగములు, అనివార్యమైన కాలరథగతిని నిరూపిస్తూనే యున్నవి. కేవలం మానవమాత్రులు, ఇంకా, మన బోటివారు, తోటివారు, మనవారు అనుకునే, ప్రభుత్వపు రథ గమనాన్నే ఇసుమంతైనా అడ్డుకో లేకుండా ఉన్నాము—దాని గమ్యస్థానాన్ని ఊహించను కూడా సమర్థులం కాలేకున్నాము. ఇలాం టప్పుడు, సౌరమండలములోని గ్రహకూటమి అధీనములో నున్న యీ కాలరథగతిని అరికట్టడానికిగాని, దాని గమ్యస్థాన మిది యని నిర్ణయించడానికిగాని, మన మెంతటి వారము గనుక!

నత మస్తకులమై, ముకుళిత హస్తములతో—ఆహార క్షామము, వ్యాధి సంపీడనము చేరి వర్తమానమానవ కోటికి పెట్టని ఆభరణాలుగా ప్రసాదించిన యీ లక్షణ ద్వయముతో—"ఖర నామ వత్సరమా, మాస్వాగతమిదె గొనుమా, మము నారడి పెట్టకుమా" అని, అని తీరవలసినదే. అధిక ప్రసంగం చాలించమంటూంది. 'ముక్కలు చేసిన భారత ఖండాన్ని మక్కువతో మీా కిత్తుముగా' అంటూ, బ్రిటిషువారు కాంగ్రెసు వారికి పట్టాభిషేకముచేసి తరలినట్లు, 'రక్తము పీల్చిన రిక్తమానవులు, జీవచ్ఛవములు—ఇరుగో, వీరిక నీసొమ్ము' అంటూ వికృతి విడచిన క్షుదార్తులను, క్షామ• పీడితులను నేను మాత్రం ఆరడి పెట్టక ఎట్లు సమర్థించగలన"ని, మనను అర్థ ప్రసంగములోనే అదలిస్తుంది.

కాల పరిభ్రమణము

అయినా ఉండాం, ఓపికతో—ఈ కాల పరిభ్రమణంలో యుగములు మాత్రము తిరిగి రావా అనే ఆశతో—

వాల్మీకి మహాముని వ్రాసిన రామాయణములో, రామ రాజ్యాన్ని వర్ణిస్తూ,

“న పర్యదేవన్ విధవా న చవ్యాళ కృతమ్ భయం
న వ్యాధిజం భయం వాపి రామే రాజ్యం ప్రశాసతి
నిర్దస్యురభవల్లోకో నానర్థః కంచి దస్పృశత్
న చస్మ వృద్ధా బాలానామ్ ప్రేత కార్యాణి కుర్వతే
సర్వం ముదితమే వాసీత్ సర్వో ధర్మ పరోభవత్

. ...

నిత్య పుష్పా నిత్య ఫలాస్త రవ స్స్కంధ విస్తృతాః
కాలేవర్షే చ పర్జన్య స్సుఖ స్పర్శశ్చ మారుతః
బ్రాహ్మణాః క్షత్రియా వైశ్యా శ్శూద్రా లోభవివర్జితాః
స్వకర్మసు ప్రవర్తన్తే తుష్టాస్సైస్వైరేవ కర్మభిః
ఆసన్ప్రజా ధర్మరతా రామే శాసతి నానృతాః
సర్వే లక్షణ సంపన్నా స్సర్వే ధర్మ పరాయణాః ॥”

వైధవ్యం, పుత్రశోకం, చోరభయం, వ్యాధి భయం, మరి యే అనర్థం లేకుండా, స్వధర్మ నిరతులైన ప్రజలు సకల సమృద్ధిని అనుభవిస్తూ సంతుష్టులై యున్నారని తాత్పర్యం. ఆ రామ రాజ్యాన్ని ప్రశంసిస్తూ

“నిత్యం ప్రముది తాస్సర్వే యథా కృత యుగే తథా!” అని కూడా అన్నారు.

కృత యుగంలో అందఱూ ఎట్లా సంపూర్ణమైన ఆనందము కలిగియున్నారో, ఆలాగే రామ రాజ్యంలో కూడా అని. అయితే, కలియుగం తరువాత వచ్చేది కృత యుగమేగా—మనం చూడకపోయినా, కాల పరిభ్రమణంలో కృత యుగం తిరిగి వచ్చేటప్పటికి, రామ రాజ్యం కూడా తిరిగి రాకపోతుందా యేం!!

★



ప్రస్తుత పరిస్థితులు

* శ్రీమతి అచ్యుతుని గిరిజ *

అంతులేని వింతలు

వార్తా ప్రతిక పుటలు తిప్పుతూవుంటే ఎన్నో వింతలు వినోదాలు కలిపించుతు వుంటయ్. "అద్వితీయ ఇంద్ర జాలికుడు సర్కారు ప్రపంచంలో వుండే డాక్టర్లను యితర ఐంద్ర జాలికులను కూడ ఆశ్చర్యంలో ముంచి వేస్తున్నాడు" అని ఒక శీర్షిక. దానికిందనే "గారడీకాదు, కనుకట్టు కాదు, ముమ్మాటికి నిజం. మీకు యేవ్యాధి వచ్చినాసరె ఫలానమందు వాడండి. మీకు ఆరోగ్యం కలుగుతుంది" అని ఒక ప్రకటన. పక్కపేజీలో పత్రభక్షణచేసి వ్యాధి పీడితులనందరిని ఒక్క కటాక్షవీక్షణముతో స్వస్థులను చేస్తున్న బాలయోగి పరిచయమో, వాయుభక్షణచేసి ఆరు సంవత్సరాల కొకసారి ప్రజలకు దర్శన మిచ్చే ప్రౌఢయోగి ప్రశంసో కనపించుతుంది. మరొకపుట తిప్పగానే "గోధుమలరేషను యింకా తగ్గించి వాటికి బదులు సాధ్యపడితే మొక్కజొన్నలు అవిలేని పక్షాన సజ్జలు యివ్వబడును" అని ప్రకటన కనిపిస్తుంది. ప్రాణం గతుక్కుమంటుంది. ఈ విధంగా నవధాన్యాల జాబితా అయిపోతే చివరకు ఏమితినాలో! లోగడ ప్రభుత్వంలో ప్రముఖులు గుడి కోనేళ్లలోను యింటి భావులలోను చాపలను పెంచి వాటిని వుపయోగించితే ఆహార సమస్య తీరిపోతుందని చెప్పిన సలహా చటుక్కున జ్ఞాపకం వస్తుంది. దానితోపాటు "రావుల్ దప్పె మూర్ఛ వచ్చె శ్రమంబయ్యెడిన్ రావే ఈశ్వర కావవే వరద . . . ." అన్న గజేంద్రుడి మొర కూడ జ్ఞాపకం వస్తుంది. సిరికింజెప్పక శంఖుచక్రముల్ చేదోయి సంధింపక పరుగిడివచ్చిన పరాత్పరుడు మనలను మటుకు అశ్రద్ధ చేస్తాడా? మళ్లీకళ్లు తెరచేటప్పటికి "ఆహార భయంలేదు, మాయాబియ్యం చేయట కనుక్కొన్నారు" అని యింకో శీర్షిక, ధన్యోస్మి! గుడ్లు వురిమిచూసే చేపలు మాయమై మనసులో తెల్లని సన్నని బియ్యపు కుప్పలు గోచరించుతయ్. కుదట పడిన మనసులో మాయా బియ్యపు విషయం చదవటానికి ఉపక్రమించుతాము. ఆపేరు చూచి భయపడకండి. రేషన్ కొలిపించుకుని యింటికి వచ్చేలోపల మాయమైపోవు. అవి అక్షరాల బియ్యమే. కడిగితే కరిగిపోవు, పొయ్యిమీద పెడితే ఆవిరి అయిపోవు. అవి బియ్యమే, అయితే ఆపేరు ఎందుకు వచ్చిందంటే పొలందున్ని, వరినాటి, పంటచేసి, వడ్లనుదంచి తెచ్చిన బియ్యంకాదు అవి. కర్ర పెండలం దుంపలు, వేరుశనగ నూనెతీసిన తర్వాత మిగిలేపప్పు చెక్కతో యీ బియ్యం చేస్తారుట. సైన్సు ప్రకారం సింథటిక్ బియ్యం అంటారు. మామూలు బియ్యం కన్నా ఆరోగ్యకరమట, పుష్టికరమునై, ఆకలిని ఆపగలవుట, చవకట, ఇంకమనకు కావలసిన దేమిటి? అన్నీ అందులోనే యిమిడివున్నవి. సరే అంతా బాగానేవున్నది.

మనదేశంలో బియ్యం ఎక్కువ మందికి ముఖ్యాహారం. దేశంలో క్రమేపి వరిపంట తగ్గిపోతునేవున్నది. పొగాకు, వేరుశనగ ఎక్కువ పండించటము పరిపాటిగా వున్నది. ధాన్యసేకరణలు, కంట్రోళ్లు, రేషనింగు పద్ధతులు యేవీ ఆహారకొరతను తీర్చలేకనే పోతున్నవి. ప్రాజెక్టు నిర్మాణాలు తలకుమించినపని, వానలు కురిపించటం అందు బాటులో లేనిపని, కాని భోజనమేమో తప్పనిపని. ఇటువంటి సందర్భంలో పండించ నవసరం లేకుండా పిప్పరమెంట్లు, బిస్కెట్లుమాదిరి బియ్యంచేసి అమ్మితే కావలసినదేమున్నది? కాని ఒక్కటే చిక్కు. ఇంతటి పెద్ద కొరతను తీర్చగలిగే కర్ర పెండలం ఎక్కడి నుంచి వస్తుంది, ఎన్ని రోజులు వస్తుంది? చివరకు ఆపంటనైనా పండించక తప్పదేమో. కాని దీనికి జవాబు మాయాబియ్యం వార్త పక్కనే లభిస్తుంది. ప్రభుత్వంవారు సింథటిక్ రబ్బరు, సింథటిక్ పెట్రోలు మొదలైనవి ఏన్నో తయారుచేయ సంకల్పించుకున్నారు, సింథటిక్ బియ్యానికి పూనుకుంటారు. ఇంక సింథటిక్ కర్ర పెండలం మటుకు చేయలేకపోతారా? కర్ర పెండలంలో నుంచి బియ్యంచేస్తే పాత చేతికర్రలలో నుంచి కర్ర పెండలం సృష్టించగలరేమో. ఏమిటో అంతు లేని వింతలు.

* * * *

ప్రస్తుత పరిస్థితులు

రాద్ధాంత సిద్ధాంతాలు '

మద్రాసు మెడికల్ కాలేజిలో వుపన్యసిస్తు డాక్టరు కె. సి. కె. ఇ. రాజా జనసంఖ్యను ఒక హద్దులో వుంచాలని అన్నారు. సంఖ్య హద్దుమీరిపోతే దేశంలో ప్రజలు ఆరోగ్యం, సంపద, తిండి పెంపొందించుకోవటానికి ప్రభుత్వం యేవిధంగాను సహకరించ లేకపోతుందని అన్నారు. ఇప్పటి లెక్కల ప్రకారం జనాభా పెరిగిపోతే ఆహార కరువు తప్పదని ఒకళ్లు, కాలేజీలకాటకం నిజమని ఒకళ్లు, ఆరోగ్యభంగమని ఒకళ్లు మొత్తంమీద ఎంతోమంది అధునిక భావసంపన్నులు ప్రతిరోజు యీనినాదమే ప్రతిధ్వనింపచేస్తున్నారు. కేవలం పాశ్చాత్య వ్యామోహంలో వున్నవాళ్లు, బిడ్డలను కని పెంచితే తమ సౌందర్యానికి భంగమనుకునే కుసుమకోమలులు ధనవంతుల యిళ్లలో యిదివరకు కూడా లేకపోలేదు. ఐతే అప్పుడు వారి సంఖ్య చాలా స్వల్పం. ఏది ఐమైనప్పటికి జనాభాను తగ్గించి కరువులు బాపుకోవాలనే మాట వింటుంటే మార్కెట్టు ధర పడిపోకుండ హెచ్చులో వుంచటానికి బంగారంవంటి పంటలను తగులబెట్టే అమెరికను ధనికభావం జ్ఞాపకం రాకమానదు.

ఇప్పుడు రెండేమార్గాలు ఆలోచించాలి, జనోత్పత్తిని అరికట్టటమా, కాక ఆహార వస్త్రోత్పత్తులను అధికం చేయటమా ? మనదేశపు ప్రస్తుత పరిస్థితులకు యేది అనుగుణ్యమో చూడాలి. సంతాన నిరోధ విషయం అంత తేలికైనపని కాదు. ప్రజలు తమ ఆరోగ్యానికి భంగము రాకుండ ఆరోగ్య విధానాల ప్రకారం ఉత్తమ నిరోధక పద్ధతులను అవలంబించటానికి విజ్ఞానం, విద్య అవసరం. అవివున్నవారు మన దేశంలో యీనాడు చాలా తక్కువ. అందులోను ధనవంతులకే ప్రస్తుతం విద్యా విజ్ఞానాలు అందుబాటులో వున్నవి. కాని కేవలం సౌందర్య భంగమని ధనికస్త్రీలు తలంచితే తప్ప సంతానాధిక్యత వల్లవాళ్లకు యిబ్బంది ఏమిలేదు. జమీందారీలు ఎటూలేవు యివ్వటానికి. కాకపోతే తమపొట్ట తాము పోసుకోగల మార్గాన పిల్లలను ప్రవేశపెట్టాలి. అంత మాత్రపు పని యీధనవంతులు చేయగలరు. ఇంక దేశంలో అధిక సంఖ్యాకులయిన బీదల సంగతి చూతాము. అధిక సంతానమువల్ల పేదరికానికి లోటయి బిడ్డలను పోషించలేని, స్థితిలో వున్నవారికి దీని ఆవశ్యకత చాలావున్నది. కాని అక్షరజ్ఞానమే లేని గర్భదరిద్రులు వాళ్లు పుట్టిపెరిగే పరిసరాల్లో, వాళ్ల దరిద్ర వాతావరణాల్లో సఫలంగా సంతాన నిరోధక పద్ధతిని అమల్లో పెట్టగలరని ఆశించటం కేవలం వెర్రి వాళ్లకు ఇప్పుడు ఒక్కసారిగా విద్యా విజ్ఞానాలు ఆకాశం మీదినుంచి వూడిపడవుగదా. క్రమేపిరావలసినదే. అంతకన్నా కొత్త పరిశ్రమలు నెలకొల్పి అధికాహారోత్పత్తి విధానాలు ఏర్పరచి వాళ్లకుముందు బ్రతుకుతెరువు చూపిస్తూదాని వెంటనే చదువు సంధ్యలు ఆరోగ్య సూత్రాలు నేర్పితే అవి చక్కగా గ్రహించుకుని ఆచరించగల సామర్థ్యం వాళ్లకు కలుగుతుంది. పైగా మనదేశంలో తరతరాలుగా బిడ్డలు కలగటం, వాళ్లను కని, పెంచటం ఒక పవిత్ర అంశముగా ఎంచ బడుతున్నవి. నిజమా లేకపకాధ్యమా అనేది అప్రస్తుత విషయం. కాని ఆభావం మటుకు చాలా లోతుగా పాతుకు పోయింది. ఇటువంటి పరిస్థితులలో ప్రజలకు "మీరు యీ విధంగా వ్యవసాయం చేస్తే పంట ఎక్కువ పండుతుంది, మీరు యీ పరిశ్రమను నెలకొల్పితే డబ్బు సంపాదించగలరు" అని చెప్పి వినిపించ గలిగినంత సులభంగా సంతాన నిరోధాన్ని గురించి చెప్పి వినిపించలేరు. అదిక్రమేపి వ్యక్తిగతవి 'కాసంవల్ల తెలుసుకుని గ్రహించుకోగల సున్నిత విషయం.

దేశంలో నిజంగా జనం పెరిగి కరువు ఎక్కువ అవుతూ వుంటే, జనం పెరిగి దేశ ఆరోగ్యం చెడిపోతూవుంటే దేశం బాగు పడటానికి యింతకన్న చక్కని తరుణము లేదని అనుకోవాలి. ఖండఖండాంతరాలకు పై చదువులకు వెళ్లి వచ్చిన ఇంజనీర్లు తమ సున్నిత బుద్ధులను వుపయోగించి దేశ సౌభాగ్యానికి తోడుపడలేరా ? భారతదేశం జపానువంటి అగ్ని పర్వతాలగుట్టకాదు, విశాలమైన సారవంతదేశం, చల్లని నదులు యింకిపోలేదు విదేశాలకు వెళ్లివచ్చిన వైద్య ప్రముఖులు తమ ప్రతిభ సోదరులకు తెలియచేయనే లేదు. ప్రభుత్వం అధికాహారోత్పత్తికి చేయవలసిన కార్యకలాపం ముగియనే లేదు. ఇంతలో నిరాశపడి కూలిపోయి జన సంఖ్యను తగ్గించితేనేగాని బ్రతుకు తెరువు లేదని ఎందుకు భావించాలి ? ఇటువంటి అప్రస్తుత విపరీతపు ఆలోచనలకు లోనైతే త్వరలోనే ఎక్కువమంది బిడ్డలను కన్నతల్లులకి రష్యాలో మాదిరి గౌరవ సత్కారాలు చేయవలసిన అగత్యం కూడ వస్తుందేమో. కాబట్టి కొంచం తమా యించటం శ్రేయస్కరమేమో !

★

ఈనాడు రచయితల కర్తవ్యం

సహారా

కలంపట్టిన ప్రతి వ్యక్తీ కవికాడు. వ్రాత తెలిసిన ప్రతి వాడూ రచయితకాడు. ఇలా అని ప్రతివ్యక్తీ ఒప్పుకుంటాడు. అంటే, సామాన్యునికీ, కవికి, సాధారణునికీ, రచయితకీ భేదం ఉన్నదనీ, కవి కాని, రచయితకాని ఒక అసాధారణ వ్యక్తి అనీ అన్నమాట. రచయితకు యీ (కవులుకూడ ఇందులో చేరుతారు) అసాధారాణత ఎక్కువుంది. రచయిత సాధారణ మానవుడుకాడంటె అర్థమేమిటి? ఈ ప్రశ్నకు సరి అయిన జవాబు చెప్పలేక అతన్నో దేవతామూర్తి క్రిందిలెక్క కట్టేసారు మన పూర్వులు. ఇది తప్పు. రచయిత దేవాంశ సంభూతుడేమీ కాడు. సామాన్యునికన్న అతడు విశిష్టమైనవాడు మాత్రమే. సామాన్యుడు తన పనితాను చేసుకుపోతూంటె రచయిత దీనిని పైనుండి చూసి తప్పొప్పో నిర్ణయించి రచనల్లో చూపిస్తాడు. సంఘంలోని చెడునిచూసి సరిదిద్ద ప్రయత్నిస్తాడు. రచయిత అంటే వట్టి రచనలు సాగించేవాడని మనము అర్థం తీసుకోరాదు. ఇలాని దేవుడు, రాముడు అని వీర పూజకూ దిగరాదు. ఇలాదిగటంవల్ల రచయిత నైతికంగా పాడయిపోతాడు. ఆ పాడయిపోయిన మనస్తత్వంలో, తను చెప్పేది ప్రతీది, తర్కించుకోకుండా చెప్పేసి, సంఘానికి చీడపురుగుగా పరిణమిస్తాడు. మన పూర్వులు కవి, బ్రహ్మతోసమానుడనీ, మహాశక్తి సంపన్నుడనీ, ఏదో దైవశక్తి ప్రేరేపణవల్లకాని అతను కవికాలేడనీ, అంచేత అతడు అతీతుడు, దైవాంశ సంభూతుడనీ భ్రమించేవారు. కవీ, రచయితా సంఘంలోని వ్యక్తులే. రచయిత సంఘంలోవాడే కాబట్టి, సంఘం భావాలు గురించే అతడు మాట్లాడతాడు. సంఘపు చేష్టలే అతన్ని రచనకు ప్రేరేపిస్తాయి. సంఘాన్ని చూసే అతను వ్రాస్తాడు. అంటే సంఘమే అతనికి ఉద్రేకం ఇస్తుంది. ఈ ఉద్రేకమే అతని రచనలకు బీజం. అంచేత అతడు పైనుంచీ ఏ విభిన్నశక్తి ప్రేరేపణచేతగాని, దైవిక ప్రోద్బలంవల్లగాని రచనలు చేయడు అని తెలుస్తూంది.

సంఘమే అతని రచనలను ప్రేరేపిస్తుంది. కాబట్టి అతడు వట్టి రచయితగా ఉండాలని ఎక్కడాలేదు. సంఘమే అతన్ని కవిగాకానీ కథకుడిగా గాని చేసినా అతడు దానికి అతీతుడే. అలా సంఘానికి సహాయకారిగా, సలహాదారుగా ఉండకపోతే అతడూ సామాన్యుడవుతాడు. దీన్నిబట్టి రచయిత అనగానే వట్టి రచనలు సాగించేవాడనిగానీ, దేవుడనిగానీ మనమర్థం తీసుకోరాదని విశదమవుతూంది.

అయితే రచయిత అంటే ఏమిటీ? అని ప్రశ్నవస్తుంది. రచయిత అంటే తన రచనను ఒక ప్రయోజనం సాధించేదిగా చేయగలిగినవాడు అని చెప్పొచ్చు. ప్రయోజనం రెండు రకాలు. ఇందులో మంచి ప్రయోజనమే అతడు సాధించవలసింది. చెడుప్రయోజకత్వం చూపించే రచనల్ని మనము రచనలనలేము, అవి వ్రాసిన వాన్ని రచయితని ఒప్పుకోనూలేము. కాబట్టి, సంఘానికి ఉపయోగకరములయిన రచనలు చేసేవాడే రచయిత. ఇలాకాకుండా రచన రచన కోసమే, కళ కళ కోసమే అనేవాదన మనమసలు ఒప్పుకోము. ఎందుకూ ప్రయోజనకారిగాని రచన ఉండదు. ఒక రచన ఏదో ఒక ప్రయోజనం సాధించాలి అన్నప్పుడు రచన రచనకోసమే అన్న రచనలు అసలు ఉంటాయా? అని మీరడగొచ్చు. ఉండవు, నిజమే. అయితే ఆ ప్రయోజనం—ఆరచన సాధించింది—ఏమిటి? అన్నది ఒక ప్రశ్న. ఒక రచన ఉత్త ఆనందం మాత్రమే ఇవ్వవచ్చు. ఆనందమూ ఒక ప్రయోజనమే అని ఒప్పుకుంటే, మరి అన్నిరచనలూ ఆనందం కోసమేగదా? అని మరొక ప్రశ్నవస్తుంది. దీనికో జవాబు ఉంది. ఒక రచన ఇచ్చే ఆనందం దానిలోని వస్తువుని బట్టి ఉంటుంది. పచ్చిబూతులు, విరహం వస్తువుగల రచనలూ కొందరికి ఆనందం ఇస్తాయి. అటువంటప్పుడు ఇవి సంఘానికి ఉపకారకమైన ప్రయోజనం సాధించినట్లేనా? ఈ రచనలు సాధించిన ప్రయోజనం ఆనందమయితే, ఆ ఆనందం సంఘానికి ఉపకారకరమేనా? కాదు. ఇప్పుడు మనం

ఆనందమూ ఒక ప్రయోజనమైనా అది రచనలోని వస్తువుని బట్టి ఉంటుంది అనాలి. ఈ వస్తువు సంఘానికి ఏమాత్రం అపరికాగూడదు. అందుచేత సంఘానికి ఉపకారమవుతూ ఆనందం ఇచ్చే రచనలు కావాలి. అంతేగాని రచనకోసమే రచన అనేటువంటి రచనలు మనకనవసరం. సంఘంలో జరుగుతున్న సంగతిని రచయిత గ్రహించి తన రచనల్లో చెప్పుతాడు అని మనము అనుకున్నాము. ఈ చెప్పటమనేది ఎలా గుండాలి? చూసింది చూసినట్టు, గ్రహించింది గ్రహించినట్టు చెప్పేయటమేనా. "పేదలు కష్టపడుతున్నారు" అని ఓ రచనలో గట్టిగా చూపించేస్తే చాలునా? రచయిత దానికి కారణాలు తను తెలుసుకుని సంఘానికి చెప్పాలా వద్దా? కారణాలు తెలుసుకున్న తర్వాత అందుకు పరిష్కార మార్గం చూపాలా వద్దా? సంఘంలో అవినీతి, అక్రమం ఉన్నాయని చెప్పితేచాలా? నమ్మేటట్టు కారణాలు ఇవ్వవద్దా? రుజువు చేయవద్దా? సమస్యను పరిష్కరించి ఎలాగుండాలో చెప్పవద్దా? ఇలా ప్రశ్నలు వేసుకుపోతే "చెప్పాలి" అని సమాధానం వస్తుంది. సంఘం మంచికోసం, సంఘంలోని పరిస్థితుల్ని, సంఘటనల్ని నిర్మాణాత్మకంగా విమర్శించి, వ్రాయాలి అని జవాబు వస్తుంది. అంతేకాని "ఇలాగుంది" అనటంతో సరిపోదు. ఉదాహరణకు ఓ రచయిత సంఘంలో "అవినీతి" నంతా చిత్రిస్తాడు తన రచనలో; చిత్రించి ఊరుకుంటాడనుకోండి. అప్పుడు పాఠకుడేమవుతాడు? రచయిత తను చిత్రించిన "పరిస్థితి" ని ఒప్పుకుంటున్నాడో లేదో తెలుసుకోవాలనుకుంటాడు. అదిమంచో, చెడో అడుగుతాడు. రచయిత ఊరికే చిత్రించి, తన అభిప్రాయం ఇవ్వకపోతే పాఠకుడు తప్పు అభిప్రాయంలోపడిపోవచ్చు. రచయిత ఆ "అవినీతి"ని ఒప్పుకుంటున్నాడనుకుంటాడు. దీనినిబట్టి రచయిత తను సంఘాన్ని ఉన్నదున్నట్లు చిత్రిస్తూ దానిపై తన భావాన్ని ఇవ్వాలి, తన ఉద్దేశ్యాన్ని తెలుపాలి; చెడు అయితే విమర్శించాలి; మంచి అయితే ప్రోత్సహించాలి; అని తెలుస్తూంది. అలా కాకుండా ఉన్నదున్నట్లు చెప్పేసి వాస్తవికతను చూపించామనుకోవటం ఉత్తి వెర్రిబాగులతనం; తెలివి తక్కువమాటానూ.

ఇప్పుడు మనకు, రచయిత అన్నవాడు తన రచనల్ని, వాస్తవిక దృష్టితో, ప్రయోజనం సాధించేటట్టుగా, అవి మంచి వయేటట్టుగా, నిర్మాణాత్మకంగా, నిశితంగా చెడును విమర్శించేవిగా ఉంచాలి; వ్రాయాలి అని తెలుస్తూంది. అంతేగాని ఊహాప్రపంచంలో విహరించటంకాని, తను బ్రతుకుతున్న సంఘాన్ని వదలి దూరంగా పారిపోవటం కాని, వ్రాయగూడదు. రచయిత ఊహించే వ్రాస్తాడు. ఆ వ్రాసేది వాస్తవికతకు భంగంగా ఉండగూడదు. అనగా తను 20వ శతాబ్దంలోని సంఘంలో బ్రతుకుతూ, పాతకాలపు ఊహాచిత్రణలలో, దేవకన్యల ఒడుల్లోకాని, బ్రతుకగూడదు. ప్రపంచం ఎప్పుడూ మారుతూ ఉంటుంది. నేటి నీతులు రేపు అవినీతులు అయిపోతున్నాయి. ఇటువంటి సమయంలో సంఘంలోని సంఘటనల్నీ, పరిస్థితుల్నీ ఆమూలాగ్రంగా అర్థం చేసుకుని రచనలు జరుపాలి. అంతేగాని "పారుబోతు" రచనలు చేయగూడదు. ప్రేమప్రేమ అంటూ ప్రణయ కవిత్వాలు వ్రాయగూడదు. ప్రేమ అనేది సంఘంలోని అనేక సంఘటనల్లో ఒకటి. దీన్ని పట్టుకుని, లేని ప్రేయసిని తలుస్తూ ఊరకే ఏడుస్తూ, అదో గొప్ప సంస్కారమనుకుంటూ, ప్రజలకి ఇదే ముఖ్యమైన సమస్య అనుకుని (తనకు కాబట్టి), దీనికి సంబంధించి సంఘానికి ఏమీ ప్రయోజనం (చివరకు ఆనందమైనా) లేని విరహ, ప్రణయ, కవిత్వాలు వ్రాసేవాళ్ళు సంఘానికి అపకారంచేసే రచయితలు. వీళ్ళవల్ల ఉపకారమేమీలేదు సంఘానికి అంటే—అదే పెద్ద అపకారం. ఎందుకు వీళ్ళు రచనలు చేస్తున్నట్టు? రచనల కోసమే! ఇది మహా ప్రమాదకరమైన సాహిత్యవిధానము. ప్రజల సమస్య ఎదుర్కొని వాటికి పరిష్కారం చూపలేని వీళ్ళు ప్రజారచయితలు కారు.

చాలామంది రచయితలు తమ వ్యాసాల్లోనూ కథల్లోనూ, పద్యాల్లోనూ ప్రయోజకత్వం చూపిస్తూ సంఘంలోని కుళ్ళు కడిగేస్తూ, సంఘానికి ఉపకారం చేయవలసిన అవసరం ఈ నాడు ఎంతేనా ఉంది. ఈ నాడు రచయితలు ప్రజల్ని ఎదుర్కొంటున్న అనేక క్లిష్టసమస్యల్ని పరిష్కరించాలి. తమ వ్యాసాల్లో ప్రభుత్వానికి సలహాలూ, విమర్శలూ ఇవ్వాలి.


ఈనాడు రచయితల కర్తవ్యం

తమ కథల్లో సాంఘికపరిస్థితులు ప్రతిబింబించాలి. సంఘం లోని అవినీతి, లంచగొండితనం, అధికారవ్యామోహం, ఆర్థికదుస్థితీ, అసమానత్వం, స్త్రీలపట్ల అనుమానాస్పద మైనవీ, జుగుప్సాకరమైనవీ, అస్వాతంత్ర్య ప్రదాతలైనవీ అయిన పరిస్థితుల్నీ విమర్శించి, సంఘానికి వెలుగుచూపాలి. కవులు తమ పద్యాల్లో ఆశయాల్నీ, వినూత్న విశిష్టభావాల్నీ, ఆదర్శ జీవితాల్నీ చూపించాలి.


ఈనాడు ప్రపంచం అంతటా యుద్ధభయం ఆవరించింది. శాంతిలేదు. అల్లకల్లోలంగా ఉంది. సామాన్యుని జీవితం దినదిన గండంగా ఉంది. అతడు ఆర్థికంగా అధ్వానపు స్థితిలోఉన్నాడు. రాజకీయంగా పలుకుబడి లేనివాడుగా ఉన్నాడు. సాంఘికంగా మూఢవిశ్వాసాలతోటీ, దురాచారాలతోటీ చుట్టుముట్టబడి నిరాశావాదంలో పడిపోయాడు. నైతికంగా పతనమైపోయాడు. ఇవేమీ పాలకుల కండ్లకు కనబడటంలేదు. సామ్రాజ్యాలకోసం, అధికారం కోసం వారు ప్రాకులాడుతున్నారు. యుద్ధాలకు దిగుతున్నారు. సామాన్యుని తమ దుష్టచేష్టలకు వినియోగించుకుంటున్నారు. వీళ్ళదుర్మార్గపు పనులకతడు బలి అయిపోతున్నాడు. కొరియాలో పడిన బాంబులకు ఎవడు నష్టపోయాడు? సామాన్యుడు. ఇలా ఏవిధంగా చూచినా సామాన్యుని జీవితం ఉక్కిరి బిక్కిరయిపోతున్నది.

ఈనాడు రచయితలు దేశానికి చేయగలగిన సేవఎంతైనా ఉంది. అది అపారం. అది అనంతం. వాళ్ళ కలాలు సామాన్యులనేస్తాలై, మిత్రులై వాళ్ళకోసం నడవాలి. ప్రపంచంలో శాంతిని కోరాలి. నలుగుతున్న అశేష ప్రజానీకానికి ధైర్యాన్ని, స్థైర్యాన్నీ ఇచ్చి ఆశావాదులుగా చెయ్యాలి. సంఘంలోని అవకతవకలకు స్వస్తిచెప్పి శాస్త్రీయమైన పంథాను చూపాలి. మూఢ విశ్వాసాల్నీ, కుల మతవిభేధాల్నీ నశించాలని కోరాలి, నశింపజేయాలి. తమ రచనలుద్వారా సామాన్యునికి వెలుగూ, ప్రగతీ, శాంతీ, సమతా, గౌరవం ఇప్పించాలి. రచయితలు పూనుకుంటే మహానగాలు కరగిపోతాయి, ఉద్వృత విజృంభణాలు జరుగుతాయి, వినూత్న విశ్వాలు వెలుస్తాయి, పువ్వులు పూస్తాయి, వెన్నెలలు కాస్తాయి. సోదర రచయితలారా! ప్రపంచ శాంతికి, దేశాభ్యుదయానికి మీకలాల్ని పోనీండి! మీరచనల్ని సాగించండి, పురోగమించండి!

★



లజ్‌పత్‌నగర్, ఢిల్లీలో, కాంది శీక స్త్రీలకు నిర్మించిన కస్తూర్బా నికేతనం వార్షికోత్సవ సందర్భముగ స్త్రీల చేతిపనుల ప్రదర్శనమును సందర్శించుచున్న యూనియన్ అధ్యక్షులు రాజేంద్ర ప్రసాద్



గుఱ్ఱ మెక్కాను
చుఱుక్కు మనికొట్టాను
అది కదల్లేదు
అది మెదల్లేదు
ఈలవేసారు వెనుక
గోలచేసారు ముందు
గుఱ్ఱం బెదిరింది కాబోలు
పరుగుపరుగు
ఒక్కటే పరుగు
ఎక్కడికో! . ...
అరె! అరె!
అంత కంతకు
పైకి లేస్తుంది
పైకి ఎగురుతుంది
చాల పైకి
గాలిలోకి పోదుకదా!
అబ్బ! అబ్బ!
అంత కంతకు
ఎంత వేగం
ఎంత వేగం
గుఱ్ఱపు చెవులు
గట్టిగా పట్టుకొన్నాను.

అమ్మో! అమ్మో!
అదిగదిగో
జారి పోయింది
పరికిణీ ఒడిలోనుండి ·
పడిపోయింది
అమ్మకొన్న,
బొమ్మ! బొమ్మ!
ఛీ! పాడుగుఱ్ఱం
కొట్టినా ఆగదు
తిట్టినా ఆగదు
ఏమి చెయ్యను
ఏడుపొచ్చింది
కళ్లు మూసుకొన్నాను
పళ్లు బిగపట్టాను
భయం! భయం!
పడి పోతాను
పడి పోతాను
కటిక నేలమీద
కంకర్రాళ్లమీద
అమ్మో! అమ్మో!
అని
అరవాలనుకొన్నాను

మాట రాలేదు
మనిషెవరో
గట్టిగా
పట్టుకొన్నారు
నన్ను కాదు
నాగుఱ్ఱాన్ని
కళ్లు తెరిచాను
కళ్లెం లేని గుఱ్ఱం
కదలకుండా నిలబడింది
నేను పడిపోలేదు
దర్జాగానే ఉన్నాను
ఇంతకూ ఇది చదివి
ఏమనుకున్నారు మీరు
కలనుకొన్నారా?
కల కాదు
కల్ల కాదు
నిజంగా జరిగింది
నిన్న మధ్యాహ్నం
మద్రాసులో
మైలాపూర్ దగ్గర
రంకుల రాట్నంలోపల
రంగుల గుఱ్ఱంమీద.

★



క్రొత్తసంసారం

* * *

నాటిక

* * *

శ్రీ ఆయపిళ్ల సత్యనారాయణమూర్తి

దృశ్యము ౧

సమయం : సాయంత్రం అయిదుగంటలు.

స్థలం : భూషణంగారి యిల్లు.

(భూషణం దుస్తులు వేసుకుని వాలుకుర్చీలో కూచుంటాడు కమలం ఆ ప్రక్కనె కుర్చీలో కూచుని తమలపాకులు మడతలు చుట్టి అతనికి ఇస్తూ వుంటుంది.)

కమలం : వీధిలోకి వెళ్తున్నారు కాబోలు. ఇవ్వాళన్నా మరచిపోకుండా నే చెప్పిన సామానులు తీసుకురండి.

భూషణం : బజారులేకుండా ఒక్క రోజన్నా గడవదుకద ఈజీవికి. ఆఫీసునుండి చచ్చి చెడి వచ్చి తర్వాత సంచీ బుజాన్న తగిలిస్తూ వుంటావు.

క : (జాలిగా) ఏంచెయను చెప్పండి. నాకూ విచారంగానే వుంది. మీరు నొక్కమారుగా నెలవారీ సామానులు జాబితా ప్రకారం తేరుకదా. ఈమాత్రం దానికి పద్దులు, జాబితాలు ఎందుకంటారు. నాకుమాత్రం సరదాయేం చెప్పండి మిమ్మల్ని త్రిప్పటానికి.

భూ : అబ్బే. అంతమాత్రాని కిలా నొచ్చుకోవడం ఎందుకు చెప్పు. ఊరికే హాస్యానికన్నాను. కాకపోయినా నేను ఎక్కడకు తిరగడానికెళ్లాలన్నా బజారుగుండా నేకదూ పోవాలి.

క : పోనీయండి. ఈ నెలలో సగంరోజు లెల్లాగు గడచి పొయ్యాయి. వచ్చే నెలలో ఫస్టుతారీఖునాడే సామానులన్నీ కొని పడేయండి. ఆ తరువాత ఒక్కనాడన్నా మిమ్మల్ని బజారుకు వెళ్లమంటె అట్లా అనండి.

భూ : అలాగేచేద్దాంలె. నేవద్దన్నానా ఒక్కసారిగా సామానులు తీసుకువచ్చినట్లయితె కూలి డబ్బులు దండుగవును కదా అని వెనుదీస్తున్నాను గాని—

క : (చిన్నగా నవ్వుతూ) మీరు ఏడిచేదాన్ని నవ్విస్తారు. మహా పొందిక చేశారులెండి సంసారం .. వెధవ కూలి డబ్బులు మీరు ఎంత ఇచ్చెయ్యాలి కనుక. ౧౦ పెడు సామానులు మోసుకొస్తే అణన్నర ఇస్తారు. మీరు బజారుకు వెళ్లవలసివచ్చినప్పుడల్లా ఎంతని కర్చు చేస్తున్నారు.

భూ : చేస్తూన్నాను. ఇకముందు చెయ్యనుకదూ...పర్సు కూడ నీచేతిలోనేవుంది. నీవేది తెమ్మనమంటె అదే తెస్తాను. నాకేం—లాభనష్టాలు నీవే సుమా ! ..

క : నాకు నష్టం వద్దు. లాభం అంతకన్న వద్దు నాకెందుకిచ్చారు డబ్బు—వద్దంటూవుంటె. ఈ నెల సొమ్ము నాచేతికిచ్చారు. పోనీండి. నే తెమ్మన్న సామానులూ తేవడము లేదు.

భూ . ఎందుకు తేవడం లేదు ? నేనేంమానివేశాను చెప్పు ?—

క : ఏమిటి చెప్పేది ! నిన్నను చెప్పిన వాటిలో ఒక్కటయినా తేకుండా కాళీసంచి నా మోహంమీద పడేశారు.

భూ : ఆఁహాం...నిన్నటి దారివేరు. ఇవ్వాళ అక్షరాల జరిపించక పోయినట్లయితే ఇంట్లో అడుగుపెట్ట నివ్వరు—

క : (కోపంగా) అలాగే అనకండి సామానులు తేకపోతే మానిపోయె—కలిగినదాంట్లో వండిపెడతాను.

భూ . మళ్లా వచ్చేసరికి చీకటి పడుతుంది. నేను వెడతాను. ఏంకావాలో ఇప్పుడే చెప్పు.

క : నిన్న చెప్పాను కదండీ. అవన్నీ తీసుకురాండి—

భూ : నిన్న నేం చెప్పావు ?

క : అప్పుడే మరపు నిన్న నేం చెప్పానో మీరే చెప్పండి...

భూ : చెప్పనా...కూరలు...మరంటె...

క (నవ్వుతూ) కూరలా ? ..కూరలు మిమ్మల్ని తెమ్మన మన్నానా ?

భూ : లేదు కాబోలు ..చెక్కాలూ తమలపాకులూ ..

క : (ఇంకా కొంచెం గట్టిగా నవ్వుతుంది) మీ రెట్లా ఆఫీసులో పని చేస్తున్నారండి. చెక్కాలూ తమలపాకులూ మూడురోజుల క్రిందట వసుదేవమ్మగారి బంట్రోతును బ్రతిమాలుకుని తెప్పించుకున్నాను కదా. నిన్నను మీకవి చెప్పానా...

భూ : మరయితే— ..నెయ్యా...నూనె—

క · అద్దిగదీ (ఇంకా హెచ్చుగా నవ్వుతుంది) నెయ్యా నూనె బజారునుండి ఎప్పుడయినా మీరు తేవడం ఎరుగుదురండీ డబ్బా అయినా, సీసా అయినా మీరు బజారుకు తీసుకు వెళ్లడం నా మోషీతనమని ఎరిగివుండీ వాడిగ్గా నెలవాడిని ఇంటిదగ్గరే కొలిపించుకుంటున్నాను కద ..

భూ · ఏమిటో...ఈ సంసారంలోపడె అన్ని సామానులు నాకు ఒక్కలాగునె కనిపిస్తున్నయ్

క · (నవ్వు సంబాళించుకుని) అంత జ్ఞాపకశక్తి వుందన్న మాట. లేక సంసారమంటె అంత మతిమరపుతనమన్నా వుండాలి...

భూ ఏమన్నా అను. పడక తప్పతుందాయేం...

క : అయ్యో ఎంత సత్యకాలంమనుషులండీ...అందుకనె మామగారంటె అంత·గౌరవం—

భూ సరె—అవన్నీ ఎందుకులె, చెప్పు ఏంకావాలో...

క : మాటరాబట్టి అన్నాను ..నాకు మాత్రం కావాలా ? పాపం ఆ ముసలాయన—

భూ : తిరిగి వచ్చేటప్పటికి చీకటిపడుతుంది కమలం—

క : అయితె జాగ్రత్తగా వినండి. ఆవాలు, జీలకర్ర, ధనియాలు, మెంతులు ఏమీ కూడలేవు. వాయనం ఒకటి వుండిపోయింది. మినపప్పు తెండి. అట్లు వాయనం మిచ్చుకోవాలి.

భూ : సరే ఇంకా ఏంకావాలి ?

క · అబ్బాయికి రెండు రోజులయి ఒంట్లో బాగుండడము లేదు. విరోచనములు వెళుతున్నాయి. డాక్టరుని కనుక్కొని మందు తీసుకురాండి.

భూ : నిన్నను చెప్పావు కావేం ..ఏడీ అబ్బాయి ?

క : నిద్దురపోతున్నాడు లెండి.

భూ : అయితే వెళ్లనా ..డబ్బు ఇస్తావేమిటి ?

క : నిన్నను ఇచ్చిన డబ్బు ఏంచేశారు ? ఏ సామానుతే లేదు కద...

భూ : అది తిరిగి ఫిరాయిస్తానుకదూ.

క · నా చేతికి డబ్బు ఇవ్వడ మెందుకు ఇట్లా ఖర్చు చేయించడ మెందుకు చెప్పండి. నాకేం—మీరు అడిగినంత ఇస్తాను. పద్దురాస్తాను. ఇదండి పదిరూపాయల నోటు.

భూ · వెళ్తున్నాను. (డబ్బు తీసుకుని త్వరత్వరగా నడిచి వెళతాడు.)

క : (గదిలోనుండి వీధి గుమ్మంలోకి పరుగెత్తుకునివచ్చి కేక వేస్తుంది ? ఏమండీ ?

భూ : (రోడ్డు మీదనుంచె) ఏం ?

క : మాట. ఇట్లారాండి...

భూ: (వచ్చి) చూశావా. నీకట్లా మతిమరపుతనం హెచ్చు. నేను సగం దారికి వెళ్ళగానె తిరిగి ఏమో నీకు జ్ఞాపకం వచ్చి వుంటుంది.

క: పోనీండి నే నొట్టి మతిమరపుదాన్నిగాని మీరు వెళ్తూన్నది బజారుకేనా ?

భూ: కాకేం ?

క: సామానులు గంపకెత్తుతారా లేక జేబుల్లో పోసుకు వస్తారా ?

భూ: అహ్హా...సంచీ మరిచిపోయాను.

క: అన్నీ మరచిపోతారు డబ్బు మట్టుక్కుదండి మరీ పుచ్చుకున్నారు. సంచీ ఇదిగో సామానులు మరిచి పోండి చెప్తాను ఇవ్వాళ—

దృశ్యం ౨

స్థలం: దారిమధ్య

సుబ్బారావు: ఏమిరోయ్ భూషణం, అయిదు గంటల కల్లావచ్చి ఇలా పడిగాపులు పడుతున్నాను. నీ తో ఏ వ్యవహారం అనుకున్నా డిసెప్పాయింటు చేస్తావు. ఆరు గంటలు కొట్టేశారు.

భూషణం: క్షమించరా సుబ్బూ! ఓ అరగంట అటో ఇటో అవుతూవుంటుంది. ఆఫీసునుండి ఇంటికి వెళ్లి బట్టలు మార్చుకునిరావాలా.

సు: నేను మట్టుకు అలాగ చేయలేదురామరి. అనుకున్నట్లు వస్తే ఇవ్వాళ సినీమాకు వెడదాం అనుకున్నాను.

భూ: నేనూ అలాగునె అనుకున్నాను. కాని ఎట్లాభాయ్. ఏదో ఇంత సంసారం అంటూ తగలడ్డ తర్వాత...

సు: మహా కబుర్లు చెప్పకురా. నేను మట్టుకు సన్యాసినా ?

భూ: అలా అనకు. ఇస్తోకుల్లాగ నువ్వూ, నీభార్యాయే కదూ. అందువల్ల ఇట్లా వెడతావు అట్లా వచ్చేస్తావు.

సు: అక్కడకు నీకే మహాసంసార భారం చుట్టుకుంది. నిన్న గాక మొన్న ఓ లౌడి లెడు పుట్టుకొచ్చాడు. అందుకనె కదూ ఈ సడింపు.

భూ: ఈ సడింపు కాదురా సుబ్బూ. లౌడి తడన్నావా.— వాడితో ఎంత హైరాన పడుతున్నానో తెలుసా. పదిమంది పెద్ద మనుషుల్ని సులువుగా భరించవచ్చును గాని, ఒక్క చంటి పిల్లణ్ణి భరించడంలో మహ తంటా లున్నాయిరా. వాళ్లకు బోలెడన్ని ఇతర సౌకర్యాలు చూడాలి. ఉగ్గులుండాలి పాలుండాలి ధూపం వేసే సాంబ్రాణిలగాయతు, సమస్తమయిన సరంజామా రిజర్వులో వుంచుకోవాలి. నే చెప్పడం ఎందుకులె నీకు పుట్టనీ అప్పుడు తెలుస్తుంది.

సు: వద్దురాభాయ్. అసలు లక్ష్మి, నేనూ ఆవిషయంలో మహా ఖరాఖండీ చేసుకున్నాము. వాళ్లు పుట్టడంలో తల్లి ఆరోగ్యంకూడ కొంత తగలడుతుంది. ఆ తరువాత కాకి చూపులె చూస్తారు మన అర్థాంగులు. ఈ విషయం గురించి ఓ పెద్ద ఆర్టికలు వ్రాశాను. ప్రెస్ కిద్దామని గాని లేక రేడియోలో ఉపన్యాసం ఇద్దామని గాని చూస్తున్నాను. పార్కులోకి వెడదాం రా. అది వినిపిస్తాను.

భూ: అంత ఉపయోగకరమయిన విషయాలంటే తప్ప కండా రేడియో ప్రసంగం ఇద్దువుగాని—పార్కులోకి వెళ్లడం తరువాత చూద్దాంగాని ముందుగా డాక్టరుగారి దగ్గరకు వెళ్లాలయ్యా. మా బిడ్డగాడికి వొంట్లో బాగుండ లేదుట .

సు: చెప్పావు కావేం ఏం జరిగింది ?

భూ: అబ్బే ఏమంత ప్రమాదం లేదోయ్. విరోచనాలకు మందు పుచ్చుకోవాలి.

సు: ఈ భాగ్యానికి డాక్టర్లెందుకురా భూషణం ? నేచెప్తా విను. ఎప్పుడన్నా సరె ఇల్లాంటి చిన్నచిన్న విషయాలకు డాక్టర్ల దగ్గరకు పరుగులెత్తకు అందులోనూ చంటి పిల్లల విషయాల్లో డాక్టర్లను పూర్తిగా ఎడబెట్టాలి.

భూ: మరెట్లా, జబ్బుచేస్తే ?

సు: ఆ మాత్రం స్టడీ చెయ్యాలయ్యా. పత్రికలు తిరగేసి ఎడ్వర్టయిజుమెంట్లు చూస్తే మనకే తెలుస్తుంది. కొన్ని

కొన్ని రోగాలకు పేటెంటు మందులు అను దినమూ ఎడ్వర్టయిజు చేస్తూనేవుంటారు. నిత్యయౌవ్వనానికి, బలానికి, ఆనందానికి, ఆరోగ్యానికి, శరీరపుష్టికి, ధాతు వృద్ధికి—ఒక టేమిటి. అన్నిరకాలకు ప్రకటనలుంటాయి. మనలోటుపాటుల్ని చూసుకుని అలాటిమందులు ఉప యోగించుకుంటేనే మంచిది. అంతేగాని మనదేహం డాక్టర్ల కిచ్చామా ఇల్లూ ఒళ్లూ గుల్ల చేసేస్తారు. మాటకు. మా ఆవిడకు తలనొప్పిట. ఇదిగో అమృతాం జనం కొన్నాను.

భూ : ఓరి నీ అసాధ్యంగూల . ఎంత లెక్చరిచ్చావు. కాని మా కమలం ముందు లెక్చెర్లు పనిచెయ్యవోయ్. నోరు కట్టి పడేస్తుంది.

సు : చాతకాకపోతెసరి. ఈ రోజు నేనూవచ్చి ఆనోరు కట్టి పడేయడమేదో చూస్తాను.

భూ : అంతకన్న యేంకావాలి ? కాని ఇప్పుడేంచెయ్య మన్నావు ?

సు : ఆముదం పట్టదటోయి మీ అబ్బాయికి ?

భూ : పట్టకేం-నోరు పగల్దీసి మరీపడుతుంది.

సు : అయితే డాలరుమార్కు పట్టుకు వెళ్లు.

భూ : ఇంట్లో వున్నదయ్యా. మూడు రోజుల క్రిందటనె సీసాడు పిల్లల ఆముదం లాక్కెళ్లాను.

సు : ఆముదం పనిచెయ్యలేదేమో. కొందరి పిల్లల కాలాగునె అవుతుందిలె.

భూ : అందుకనె డాక్టరు దగ్గరకు వెళ్లమని వుంటుంది.

సు : దానికి నేను ఫస్టుక్లాసయిన ప్రిస్క్రిప్షను చెస్తానుండు. బ్రూకులాక్స టాబెలెట్సు కొనవయ్యా. ఒక అరమో తాదు ఇచ్చావా ఝూడించి కాకపోతె అట్టాగను.

భూ : పద—అట్లాగె కొందాం.

సు : సీనీమా ఎట్లాగూలేదు కద. కాఫీక్లబులో కాస్త నాస్తా వేసుకుని అలాపార్కులో కూచుని మరీపోదాం. వ్యాసాలుకూడ జేబులోనె వున్నయ్.

దృశ్యం 3

సమయం : 8-30 గంటలు.

స్థలం : భూషణంగారి ఇల్లు.

(ప్రవేశం—భూషణం, సుబ్బారావు పెద్ద పెద్ద పొట్లాలు చేతులతోను, మరికొన్ని పొట్లాలు మోచేతికి, గుండెకు ఆన్చుకుని వస్తారు)

భూషణం : అబ్బబ్బ ! వెధవబజారు మయిలున్నర దూరం వుంది. అక్కడనుండి సామానులు ఎత్తుకు వచ్చేటప్పటికి చేతులు నొప్పులు పట్టుకున్నయి.

క : అదేమిటి ! సామానులు చేతులతోను, తలమీద పెట్టుకొని మోసుకొస్తున్నారు. అలా మోసుకుని వస్తే చేతులు నొప్పులు పెట్టవ్ చెప్పండి. .అదిగో సుబ్బా రావుగారు కూడ వచ్చారు ఆయన్నెందుకు హింస పెట్టారు, ఇంత రాత్రప్పుడు—

భూ : మగవాడన్నవాడు—అందులోనూ సంసారి అయిం తర్వాత హింసకాకుండా ఎట్లా అవుతుంది. నాతో పాటు వాడూ బజార్లన్నీ తిరుగుతూ కూచున్నాడు. ఆఖరుకి సామానులు మోయడములోనూ పాలు పంచు కొన్నాడు. సుబ్బు కాఫీ అన్నా తాగలేదు కాబోలు.

క : ముందు తమమాట శలవియ్యండి. మీరు గుమ్మం ఎక్కుతూ వుండగానె చూసి పొయ్యిమీద నీళ్లు పెట్టి వచ్చాను. పొట్లాలన్నీ ఇంత పెద్దవిగావున్న య్యేమిటి? నేను చెప్పినవి తెచ్చారా లేదా ?

భూ : అక్షరాలా నువ్వు చెప్పినవే తెచ్చినాను.

క : ఈ పొట్లాం ఇంత బరువుందేమిటి ? ఏమిటివి ?

భూ : బెల్లం—వీశన్నర తెచ్చేను. నెలాఖరువరకు వస్తుంది మనకు.

క : బాగానేవుంది.. .ఇదేమిటి ..పంచదార ! ఇది.. చింతపండు ! ..ఇది !—ఉప్పు ! . ఇంతఉప్పు తెచ్చా రేమిటి ? ఎన్ని శేర్లేమిటి ?

భూ: రెండు శేర్లు ఉప్పు తెచ్చాను. మనం కావలిస్తే ఉప్పు అప్పులిచ్చి అప్పులిచ్చే వాళ్లనిపించుకొని పలుకుబడి సంపాయిద్దాం.

క: కావలసినంత పలుకుబడి! ఉప్పు అప్పులిచ్చి తిరిగి వాపసు కోరకపోయినట్లయితే రేపట్నుండి మీరు ఉప్పు గనులు త్రవ్వేందుకు వెళ్లాలి. పోనీండిగాని—ఉప్పు నేను చెప్పలేదే.

భూ: నీవట్లా అంటావని నాకు తెలుసును. అవన్నీ అక్షరాలా నువ్వు అనుజ్ఞయిచ్చిన సామానులె. నీకు తగనిమరపు, పైగానన్నంటూ వుంటావు.

క: (నోరునొక్కుకుని) ఊ—వ్వు! ఇవ్వన్నీ నేను చెప్పిన సామానులా. నేను చెప్పిన సామానుల్లో ఒక్కటున్నా తేవడము లేదు. అనుకుంటూనేవున్నాను ఇలా జరుగుతుందని. వెధవ ఉప్పు ధర ఎక్కడన్నా ఒక్కటే కదా—అంత దూరంనుండి మీరు మోసుకు రావడం ఎందుకు చెప్పండీ. ప్రక్క వీధిలో వెంకటరాజు కొట్టు మీద పస్తుతారీఖునాడె అర్థశేరు ఉప్పు తెప్పించాను. ఇంకాసగానికి తరగడం లేదు.

భూ: సరె—ఉప్పు అధికంగా తెచ్చాననుకో!

క: తక్కినవి మట్టుకునే చెప్పానా?

భూ: లేదూ? మరేమిటి నువ్వు చెప్పావు?

క: నేను చెప్పిన సామానులు మీరు జేబుల్లో వేసుకు రావచ్చును. అందుకనె అంతచిన్న సంచీ యిచ్చాను. ఆవాలు, ధనియాలు—

భూ: అహ్హా ..సరిసరి జ్ఞాపకానికి వచ్చేసినవి. ఆవాలు, మెంతులు ధనియాలు, జీలకర్ర. బుర్రపగులకొట్టుకుని మరీ ఆలోచించాను. అన్ని వరుసల సామానులూ జ్ఞప్తికి వచ్చాయి. తమలపాకులు, చెక్కలు—నేతులు, నూనెలు—లవంగాలు, ఏలకులు—పప్పులు, కూరలు—అబ్బే—ఇవేవీకావు ఆఖరుకు పంచదార, బెల్లం, ఉప్పు, చింతపండు వరుస జ్ఞాపకానికి వచ్చి అవికొనేశాను.

క: ఏదో ఒకటయ్యింది లెండి—ఈ పెద్దపొట్లా లేమిటి?

భూ: శనగలు—

క: శనగలు!—శనగ లెందుకూ?

భూ. నాకు పరధ్యానం వున్నదని కట్టుగాని నీకు నాకన్నా రెండురెట్లు మతిమరపుతనం వున్నది. వాయనం ఇచ్చుకోవాలని నువ్వు చెప్పలేదూ?

క. అయ్యో! వాయనానికి శనగలు తెమ్మనమని ఎవరు చెప్పారు?

సు: చెల్లెమ్మా!. .అతడినేమీ అనకండి...ఆ తప్పునాది. తనుకొన్న వరుసలో కాని మరొకవస్తువు మీచెల్లి చెప్పిందయ్యా అని భూషణం తెగ ఆలోచించాడు. ఆఖరుకు వాయనం అన్నదే జ్ఞాపకం తెచ్చుకుని నన్నడిగాడు, వాయనానికి ఏమి కావాలిరా అని...మొన్న మా లక్ష్మి వాయనానికి శనగలు ఇచ్చుకుంది. అందుకని శనగలు కొనవోయి అని నా అమూల్యమయిన సలహా యిచ్చాను. అక్కడకూ కాస్త వయిసు తీరినవాడని, కుటుంబ భాధ్యతలు ఎరిగి వున్నవాడనిన్నీ కోమటి ఆయన్ను కూడ అడిగాము. కోమటి అబ్బి స్పెషు్యలేషన్ కరక్ట యింది. కాని డబ్బు ఎక్కువ కాజెయ్యటానికి నాడల్లా చెబుతున్నాడని వాడిమాట తోసిపారవేశాం—

క: వాడు చెప్పిందేమిటి?

సు: ఒకటోరకం గుణుపురం పచ్చి పెసలు!

క: వాడిబొంద! ..నా అట్లవాయనం వుండిపోయింది. మినప పప్పు తీసుకురాండీ అంటె—

భూ. హా తెలిసెజ్ఞ మూర్ఖుడ, నయోగ్యుడ, నప్రాచ్యుడను ఎంత తెలివిమాలిన తనం—

క: బాగున్నయి మీ మాటలూ తమాషాలూనూ—ఇదేం నాటుంకం కాదు. పేరంటాళ్లకు కూడ చెప్పకున్నాను. ఇవ్వాళ రాత్రికి నానవేస్తేనేగాని రేపటికి రుబ్బుకోటం కాదు. ఎట్లా ఏడిచేది చెప్పండి—

భూ: రేపట్లో నీ అట్లవాయనం నిర్విఘ్నంగా కొనసాగించేందుకు ఈ దీనుడు శపథం చేస్తున్నాడు, సరికదా. అంతగా కావలిస్తే రేపు ఉదయాన్నె నాలుగు కాఫీ క్లబ్బుల్లోని మినపచోపీ రిజర్వు చేయించి, అక్కడనే అట్లుపోయించి వేడివేడిగా అట్లు ఇంటికి లాక్కొస్తాను.

క : ఇంటి కెందుకూ. పేరంటాళ్లను కూడ అక్కడకే రప్పించి ఇప్పించి వేయండి .. డాక్టరుగారి దగ్గరకు వెళ్లారా లేదా ?

భూ : జీ హుజూరు ! నీవు చెప్పినది ఏదిమానివేశాను గనుక .. కాకపోతే సామానులు అటునుండి—ఇటు అయినవి. దాసుమందు తీసుకుని వచ్చాడు— ఇదిగో ! ..

క : ఏమిటీ బిళ్ల ?

సు : అది బ్రూకులాక్సని అమోఘమయిన మందులెండి. పెద్దలకు అయితే పూర్తి బిళ్ల, పిల్లలకయితే ఒక అర బిళ్లచాలును. తినుటకు మంచి రుచికరముగ కూడ నుండును. పథ్యము అవసరములేదు. నిద్రబోయే ముందు వేడినీళ్ల అనుపానంతో సేవించినట్లయితే తెల్లవారేసరికి—

క : అయ్యో కర్మమా ! ఇదెవరు తెమ్మన్నారండీ ?

భూ : అది నీవు తెమ్మన లేదుగాని డాక్టరుగారి వద్దకు వెళ్లమన్నావు. నా కామాత్రం మతిలేదనకు. డాక్టరు మట్టుకు ఏవో వెధవనీళ్లిచ్చి పిల్లల ఆరోగ్యం చెడగొట్టేస్తాడు. అందువలన సాధ్యమయినంత మట్టుకు మన మంచిచెడ్డలు మనం చూసుకుని ఆరోగ్యాలకు ప్రత్యేకించి తయారు చేయబడ్డ మందుల్ని వాడుకోవాలి. ఇట్లాంటి అల్ప విషయాలకు డాక్టర్ల కెందుకు డబ్బు పొయ్యడం చెప్పూ.

క : బ్రూకులాక్సంటే నాకు తెలియదుటండీ... కాని ఇంట్లో నీసాడు చిట్టాముదం వున్నదికదా యీమందు ఎందుకు తెచ్చారూ ? విరోచన సాధకానికి మందెవరు తెమ్మన్నారు ?

భూ : నువ్వేమన్నా అను. పిల్లని విరోచనాలగురించి నువ్వు చెప్పేవు. నువ్వు మాటలు మార్చేయకు నా చెవుల్ని మెస్మరిజం చెయ్యకు.

క : ఇంకేం చేయను ! నేన్లూ చెప్పింది మీరుకాదూ అంటె బుజువా, సాక్ష్యమా ? పిల్లడివొంట్లో బాగులేదు. విరోచనాలు వెళ్తున్నయి డాక్టరు దగ్గరకి వెళ్లండీ అంటె—

భూ : హా హతోస్మి ! హతోస్మి శరణం గచ్ఛామి శరణం గచ్ఛామి.

సు : పొరపాటు జరిగిపోయింది ! ఏమిటి చేస్తాం. అప్పుడప్పుడు అలాటి చిన్నచిన్న పొరపాట్లు వస్తోంటాయి. ఆడవాళ్లు మట్టుకు చెయ్యరా ఏమిటి ? తప్పులుగాని మానవుడు చెయ్యక పోతే పశు పక్ష్యాదులా యేమిటి చేస్తాయి ? అక్కడకూ పాపం పిల్లడికి బాగులేదని, డాక్టరు దగ్గరకు వెళ్లాలని మహా ఇదయ్యాడు. డాక్టరు మట్టుకు మనిషికాడాయేం ? వాడూ చదువుకు సంపాయించిన జ్ఞానమేనా. ఆ మాత్రం మనకు సాధ్యమయినంతలో మనమే జాగ్రత్త పెట్టుకోవాలి. ఇంగ్లీషువాళ్ల ఇళ్లల్లో చిన్నచిన్న డిస్పెన్సరీల్లా వున్నన్ని మందులుంటాయి. విరోచనాలకు మందు అనుకున్నాడుగాని, అవి కట్టడానికి అనే స్వల్పవిషయం జ్ఞాపకానికి వచ్చివుంటె దానికి సరిఅయిన మందేకొని వుందుము.

భూ : పోనీవయ్యా సుబ్బా ! ఆ మందేదో చెప్పుదూ. చప్పున వెళ్లి కొనుక్కుని వచ్చేస్తాను.

సు : (ఆలోచిస్తూ) బ్రూకు లాక్స్ .. ఆc... కాస్టోఫిక్ ... తరువాత బైలు బీన్సు... ఇంకా బీటాలాక్స్ .. ఇదేమిటి ! అన్ని మందులూ సాధకానికేగాని అరికట్టడానికి ప్రచురిస్తున్నట్టులేదే !

క పోనీండి. ఆ మందు మీరు కనిపెట్టి తయ్యారీచేసి ప్రకటిస్తో వుండండి. మాంచి బిజినెస్ !—

భూ పాపం. సుబ్బును అంత అనాడీ చేసేశావు. వొంటికి ముప్ఫైఏళ్లు వచ్చిన సుబ్బు ఇంతవరకు డాక్టరు మొహం ఎరగడు. కాపరాని కొచ్చిం దగ్గర్నుంచీ వాడి భార్య లక్ష్మికూడ ఎప్పుడూ మందులన్నా డాక్టర్లన్నా విసుక్కుంటుందిట. అదిగో పాపం లక్ష్మికి తలనొప్పిట. అమృతాంజనం కొని పట్టుకు వెళుతున్నాడు.

క : లక్ష్మికి తలనొప్పా ? (గట్టిగా నవ్వుతూ) అబ్బ ! నా కిప్పుడు తలనొప్పి పెడుతూంది. ఆమెకు తలనొప్పి అని ఎవరు చెప్పారు ?

సు : కాదా ? ఆహా ..ఎంత పొరపాటు జరిగింది. ఒంట్లో భారంగావున్నది అని చెప్పింది. కడుపు నొప్పి అయ్యేంటుంది. కడుపును నులిమివేసేబాధకు అమృత చాల మంచి టానిక్కు. అది ఒక సీసాకొని తీసుకు వెడతాను.

క : (తిరగ బడినంతగా నవ్వుతుంది) మీరిద్దరూ జీవామృతం వాడడం మంచిది. పోయిన జ్ఞాపకశక్తి తిరిగి వస్తుందిట. ఇద్దరూ కలిసి ఓ డిస్పెన్సరీ అన్నా పెట్టుదురూ. వెధవ ఉద్యోగం ఎటూచాలదు. మీకూ పాపం కబుర్ల కాలక్షేపమూ అవుతుంది. సర్వ స్వతంత్రమయిన హోదా (నవ్వుతూ) కాని—మీ రిచ్చే ప్రిస్క్రిప్షనులకు కొన్ని రోజులయిన తరువాత భూమిపై నరపురుగు అంటూ వుంటుందాఅన్నదే అపనమ్మకం. (నవ్వు సంబాళించుకుని) అబ్బ! సాయంత్రం మీ—ఇంటికి వెళ్లాను. లక్ష్మికి తలనొప్పీలేదు. కడుపునొప్పీలేదు. వేవిళ్లూ, వాంతులూనూ.

సు : ఏమిటీ ? !—

భూ : మరేం—కంగ్రాట్యులేషన్సురా సుబ్బా—

సు : అయ్యో ! (తలపట్టుకుని కుర్చీకి చేరగిల పడతాడు.)

క : ఏం ? ఏమిటయ్యింది ?—...

భూ : అఁహ .ఏమీలేదు. సంసారం పెద్దదవుతోందికదా. ఈ భారమంతా తనెట్లాగ మోయడమా అని ఆలోచిస్తున్నాడు.

సు : వెళతాన్రా—

క ఉండండి—కాఫీచేసి ఇస్తాను. పాపం చాల అలసటపడ్డారు.

సు వద్దు చెల్లెమ్మా. పాపం మీమరదలు ఎట్లావున్నదో. చప్పున ఇంటికి వెళ్లి చూడాలి. క్షమించండి.

భూ : వెళ్లు తప్పుతుందాయేం—సంసారి వయిం తర్వాత.

(సుబ్బారావు వెళ్లిపోతాడు)

క : అయ్యో సుబ్బారావుగారు ఇక్కడ ఏవో కాగితాలు వదలేసి వెళ్లిపోయారు. వ్యాసాల్లావున్నై ..

భూ : అవన్నీ రేడియో ప్రసంగాల్లే...కాని ఇప్పుడు వాటి ప్రసక్తి సుబ్బులుకూ అక్కర్లేదు.

(ఆలిండియా రేడియో వారి సౌజన్యముతో—)

★

మారిపోతున్నాం

✻ ఆవుల జయప్రదా దేవి ✻

"హల్లో మిష్టర్ రావ్: ఎలా ఉందోయ్ మీ బిడ్డ ఆరోగ్యం? మా పెండ్లికి కూడా ఎగనామం పెట్టేశావు కదూ" అన్నాడు అప్పుడే సతీసమేతంగా హాల్లో ప్రవేశించిన డాక్టర్ మోహన్.

"దైవికంగా కలిసామోయ్ మోహన్, ఎలా ఉందీ మీ హనీమూను?" అన్నాడు రావు. తిరిగి ప్రక్కనే ఉన్న స్త్రీని చూచి కంగారుపడి నాలుక కొరుక్కున్నాడు.

"అందుకే నోయ్, ఇదిగో మా ఆవిణ్ణికూడ తీసుకొచ్చాను" అని భార్యతో "ఇతను నా ముఖ్య స్నేహితుడు మిష్టర్ రావ్" అన్నాడు.

ఆమె కూడా గుడీవినింగ్ అంటే గుడీవినింగ్ అనటం, షేక్ హాండ్సు ఇవ్వటం మన రావుగారిని ఒక్కమాటుగా ఊపివేసాయి. మన సమాజంలో కల్లా ఆవిడే నాగరికతగల యువతనుకున్నాడు. ఆమెనవీనపద్ధతులలో స్మార్టుగా అలంకరించుకున్న దుస్తులు, ఆమె కనబరిచే చొరవా మన రావుగారి మనసుకు బాగానాటి పోయాయి. ఎలా అయితేనేం, ఆసినిమా పూర్తిచేసి బయటుబడ్డారు.

"ఏమోయ్‌రావ్, మేము ఇక్కడే బసపెట్టేయ్యాలనుకున్నాము. పోనీ, మాయింటికి టీ తీసుకుంటానికైనా రావోయ్" అన్నాడు మోహన్.

"ఓ, తప్పకుండా, పెండ్లికి ఏమాత్రం అవకాశం లేక రాలేక పోయానుగానీ, నీవు ఆహ్వానించటమూ, నేను రాకపోవటమూనా?" అన్నాడు రావ్.

మోహనుని భార్య ప్రక్కనే నిలబడి చిరునవ్వుతో.

"మిసెస్ రావుగారు కూడా రావాలి సుమండీ" అన్నది.

ఆమాట వినేటప్పటికే రావుగారి గుండెల్లో యాటం బాంబు ప్రవేశించినంత భయం వేసింది. చివరకు ఎలా అయితేనే గుడ్‌నైట్సు చెప్పుకుని ఎవరిదారిని వారుబయలు దేరారు.

సుందర్రావు అప్పుడే పట్టా తీసుగొని ప్రాక్టీసు పెట్టాడు. పాతికేళ్ళ యువకుడు. నూతనోద్దేశాలు గలమనిషి, సర్దాగా భార్యాభర్తలు విద్యావంతులై ఎంతో సరదగా ఉండాలనుకునేవాడు. అయినాపాపం అతని ఉద్దేశాలు పూర్తిగా నెరవేరలేదు. తన ఉద్దేశాలనుగురించి, జీవితాన్ని గురించి అప్పుడప్పుడూ ఆలోచనలో పడుతూ ఉండేవాడు. శారద కూడా కాస్తోకూస్తో చదువుకున్న మనిషే అయినా ఆవిడ భర్తగారిని పూర్తిగా అనుసరించ లేకపోయేది. ఎంత నాగరికత అయినా స్త్రీలుగానీ, పురుషులుగానీ కొన్ని హద్దులను దాటి పోగూడదు అనేది. ఆ విషయాల్లో భర్తగారితో అప్పుడప్పుడూ వాదిస్తూకూడా ఉండేది. ఎలా అయినా భర్త ఉద్దేశాలతోపాటు తన ఉద్దేశాలూ కలుపుకుని భావిజీవితంలో మాత్రం ఏ ఆటంకాలూ కలుగకుండా చూచుకోవాలని ప్రయత్నించేది.

ఆరోజు నూతన దంపతులగు మోహన్ దంపతులను భోజనాలకు పిలచారు. నవనాగరికురాలైన లతాదేవికి ఎలాగ మర్యాద చెయ్యటం అనే ఆతురతలో ఉన్నాడు సుందర్రావు. హడావుడిగా ఏమేమో సద్దుతూ ఉన్నాడు.

"ఇదుగో, శారదా, అన్నీ తయారు అయినట్లేనా? మరి భిడియపడ కూడదు. నీవుకూడామాతోనే కూర్చుని భోజనం చెయ్యాలి" అన్నాడు రావు.

"మరినేను కూడా కూర్చుంటే వడ్డనెవరూ?"

"పనిమనిషి ఉందిగా. ముందు నీవు అన్నీ తయారుచేసి కూర్చుంటే, తరువాత అది వడ్డిస్తుంది."

"మరి బిడ్డ దగ్గరో?"

"ఫరవాలేదు నిద్రపోయిందిగా. మరి వచ్చేటయిము అయింది. భోజనం చెయ్యగానే పండ్లు, తరువాత తాంబూలం ఇవ్వాలి. జాగ్రత్తచేసావుకదూ."

"అయితే, ఏమండీ; మరి మీనాగరికులకు కూడా తాంబూలం అలవాటేనా ఏమిటి?"

"సరేలే నీవాదన తరువాత చూచుకుందాం, కానీ"

ఇంతలో తలుపుదగ్గర చప్పుడు. వెంటనే ఆదరా బాదరాగా భార్యను పిలుస్తూ పరుగెత్తుకెళ్ళి తలుపు తీసాడు. మోహన్ రావు సుందర్రావు, లత, చేతులూచేతులూ కలుపుకుంటూ గుడీవినింగ్సు చెప్పుకున్నారు. అప్పుడే శారదకూడా నవ్వుకుంటూవచ్చి "నమస్కారమండీ" అంటూ ఓ ప్రక్కగా, నిలబడింది. విదేశ పద్ధతుల కలవాటు పడిన లత ఒక్క మాటుగా ఉలిక్కిపడి "నమస్కారమండీ" అంది. ఇంతలో సుందర్రావు మిసెస్ మోహన్‌ను శారదకు పరిచయం చేస్తూ "విన్నావు శారదా, మిసెస్ మోహన్ ఇక్కడే లెక్చరర్ అయారట. మనమోహన్ కూడా సొంత నర్సింగ్ హోమ్ తెరువబోతున్నాడట" అన్నాడు.

"చాలా సంతోషం. మాక్కూడా డాక్టర్ల కోసం వెతుక్కో అక్కరలేకుండా స్నేహితులు దగ్గర ఉండటం మంచిదే" అంది శారద నవ్వుతూ.

అందరూ ఆమాటా ఈమాటా చెప్పుకుంటూ పనిమనిషి తెచ్చిన నీళ్ళ చెంబులందుకుని హస్త ప్రక్షాళనలుచేసి, శారద చక్కగా అమర్చిన భోజనాలముందు కూర్చున్నారు. మామూలుగా తమతమ అలవాట్ల ప్రకారం భోజనాలు ప్రారంభించారు. లత కొద్దికొద్దిగా షోషనుగా రుచిచూచి వదిలెయ్యటం చూస్తే శారదకు ఆశ్చర్యం వేసింది.

"ఏమండీ లతాదేవిగారూ, మావంటకాలంత రుచిస్తున్నట్లులేవు. చాలా తక్కువ తీసుకుంటున్నారు." అంది శారద నవ్వుతూ.

"థాంక్స్, అలా కాదండీ. నేను యూజువల్‌గానే చాలా తక్కువ తీసుకుంటాను. మీవంటకాలు చాల బాగున్నాయి" అంది లత తన అయిష్టాన్ని కప్పిపుచ్చుతూ.

"అయితే మగవాళ్ళతోపాటు హక్కులన్నీ కావాలనే రోజుల్లో కూడా, ఆడవాళ్ళ ఆహారంలో మాత్రం తక్కువ తీసుకుంటే ఎలా" అన్నాడు చమత్కారంగా డాక్టర్ మోహన్.

అతిచురుకైన విదుషి, లతాదేవి ఈ వ్యంగ్యాన్ని భరించి ఊరుకుంటుందా ? వెంటనే,

"తక్కువ తీసుకున్నా, ఎక్కువ తీసుకున్నా హిందూ కోడ్ రాకమానదు. అప్పుడైనా స్త్రీల శక్తి సామర్థ్యాలు సంఘం తెలుసుకోకమానదు." అని రావుగారిని "ఏమండీ హిందూ కోడ్‌ఫేటు ఏమవుతుందంటారు" అని ప్రశ్నించింది.

"ఎంతవ్యతిరేకం ఉన్నా ప్రధానమంత్రి అభయమిచ్చాడు గనుక పాసుకాక తప్పదు, కాకపోతే సనాతనిష్ఠుల బాధపడలేక కొన్ని మార్పులు చెయ్యవచ్చు" అన్నాడు లాయరు రావు.

ఇంతలోనే శారద అమాయకంగా,

"హిందూ కోడ్ అంటే ఏమిటండీ" అంది.

దానితో మనరావుగారి పై ప్రాణం పైనే లేచిపోయింది తన భార్య అవివేక మంతా బయట పడుతుందని. లత ఆశ్చర్యంగా చూస్తూ అంది,

"హిందూ కోడ్‌నుగురించి మీరెప్పుడూ తెలుసుకోనేలేదా ? అది మన స్త్రీల అభివృద్ధికి హెల్పు చేస్తుంది"

"అంటే ఆడవాళ్ళకు ఏమిమేలు చేస్తుందంటారూ ?"

"సొసైటీలో స్త్రీలకు పురుషులతోపాటు సమానమైన ఆపర్చునిటీసును అంటే.....అవకాశాలను కలిగించటానికి దారితీస్తుంది"

"ఏ విధంగానంటారూ ?"

"ప్రాపర్టీ సంగతి చూడండి"

"అంటే"

"అంటే ఆస్తిపాస్తులు లేవండీ, అవి. వాటిల్లో ఇప్పుడు యావత్తూమగవారేగా అనుభవించేదీ, హిందూ కోడ్ వచ్చిందంటే ఆడవాళ్ళకు కూడా మగవాళ్ళ రొమ్ములు బ్రద్దలగొట్టి మరీపంచుకోటానికి అధికారం వస్తుంది. తరువాత మారేజి విషయం చూడండి."

ఉద్రేక పూరితమైన లతాదేవి వాగ్ఝరికి శారద అడ్డు వచ్చింది.

"అక్కడ కూడా ఏమైనా బ్రద్దలగొట్టటం ఉందా ఏమిటండీ ?"

మారిపోతున్నాం

ఈ మాట శారద అమాయికంగానే అంది. నవ్వుతూ కూడాఅంది. కాని విద్యాధికులైన మిగిలిన పెద్దలకు మాత్రం కంటగింపు అయినట్లు, వారిముఖ వైఖర్లే, బరా మీటర్లలాగ చూపించాయి. అయినా లతాదేవి మాత్రం కాస్తకూ, కూస్తకూ అణగే మనిషి కాదు. తిరిగి మళ్ళీ అందుకుంది.

"బద్దలు గొట్టటం ఏమీలేదు. కాకపోతే ఈ మగడిక్టేటర్ల ఇష్టం వచ్చినట్లు తోకఝాడించ టానికి వీలులేదు."

"తోకలంటూ పెట్టి మగవాళ్ళను కోతులనూ, కుక్కలను చేసారే వదినగారు" అంది చిరునవ్వుతో శారద.

"పుట్టుకతో మనుష్యులైనా, ఉండరాని అధికారాలతో మగవాళ్ళు నిజంగా కోతులే అయిపోయారు. హిందూ కోడ్ క్రిందమరి ఈ ఆటలు సాగవులెండి, పెళ్ళాల మీద పెళ్ళాలను చేసుకోవటం, ఏపాపం పుణ్యం ఎరుగక పోయినా వాళ్ళను చితుకబొడవటం, ఇటువంటి పప్పులికమీదట ఉడకవు లెండి."

"అయితే, తన్నుకోటాలూ, గుద్దుకోటాలూ, చట్టాలేమి ఆపగలవండీ? అది కేవలం పరస్పరంగా ఉండే ప్రేమ గౌరవాలమీద ఆధారపడి ఉంటుందిగానీ!"

"అలా అనకండి శారదగారూ. మగవాడు అంత బ్రూటు అయినప్పుడు ఆడవాళ్ళు తేలిగ్గా డైవోర్సుపుచ్చుకో వచ్చు. ఇప్పటిలా, గతిలేక అల్లాడవలసిన అవుసరం ఏమీ ఉండదు. దాంతోతిక్కమాబాగా కుదిరిపోతుంది."

"ఏమోమరి" అంది శారద అయోమయంగా.

"మీరలా అనుమానంలో పడకూడదు. ఇలాంటి డౌట్సుతోటే స్త్రీలోకం కృంగిపోతూ ఉంది."

"అనుమానాలను నివృత్తిచేసే గీతాబోధ చేస్తున్నావు కదూ." అంటూ చమత్కరించాడు డాక్టరు మోహన్.

"కురుక్షేత్రం ఏదండీ ఇక్కడ?" అన్నాడు వృత్తిరీత్యా వివరాలకోసం పట్టింపు పట్టించే లాయరు రావు.

"ఈ దృశ్యం చూడండి. ఇదియుద్ధరంగం కాదూ? ఆహార సంహరణ చెయ్యటం లేదూ" అంటూ సమర్థించు కున్నాడు డాక్టర్ మోహన్.

అయితే, చర్చలో ఉత్సాహం పెరిగిన లతకు ఈ గీతా వృత్తాంతం అంతరాయ మయింది. విసుక్కుంటూ "చూచారా, శారదగారూ, మగవాళ్ళ వైఖరి. తమను విమర్శన చేస్తున్నారనేసరికి అసలు మాటలధోరణే ఛేంజి చేయ్యాలని చూస్తున్నారు. హిందూ కోడ్ లో మామూలుగా స్త్రీలు పోరాడే ఇండివిడ్యుయాలిటీకి అంటే. .... అంటే."

"అంటే వ్యక్తిత్వానికి" అని మాట అందించాడు రావు.

"అవ్వక్తిత్వానికి చాలా సహకారం చేస్తుంది. ఈ జాయింటు ఫామిలీలు, అందులో సత్రాభోజనాలు,"

"మరానిద్ర" అని హాస్యం చెప్పాడు డాక్టరు మోహన్.

"ఇది ఆపరేషన్ థియేటరు కాదు. మాటలు నరకకండి" అంటూ లతాదేవి అందుకుని "ఆ ఉమ్మడి జీవితాలూ, అత్తల పెత్తనాలూ మొదలైన న్యూసెన్సు అంతాపోయి, స్వంత జీవితానికి తీరులు, రీతులు ఎవరికి వారే నిర్ణయించుకోవచ్చు."

శారదకు సందేహాలు వదలటం లేదు. అందువల్లమాట అందుకుని.

"అయితే వదినెగారు, తెలియక అడుగుతాను. కుటుంబం అంతా ఇలా ఎవరికివారే యమునాతీరే అన్నట్లు ఎవరి తీరున వారు వెళ్ళిపోతే, తల్లిదండ్రులు, అన్నదమ్ములు, అక్కచెల్లెండ్రు అనే ప్రేమ, స్నేహం, అనుబంధం, ఆప్యాయం ఇంకా మనుష్యుల్లో పెరగటానికీ, పెంచుకోటానికీ అవకాశాలు ఏమైనా ఉంటాయా?"

"అదేనేను ఒప్పుకోను. ఇన్నియుద్ధాలు, ఇంత శాక్రిఫైజూ చేసి, మనంపోరాడేదీ, అసలు మానవ జాతి పోరాడేదీ, వ్యక్తిత్వం కోసం అయినప్పుడూ, అట్టి వ్యక్తిత్వానికి ఆటంకం కలిగించే ఏ సంస్థ అయినా చచ్చి తీరవలసిందే."

"కాని వదినగారూ, మనం తోటివాళ్ళతో బ్రతుక వలసిన వాళ్ళం కదా. సమాజంలో ఉండవలసిన వాళ్ళం కదా, ఎవరంతటికి వాళ్ళం స్వంతవ్యక్తారీమీద ఇంత పట్టుదల పెట్టుకుంటే, ఏదారీ గోదారీ అయిపోమా?"

"ఏమీా ?" అంది లత ప్రశ్నార్థకంగా.

"కాక మరేమిటీ? ఉమ్మడి కుటుంబాలూ, వాటిల్లో ఉండేకలయిక మొదలైన వన్నీ వ్యక్తిత్వానికి అంతరాయాలనేకదా మనం వద్దంటున్నాము. ఆమాటకొస్తే, దంపతుల జంట జీవితయాత్ర, తల్లీ బిడ్డల వాత్సల్యమూ కూడా ఈ వ్యక్తిత్వానికి అంతరాయాలుకావా ?"

"లిమిట్సు లేవటండీ దేనికైనానూ" అంది లత.

"మరి అయితే, ఈ హద్దుల నిర్ణయం జరిగేదేలా ?"

ఇదివరకే విసుగెత్తివున్న రావు "ఎవరికివారే" నంటూ సంభాషణనూ దాంతోపాటు భోజనాలనూ కూడా ముగించేసాడు. తరువాత ఫలభక్షణ, తాంబూల చర్వణం సవ్యంగా ఒకదానికి తరువాత ఒకటి జరిగిపోయాయి. చివరకు గుడ్ నైట్సులతో ఒకరిదగ్గర ఒకరు శెలవు తీసుకున్నారు. కాని సుందర్రావుకు, మాత్రం భార్య యొక్క అవివేకాన్ని గురించీ, సనాతనతను గురించీ, చింత మరింతయింది.

"శారదా! తెలియనిదానవు ఊరుకోక, ఎందుకా చొప్పదంటు ప్రశ్నలూ ?" అన్నాడు ఒకరకమైన ఈసడింపుతో.

"అదేమిటండీ, అలా అంటారూ? తెలియకపోతే తెలుసుకోవటం కూడా తప్పేనా ?"

"ఓహో, మహాబాగా తెలుసుకున్నావ్. ఏంలాభం, ఎన్నాళ్ళున్నా, ఎన్ని అవకాశాలు ఏర్పరచినా, మూల కూర్చునే ఘటం మూలే ఉంటుంది, బయటకు ఎలా వస్తుంది ?"

"అయితే, మీరనేది, అర్థం పర్థంలేని ఆధారాల ననుసరించి, మానవజీవిత లక్ష్యాలను, ఎన్నియుగాల క్రితమో ఏర్పరచిన పద్ధతులను త్రెంపివెయ్యమంటారా ?"

"చాలు, ఇంక నీసంభాషణ" అని తనకోపాన్ని కాస్తా ప్రకటించాడు రావు.

"అబ్బ, పోనిస్తురూ! చిన్న విషయానికింత గొడవ" అంటూ నవ్వి మాటను తేల్చివేసింది. ఇదంతా శారద మనస్సును కష్టపెట్టక పోలేదు. కాని ఇంకా ముందుకు వెళ్ళినందు వల్ల లాభమేమి ఉండదని అలా సరిపెట్టుకుంది.

ప్లీడర్ల ప్రారంభ జీవితంలో ఉండే సాధక బాధకాల వల్ల నలిగి పోతూన్న రావు కూడా ఆర్థికంగా కొంత ఇబ్బంది పడవలసి వచ్చింది. అతనికి ఇంకా ఏ ఇతరమైన ఆర్థిక సహాయం లేదు. ఖర్చులకు చాలినంత డబ్బు ఎవరు తెచ్చి ఇస్తారు ఒక్క మాటుగా, "ప్లీడరుగారుగదా" అని. పాపం, దాంతో రావుగారికి ఏమీ తోచటం లేదు. ఇదే ఆలోచనతో బాధపడుతూ ఉండేవాడు.

"ఏమండీ, అలా కూర్చున్నారే?" అంది శారద భర్తకు కాఫీ అందిస్తూ.

"ఏమీ లేదు."

"అదేమిటీ, ఏమీ లేక పోతే, ఏదో విచారిస్తున్నట్లు కన్పిస్తున్నారే."

"అబ్బ, చంపేస్తావు శారదా. సరే నీవూ విన దగ్గదే. విను చెప్తా. మనకున్న డబ్బు కాస్తా అయిపోయింది. సంపాదనా మనకు చాలటం లేదు. ప్రాక్టీసు బాగానే ఉన్నప్పటికీ క్రమేపీగాని వృద్ధిలోకి రాదు. అదే ఆలోచిస్తున్నాను."

"ఎందుకూ, దానికింత ఆలోచన; నాన్నగారిచ్చిన డబ్బుందిగా, అదీ చాలకపోతే మన దగ్గర సుమారు పదివేల రూపాయిల విలువగల వస్తువులున్నాయి."

"అదంతా నీదికదా."

"నాదేమిటీ! మీదికానిదీ!! మనదే అయినప్పుడు మనం వాడుకోటానికి సందేహించటం ఎందుకూ ?"

ఆశ్చర్యంగా రావు భార్యవైపు చూచాడు. ఆమె నవ్వుతూ ప్రార్థనా పూర్వకంగా "ఇంకెన్నడూ ఇలా అనకండి, నీదీ, నాదీ అని" అంటూ భర్త త్రాగిన కాఫీ కప్పును లోపలికి తీసుకెళ్ళింది.

సుందర్రావు ఆలోచనలో పడ్డాడు.

ఆ రోజు డాక్టరు మోహనుకు జబ్బు చేసిందని వార్త రాగా ఉదయం తొమ్మిది గంటలకు వెళ్ళిన సుందర్రావు రాత్రి చీకటి పడ్డా తిరిగి రాలేదు. శారద భర్తకోసం ఎదురు చూస్తూ ఉంది. అటుకోర్టు పనీ చూచుకోలేదు,

భోజనమూ చెయ్యలేదు, ప్రొద్దూ పోయింది, శారద ఆదుర్దాగా దారులు కాస్తూ కూర్చుంది.

చివరకు సుందర్రావు ఇంటికి తిరిగి వచ్చేటప్పటికి రాత్రి పదిన్నరయింది. మనిషి అయోమయంగా ఉన్నాడు. బడలికతో, భారంతో, నిస్పృహతో, నిరుత్సాహంతో మనిషి కృంగి పోతున్నట్లు స్పష్టంగా కన్పిస్తున్నాడు. నిలబడటానికి కూడా ఓపికలే నట్లు సోఫాలో కూలబడ్డాడు.

" ఏమిటండీ! ఏమిటిది!! అస్వస్థతగా ఉందా ?" అంటూ శారద ఆతురతతో భర్త నడిగింది. ఆమెకు భర్త స్థితి చూస్తే భయం వేసింది. తనూ ఆయన సోఫా ప్రక్కనే జారిగిలబడింది.

సుందర్రావు నీరసంగా సమాధానం చెప్పాడు.

" నాకు కాదమ్మా అస్వస్థత, డాక్టర్ మోహనరావుకు."

" ఏమీ, ఆయనకు ప్రమాదంగా ఉందా ?!"

" ప్రమాదమేమిటీ, కలరా పట్టుకుంది."

" అయ్యో పాపం, కలరాయే! తీవ్రంగా వచ్చిందా ?"

" రావటం తీవ్రంగానూ వచ్చింది, అతని పని ఘోరంగానూ ఉంది."

"పాపం, లతాదేవిగారు ఎంత బాధపడుతున్నారో; భర్త చావు బ్రతుకుల మీద ఉంటే ఆమె ఎంత ఆందోళన పడిపోతోందో."

సుందర్రావు దీనికి కఠినంగానూ, ఆవేశంగానూ సమాధానం చెప్పాడు.

" పడుతూ పడుతూ ఉండవచ్చు. ఎవరు చూచారామెనూ ?"

" అదేమిటీ; ఆమెను మీరు చూడ లేదూ? ఆమెను కలుసుకోకుండానే ధైర్యం చెప్పకుండానే వచ్చేసారా ?"

" అసలామె గారు ఉంటేగా, కలుసుకోటానికీ, ధైర్యం చెప్పటానికీను."

" ఉండక " ఆశ్చర్యంగా అడిగింది శారద.

" పలాయనం చిత్తగించింది " అని రావు కోపంగా అన్నాడు.

" పలాయనమా! లతాదేవిగారు పారిపోయారా!!"

" అవును, పారిపోయారు. మొగుడి కలరా తనకూ అంటుకుంటుందేమోనని ఆమెగారు పత్తా లేకుండా మొఖం తప్పించింది. దిక్కు లేక మోహన్ నాకు కబురు పంపాడు. అతన్ని హాస్పటల్లో చేర్పించి నేనిటు వస్తున్నా."

శారద నమ్మలేకుండా ఉంది. తన చెవుల్ని తానే నమ్మలేకుండా ఉంది.

" ఏమిటండీ మీ మాటలూ; భర్తకు ప్రాణం మీదకు వస్తే తనకు అంటుకుంటుందేమో ననే భయంతో మొఖం తప్పించిందంటారా? అంత హృదయం లేని మనిషని నమ్మమంటారా ?!"

" హృదయం లేదన్నానా నేను ?"

" అయితే ఆమెకు భర్త మీద ప్రేమ లేదనా మీ భావన ?"

" ప్రేమ ఉండవచ్చును. కాని ఆ ప్రేమకు మాత్రం కొన్ని గట్టి షరతులున్నట్లు స్పష్టంగా కన్పిస్తోంది."

" షరతు లేమిటండీ ప్రేమకు, మీదంతా చోద్యం."

" షరతులు కాక ఏమిటి ?" సుందర్రావు వాదనలోనికిదిగాడు. " మనవ్యక్తిత్వాలకు, మన ప్రత్యేక విశిష్టతకు, మన అహానికి ఏ మాత్రమూ అంత రాయంకలిగిందో ఎంత గాఢమైన సంబంధమైనా అరుణకిరణాలతో మంచు తెర విడిపోయినట్లు విడిపోవలసిందే."

" కానీ, భార్యా భర్తల సంబంధమూ, అనురాగమూ కూడా అంతేనంటారా? ఇన్నాళ్ళుగా మనం విన్నదీ, కన్నదీ అంతా అబద్ధమేనా ?"

" అది అబద్ధంగాదు. అట్టిస్థితిలోనుండి మనం ముందడుగు వేస్తున్నాం. కల్తీ లేని వ్యక్తిత్వాల కోసం, జీవిత విశిష్టతకోసం, పడే తాపత్రయాలతో మానవ ప్రకృతే నూతన రూపాలు ధరిస్తోంది. క్రొత్తదారుల వెంటబడిమనం పోతున్నాం. దూర దూరంగా పోతున్నాం. మారిపోతున్నాం. ఎక్కడికో ఎందుకో."

ఆ దంపతులు ముందున్న అయోమయమైన అంధకారంలోనికిసాలోచనగా చూస్తూ కూర్చుండి పోయారు.

★

విద్యుచ్ఛక్తి

* శ్రీ వసంతరావు వెంకటరావు *

ప్రొద్దుటే లేచింది మొదలుకొని రాత్రి పడుకోబోయే వరకు ఎన్నో విధాలుగా మనం వేడినీ వెలుగునీ ఉపయోగిస్తున్నాం. కాఫీనీళ్లు మరగ బెట్టుకోడానికీ, స్నానానికి నీళ్లు కాచుకోడానికీ, వంట వండుకోడానికీ, మధ్యాహ్నం ఫలహారాలు చేసికోడానికీ, రాత్రి దీపాలు వెలిగించుకోడానికీ వేడిమి కావాలి. బొగ్గూ, కర్రా, కిరసనాయిలూ, అగ్గిపుల్లా మనకా వేడిమి నిస్తాయి. మోటారు కారుమీద విమానం మీద ప్రయాణం చెయ్యాలంటే వాటిని నడపడానికి పెట్రోలు కావాలి. బట్టలను ఉడకబెట్టడానికీ, వాటిని ఇస్త్రీ చెయ్యడానికీ చాకలి వాళ్లకు కర్రలు, బొగ్గులు కావాలి. రాత్రి చీకట్లను పోగొట్టడానికి కాంతి మంతమైన దీపాలు కావాలి. లాంతర్లలో కిరసనాయిలు వాడతాము; ఆ కిరసనాయిలే పెట్రోమాక్సు దీపాలలో వాయువుగా మండి ఎక్కువ వెలుగునిస్తుంది. అంతకంటె కాంతిగల విద్యుద్దీపాలలో విద్యుచ్ఛక్తిని ఉపయోగిస్తున్నాం. అవసరమైనప్పుడే వెలిగించుకొని, అవసరం తీరగానే ఆర్పేయడానికి వీలైన టార్చి లైట్లలో విద్యుచ్ఛక్తినే వాడుచున్నాం.

ఇన్ని విధాల మన కుపయోగకరంగా నున్న శక్తి యావత్తు సూర్యుని నుండే లభిస్తోంది. సూర్యుడేమో ఎడతెరిపి లేకుండా క్షణక్షణం వేడినీ, వెలుగునీ వెదజల్లుతునే ఉన్నాడు. కాని, ఆ సౌర శక్తి పగటిపూట మాత్రమే మనకు అందు బాటోతుంది. వర్షాకాలంలో, దట్టంగా మేఘాలు వేసి ముసురు పట్టినప్పుడు ఒకప్పుడు, పగటిపూటే దీపాలు వెలిగించుకోవలసి వస్తుంది. కాని, పూర్వకాలం నుండీ సూర్యుడిస్తూన్న వేడిమిని మనచెట్లు సంపాదించి అవి నేల బొగ్గుగా మారి పోయేయి. నేలబొగ్గులో దాచబడిన సూర్యుని శక్తినే మనం కావలసినప్పుడు ఇష్టం వచ్చినట్లు వాడు కొంటున్నాం.

వేడి వెలుగులవంటి శక్తే విద్యుత్తుకూడాను. రైళ్లలోను, మోటారు కార్లలోను మీరు విద్యుద్దీపాలను చూస్తూనే ఉంటారు. సినీమాలలో విద్యుత్ పంకాలను చూస్తున్నారు. అంటే విద్యుచ్ఛక్తి నుండి మనకు వెలుగు వస్తోంది, విద్యుచ్ఛక్తిచేత మనం పనులు చేయిస్తున్నాం. వేడి, వెలుగు, విద్యుత్తు మొదలైన శక్తులను ఒక శక్తిని మరొక రూపంలోనికి మార్చ వచ్చును. రైలు ఇంజన్లలో వేడిచేత పని చేయిస్తున్నాము, ఎలెక్ట్రిక్ బెల్ వాగినప్పుడు విద్యుత్తు పనిచేస్తోంది. డైనమో అనుయంత్రంలో ఒక తీగచుట్టను అయస్కాంత ధ్రువాల మధ్య గబగబా త్రిప్పితే విద్యుచ్ఛక్తి పుట్టుకొస్తుంది.

విద్యుచ్ఛక్తి కోసం ఎక్కడో వెతక నక్కరలేదు. ప్రతి పదార్థంలోను, ప్రతి వస్తువులోను విద్యుత్తుంది. మన శరీరంలోకూడా విద్యుత్తుంది. ఇప్పుడు కొన్ని ప్లాస్టిక్ పన్నెలు వస్తున్నాయి. ఈసారి మీరు తలంటి నీళ్లు పోసికొన్న తరువాత, ఆరిన జుట్టుని గబగబా ప్లాస్టిక్ పన్నెతో దువ్వుకొని చూడండి కొంతసేపటికి చటపట శబ్దం వినిపిస్తుంది. చిన్న కాగితం ముక్కలు క్రిందపెట్టి, తలగట్టిగా దువ్వుకొని, పన్నెను ఆకాగితాల దగ్గరకు తీసికొని వెళ్లగానే, కాగితాలెగిరి పన్నెకు అంటుకొంటాయి. వీటికి కారణం ఏమిటంటే, పన్నెలో నున్న విద్యుత్తు పైకి వస్తుంది. పన్నెను తాకగానే విద్యుత్తు మనలోనుండి ప్రవహించి పోతుంది పన్నెతో దువ్వినప్పుడు ఘర్షణ వల్ల విద్యుత్తు పుట్టుతుంది.

ఆకాశంలో మేఘాలలో విద్యుత్తుంది. ఒక మేఘంనుండి మరొకమేఘానికి విద్యుత్తు పరుగెత్తినప్పుడు దాని మార్గం మెఱుపుగా మనకు కనిపిస్తుంది. ఆ విద్యుత్తే మేఘంనుండి భూమికి దిగితే మనం దానిని పిడుగు అంటాం. గాలి పటాన్ని ఎగరవేయడానికి దారంవంటి తీగనుపయోగించి బెంజమిన్ ఫ్రాంక్లిక్ అనే శాస్త్రవేత్త మేఘాలలోనున్న విద్యుత్తుని ప్రమాదం లేకుండా క్రిందికి తీసికొని వచ్చేడు. కాని, ఆ విధంగా తెచ్చుకొన్న విద్యుత్తుని ఇష్టానుసారంగా ఉపయోగించుకోలేము.

కొన్ని సామాన్య పదార్థాలను చేర్చి విద్యుత్ ఘటాన్ని

ఎవరికి వారే తయారుచేసి కోవచ్చును. టార్చిలైటు బేటరీలో విద్యుత్ అయిపోయిన దానిని తెచ్చి, పైనున్న అట్టగొట్టాన్ని ఊడదీస్తే తెల్లగానున్న జింక్ పాత్ర కనిపిస్తుంది. ఆజింక్ రేకు నొక దానిని రాగిరేకు నొక దానిని గంధకితామ్లం, అంటే, సల్ఫ్యూరిక్ ఆసిడ్ గల పాత్రలో దూరదూరంగా ముంచి, వాటి రెండు కొనలను తీగెతో కలుపగా విద్యుత్తు ప్రవహిస్తుంది. ఈ రేకులు ఆమ్లంగల పాత్రనే విద్యుత్ ఘటమంటారు. అందులో రసాయనిక ప్రక్రియవల్ల విద్యుత్తు జనిస్తుంది. అట్టి విద్యుత్ ఘటాలను రెండు మూడింటి మాలగా కూర్చి చిన్న బల్బును ఆ వలయంలో పెట్టగా అది చక్కగా వెలుగుతుంది. విద్యుత్ ఘటాలలో రసాయనిక ప్రక్రియ జరుగుతున్నంత వరకు విద్యుత్తు ప్రవహించి బల్బు వెలుగుతుంది. ఇట్టి విద్యుత్ ఘటాలలో రసాయనిక శక్తియే విద్యుత్‌గా మారుతూంది. కొన్ని పదార్థాలను ముద్దగాచేసి టార్చి బేటరీలలో నుంచుతారు. వాటిలో రసాయనిక శక్తి యావత్తు విద్యుత్తుగా మారి పోయేక వాటిని పారవేస్తారు.

ఇంకొక రకమైన బేటరీలున్నాయి. ముందుగా వాటిలో నుండి విద్యుత్ ప్రవాహాన్ని పంపితే, అవి విద్యుత్తుని భద్ర పరుస్తాయి. అవసరమైనప్పుడల్లా ఆ బేటరీలను వాడుకోవచ్చును. ఈ బేటరీలు బ్యాంకుల వంటివి. సామాన్యంగా బ్యాంకులో డబ్బు దాచుకొని, అవసరమైనప్పుడు ఎంత కావలిస్తే అంత తెప్పించుకొని వాడుకొంటారు. డబ్బంతా తీసివేసిన తరువాత మరికొంత డబ్బు బ్యాంకిలో వేస్తే దానిని తిరిగి తెప్పించుకోవచ్చు. ఆ విధంగానే ఈ రకం బేటరీలను ముందు చార్జిచేస్తే వాటిలో విద్యుత్తు భద్రంగా ఉంటుంది. ఆ విద్యుత్తు నంతావాడుకొని, మళ్లాచార్జిచేస్తే మరికొంత విద్యుత్తును వాడుకోవచ్చు, ఇట్టి బేటరీలను మోటారు కార్లలోను రేడియోలలోను ఉపయోగిస్తారు.

విద్యుత్తును భారీగా ఉత్పత్తిచేసే యంత్రాలను 'జెనరేటర్లు' అంటారు, రాగితీగెనొక విధంగాచుట్టి, పెద్ద అయస్కాంత ధ్రువాలమధ్య దానిని వడిగా త్రిప్పుతే విద్యుత్తు జనిస్తుంది. తీగెచుట్టను జోరుగా త్రిప్పడానికై ఇంజన్ల నుపయోగింపవచ్చు, లేదా, నీటి ప్రవాహంలో నున్న శక్తిని వినియోగించ వచ్చు. జలపాతంలో ఎత్తు నుండి క్రిందకు మహావేగంగా నీరుపడుతుంది. ఆ నీటి ప్రవాహంలో నున్న శక్తిచేత జెనరేటర్లను పనిచేయించడం ఇప్పుడు ఎక్కువగా ప్రచారంలో నుంది. ఆవిధగా లభ్యమైన శక్తిని 'హైడ్రో ఎలెక్ట్రిక్' శక్తి అంటారు. జలపాతం ఎల్లప్పుడూ ఉంటుంది. ఏమంటే, సూర్య రశ్మికి ప్రపంచంలో నున్న నీటిలో కొంత భాగం ఎల్లప్పుడూ ఆవిరిగా మారుతుంటుంది. అది చల్లబడి మేఘాలై వర్ష రూపంలో క్రిందపడు తుంటుంది. కాబట్టి, జలపాతాలకు నీటి కరవు ఎప్పుడునూ ఉండదు. గాలిజోరుగా వీస్తే చెట్లు కూడ విరుగుతుంది. గాలికంటె ఎంతో బరువైననీరు జోరుగా క్రింద పడినప్పుడు ఎంత పనిచేస్తుందో ఊహించండి! అందుచేత, జలపాతాలలో నున్న శక్తిని విద్యుచ్ఛక్తిని ఉత్పత్తి చేయడానికై వినియోగించడం చాల లాభకరం. ప్రపంచంలో అనేక దేశాలలో జలపాతా లున్నాయి. కాని, వాటి నన్నిటిని సవ్యంగా ఉపయోగించడం లేదు.

శక్తిని కొలవడానికి అశ్వసామర్థ్యం (హార్స్‌పవర్) అనే యూనిట్ నుపయోగిస్తారు. ఒక అశ్వసామర్థ్యం అంటే సుమారు ఇరవైమూడు మణుగుల బరువుని ఒక్క సెకెండులో నిలువుగా ఒక్క అడుగు ఎత్తడానికి కావలసిన శక్తి. మనదేశంలో నున్న నీటి శక్తిని పూర్తిగా వినియోగించుకొంటే దాదాపు నాలుగుకోట్లు అశ్వసామర్థ్యం గల విద్యుచ్ఛక్తిని మనంవాడు కోగలం. కాని, ఇప్పటివరకు ఆరు లక్షల అశ్వసామర్థ్యం గలశక్తి మాత్రమే విద్యుచ్ఛక్తి రూపంలో మనకు లభిస్తూంది. 830 అడుగులు ఎత్తుగల గెర్‌సొప్పా జలపాతం మైసూరులో ఉంది. 8 కోట్ల రూపాయిలు ఖర్చుపెట్టి దానిని పనిచేస్తున్నారు. అందులో వచ్చే విద్యుచ్ఛక్తి మైసూరుకే కాక చెన్నరాష్ట్రానికీ బొంబాయి రాష్ట్రానికీ కూడ సరఫరా కాగలదు. చెన్న రాష్ట్రంలో పనిచేస్తూన్న హైడ్రో ఎలెక్ట్రిక్ సంస్థలు పాయకరా, మెట్టూరు, పాపనాశనం, ఒరిస్సాలో నున్న మాచ్‌కుండ్ జలపాతాన్ని ఒరిస్సా మదరాసు రాష్ట్రాలు ఉమ్మడిగా పనిచేయడానికి కేర్పాట్లు చేస్తున్నారు.

బొంబాయి రాష్ట్రంలో నున్న తాతా హైడ్రో

ఎలెక్ట్రిక్ సంస్థ చాల పెద్దది. సుమారు 10 కోట్ల రూపాయలు ఖర్చుపెట్టి బొంబాయి పూనా నగరాలకి విద్యుచ్ఛక్తిని ఆసంస్థ సరఫరా చేస్తూంది.

విద్యుచ్ఛక్తిని ఉత్పత్తి చెయ్యడానికై నీటిని మరొక విధంగా కూడా ఉపయోగించ వచ్చు. జెనరేటర్లలో ఒక భాగాన్ని గిర్రున త్రిప్పడానికే కదాశక్తి కావలసింది! అందుచేత, ఆశక్తిని నీటి ఆవిరినుండి పొందవచ్చు. పెద్దపెద్ద బాయిలర్లలో ఎక్కువ ఒత్తిడిగల నీటి ఆవిరిని తయారుచేసి దానిచేత జెనరేటర్లను పనిచేయిస్తారు.

భారీగా ఉత్పత్తిచేసిన విద్యుత్తును ఎన్నెన్ని విధాలుగానో ఉపయోగించ వచ్చు. సర్వసాధారణమైన వినియోగాలు దీపాలకీ, పంకాలకీ, వస్తువులను వేడి చెయ్యడానికీ విద్యుత్తు కావాలి. వస్తువులను చల్లార్చడానికే విద్యుత్తు కావాలి, టెలిగ్రాఫు, టెలిఫోను, రేడియో, సినీమా మొదలైన వాటికి విద్యుత్తే ప్రాణం. మనదేశంలో ఎక్కువగా కాకపోయినప్పటికి, పాశ్చాత్యదేశాలలో బట్టలను ఇస్త్రీ చెయ్యడానికి విద్యుచ్ఛక్తినే వాడతారు. అంతేకాదు, వంట పొయ్యికీ విద్యుత్తే, నీళ్లు కాచడానికీ విద్యుత్తే.

విద్యుద్దీపాలలో అనేక రకాలు, తీగెలుగల బల్బులు, పాదరసంగల బల్బులు, రంగురంగు పదార్థాలు పూయబడిన పొడవుపాటి గాజుగొట్టాలు, వివిధరంగుల వాయువులు కలిగి అక్షరాల ఆకారంలో నున్న సన్నటి గాజు నాళికలు, ఇవన్నీ అలంకారాని కెంతో బాగుంటాయి.

పరిశ్రమలలో విద్యుచ్ఛక్తి యొక్క ఉపయోగం ఇంతంతకాదు. బంగారంతోకాని, వెండితోకాని, నికెలుతోకాని వస్తువులను మలామా చెయ్యడానికి విద్యుత్తు కావాలి. పూతపూయవలసిన లోహలవణాన్ని ఒక పాత్రలో పోసి, ఒకలోహపు కడ్డీ ద్వారా దానిలోనికి విద్యుచ్ఛక్తిని ప్రవేశపెట్టి, మలామా చేయవలసిన వస్తువునా పాత్రలో ముంచి, దాని ద్వారా విద్యుత్తును పంపివేస్తే వస్తువుపై మంచి పూత ఏర్పడుతుంది. గాలికి మచ్చలుపడే రాగి, ఇత్తడి మొదలైన లోహాలతో చేసిన వస్తువులను మలామాచేస్తే అవి మెరుస్తూ అందంగా ఉంటాయి.

పుస్తకాలు అచ్చువేయడానికి కూడ విద్యుచ్ఛక్తిని ఉపయోగింపవచ్చు. అచ్చు అక్షరాలు వాడుకవల్ల అరిగిపోతాయి. లక్షలకొలది ప్రతులు అచ్చు వేయవలసినప్పుడు పేజికి ఒక బ్లాకుచేస్తారు. అది రాగితోచేస్తే, సులభంగా అరిగిపోదు. మైనంతో దాని అచ్చునితీసి, దానిపై కర్బనపు పొడి జల్లి, రాగి ద్రావణంలో ముంచి, మలామాకు ఏర్పాటు చేసినట్లె సామగ్రికూర్చి విద్యుత్ప్రవాహాన్ని పంపగా, పలుచని రాగి ప్రతిమ తయారౌతుంది. ఈ ప్రక్రియనే 'ఎలెక్ట్రోటైపింగ్' అంటారు.

విశుద్ధలోహాలను వాటి యోగాలనుండి విడదీయడానికి విద్యుచ్ఛక్తి నుపయోగిస్తారు. గనులలో దొరకే లోహయోగాలను ద్రావణంగాచేసి, దానిలో నుండి విద్యుత్ ప్రవాహాన్ని పంపగా, విశుద్ధలోహం విడివడుతుంది.

తీగచుట్టలోనుండి విద్యుత్ప్రవాహం పారినప్పుడు అది అయస్కాంతం వలె ప్రవర్తిస్తుంది. ప్రవాహం ఉన్నంతసేపు తీగచుట్టకు అయస్కాంత లక్షణాలుండి, ప్రవాహం ఆగిపోగానే దాని అయస్కాంతత్వం పోతుంది. తీగచుట్టలో ఇనుపకడ్డీ పెట్టి అయస్కాంత బలం ఎక్కువ చేయవచ్చు. విద్యుత్తువల్ల జనించిన అయస్కాంతాలకు విద్యుదయస్కాంతాలంటారు. ఉక్కు పరిశ్రమలలో పెద్దపెద్ద మొత్తాలుగా ఇనప ఖనిజాలు కావాలి. వాటిని రవాణా చెయ్యడానికై విద్యుదయస్కాంతాల నుపయోగిస్తారు. వందలకొద్దీ టన్నుల బరువుగల ఇనుప ఖనిజాన్ని, ఇనుముని, సులభంగా పైకెత్తి, కావలసిన చోటపడేస్తుంది విద్యుదయస్కాంతం. ఎలెక్ట్రిక్ బెల్‌లో గంటను వాయించేది విద్యుదయస్కాంతమే.

పరిశ్రమలలో పెద్దపెద్ద యంత్రాలను నడిపేది విద్యుచ్ఛక్తి. ఒకదండానికి అనేక చక్రాలు అతికి ఉంటాయి. ఆదండాన్ని విద్యుత్తు త్రిప్పుతుంది. చక్రాలకు బెల్టులను పెట్టి వేర్వేరు యంత్రాలను వాటితో నడుపుతారు.

నేలబొగ్గు, పెట్రోలు, కిరసనాయిలువలె, కొంతకాలానికి విద్యుచ్ఛక్తి వ్యయమై పోతుందన్న భయంలేదు. రసాయనిక పదార్థాల నుపయోగించికాని, జలపాతంలోని నీటిశక్తివల్లకాని, నీటిని మరగబెట్టగా వచ్చిన ఆవిరి వల్లగాని విద్యుత్తును ఉత్పత్తి చేయవచ్చు. సుఖంగా జీవించడానికి ఆ విద్యుత్తును ఉపయోగించుకో వచ్చు.

[ఆలిండియా రేడియో, మద్రాస్, వారి సౌజన్యంతో]

★



'దురాశ దుఃఖానికి చేటు'

※ కోటంరాజు కుసుమాంబ ※

అనగనగా ఒక వూళ్ళో ఓతాత, మామ్మ ఒక చిన్నయింటిలో వుండేవారు. ఎవరైనా వాళ్ళింటికి వస్తే తమకు ఉన్న దాంట్లోనే కాస్త వాళ్ళకు పెట్టి ఆదరించేవారు తమకు పిల్లలు లేక పోవడంచేత ఒక కుక్కని పెంచుకుంటూ, దానికి వాళ్ళు ఒండుకున్న వన్నీ పెడుతూ వుండే వారు. ఓనాడు తాత, మామ్మకలసి పొలములో పని చేయడానికి వెళ్ళారు. కుక్కకూడా వెళ్ళింది. వాళ్ళు పని చేసుకుంటూవుంటే కుక్క గెంతుతూ ఆడుకుంటోంది. కుక్క ఒకచోట నిలబడి "భౌ భౌ భౌ" అని అరిచింది. ఏదో, తినేవస్తువు యిక్కడ వుండబట్టి మొఱుగుతోంది అనుకున్నారు. కాని అది భూమి వాసన చూడడం చూసి వెంటనే తవ్వడం మొదలు పెట్టారు. ఏమి అదృష్టం! ఏమి అదృష్టం! గుండిగలాటి బంగారం, మణులు, రత్నాలు, లెక్కలేనన్ని దొరికినవి. ఆశ్చర్య పోయారు. వెంటనేవాటిని తీసుకొని బీదలకు కొంతదానం చేసి మిగిలిన సొమ్ముతో పొలాలు భవనాలు కొనేసి హాయిగా వుంటున్నారు.

ఈ సంగతి వాళ్ళింటి ప్రక్కనే, వుంటూ వున్న ఒక ముసలి, వాని భార్య విన్నారు. వాళ్ళు ఉత్తపిసినారిలు. వారి ఆశకి అంతులేదు. వెంటనేవాళ్లు మన తాత, మామ్మ నడిగి కుక్కను ఓ తాడుకట్టి, పొలములోకిలాక్కొని పోయారు కుక్క గభాలుని భౌ! భౌ! భౌ! అని అరచింది. అదేతడవుగా ఆ ప్రదేశాన్ని తవ్వి పారేశారు. ధనం లేదు సరిగదా! ముక్కని బ్రద్దలు కొట్టేకంపు మొదలు పెట్టింది. అది చూసి దానిమీద కోపంతో కుక్కను పట్టుకొని చంపేసి మఱ్ఱిచెట్టుకింద పాతిపెట్టారు. మన తాత మామ్మ ఎంత సేపటికి కుక్క రాక పోవడం చూసి వాళ్ళింటికి వెళ్ళి అడిగారు. "మంచిదిగాదు వెధవ కుక్క" చంపేశాము. అన్నారు వాళ్ళు.

తాత విచారిస్తూ అలానే యింటికెళ్ళి నిద్ర బోయాడు కలలో కుక్కప్రత్యక్షమై ఆ చెట్టు కొన నరికేసి, ఆ కట్టితో రోలుని చేసుకోమని చెప్పింది. తాత ప్రొద్దునే లేచి రోలు తయారు చేశాడు. బియ్యం వేసి దంచబోయేసరికి ప్రతి

బియ్యాం గింజా రత్నం ముక్కగా తయార యింది. సరే బాగుందని సంతోషించారు. కాని ప్రక్కనున్న ముదుసలి అవ్వ యిదిచూసి ఓ సారిమీరోలు ఎరువిమ్మని అడిగారు. సరే! మంచి వాళ్ళు గనక మనతాత మామ్మ యిచ్చారు. వాళ్ళు బియ్యాం వేసిదంచ బోయేసరికి బియ్యాం రాలేదు సరిగదా! మట్టి క్రింద తయారయాయి. కోపం వచ్చి దాన్ని బ్రద్దలు కొట్టి తగలబెట్టేశారు. తాత వాళ్ళింటి కెళ్ళేసరికి యీ సంగతి చెప్పేరు. మళ్ళీకలలో కుక్క కనిపించి తగలబెట్టిన తర్వాత వచ్చిన బూడిద తీసుకొని ఎటువంటి మోడుమీద జల్లినా పుష్పఫలాలతో వికసిస్తుంగి అనిచెప్పింది. తాత వాళ్ళింటికెళ్ళి ఆ బూడిదైనా యిమ్మని బ్రతిమాలి తన యింట్లోవున్న మోడుమీద జల్లాడు. వెంటనే చక్కని ఫలవృక్షం తయారయింది. రాజుగారి ఆ స్థానానికి తాతని రావలసిందని రాజుగారు ఆజ్ఞాపంపించారు అంతావిని! వెంటనే తాత బయలుదేరి వెళ్ళి మహత్తు చూపించాడు. రాజుగారు మెచ్చుకొని బోలెడు బహుమానాలు యిచ్చి పంపించారు. ఇది చూసి ప్రక్కనున్న ముసిలివాడు బయలుదేరి రాజుగారు పిలవకుండానే ఆ స్థానానికిపోయి ఛా! వాడు చేయడమేమిటి నేను చేస్తానని రోలు తగలబడిన తర్వాత కొద్దిగా మిగిలిన బూడిద పట్టుకొనివచ్చి ఓ మోడుమీద జల్లాడు. ఆమోడు మోడులాగే వుంది. వెంటనే రాజుగారు అతనిని భటులకు అప్పజెప్పి చితకగొట్టమని ఆజ్ఞాపించాడు. మన తాత వాడి అవస్థ చూడలేక విడిపించి తన ధనంలో సగం యిచ్చి సంతోషపెట్టాడు.

[జపాను కథ ననుసరించి]

★

ఆలోచించండి :

1. పౌను తూనికగల బంగారము బరువా, లేక పౌను తూనికగల ఇనుము బరువా?

2. ఒక వర్తకుఁడు 6 వీశెల నెయ్యి 12 రూపాయలకు కొని, దానికి 3 వీశెల నీళ్లు కలిపి, మొత్తము సగటున వీశ 11 రూపాయలకు అమ్మిన, వానికి లాభ మెంత వచ్చును?

3. ఒక కర్మాగారములో 550 మంది పనివాండ్లు పనిచేస్తున్నారు. వారికి యజమాని చెప్పులు కొని పెడుతానన్నాఁడు. వారిలో కొందఱు కుంటివారు కావటాన ఒకటే కాలు—మిగతా వారిలో సగము మంది చెప్పులు అక్కఱ లేదన్నారు. కావలసినవారికి సరిగా సరిపోవుటకు యజమాని ఎన్ని చెప్పులు కొనవలెను?

4. మనదేశము రూ. 100—0—0 లు, పాకిస్థానులో ఎన్ని రూపాయలకు సమానము—?

(40-వ పేజీలో యీ ఆలోచనలకు సమాధానాలుండును. మీ సమాధానాలు అవీ ఒకటే నేమో ఋజువు చేసికొండి.)

పిల్లల శిక్షణ శాస్త్రీయ దృక్పథం

శ్రీమతి దరిసి సుభద్రమ్మ

గమనము - చలనము యొక్క విలువ —

రెండున్నర సంవత్సరం వయస్సున్న బిడ్డ (2½ సం॥—) చక్కగ నడవగలదు. మేడ మెట్లు ఎక్కి దిగుట, కుర్చీ, బల్ల, అరుగుల మీద ఎక్కి దిగుట, ఎత్తైన ప్రదేశం మీద నుండి దుముకుట మున్నగునవి అలవడుతవి. రెండున్నరనుండి మూడేళ్లు నిండులోపల, వీటిలో నేర్పును, అవయవ పటుత్వము సాధించుటకు అవిరామకృషి సల్పుతుంది; వేగంగా మేడమెట్లు ఎక్కటం, గబగబదిగటం, అరుగుల మీద ఎక్కి క్రిందికి దుముకుటం, దాగుడు మూతలు మొదలగు ఆటలు నెపముతో, చేతికి చిక్కక పరుగెత్తటం మున్నగునవిచేయుటయందు అత్యాసక్తి వెలిబుచ్చుతుంది. నేలమీద గీచిన సున్నం గీతమీద, అరుగుల ఓరలో నడచుట, రెండు చేతులతో పైన దేనినైనా పట్టుకొని వ్రేలాడుట, ఉయ్యాలను స్వంతంగా ఊచుకొనుట మున్నగు ఆటలు అమిత ఇష్టం. ఇట్టి ఆటలలో అనేకపర్యాయములు తప్పి క్రింద పడుట, లేచుట, తిరిగీ పడుట—లేచుట చేస్తూ అరుగు అంచులలో చక్కగా నడచుటకు, ఉయ్యాల ఊచుకొనుటకు, వ్రేలాడుటకు నేర్చుకొంటుంది. ఇదేరీతిగ, కుర్చీ, బల్లలు, పాత్రసామాను మొదలగు కొంత బరువైన వస్తువులను తన చేతనైతే మోసుకొని, లేదా, ఈడ్చుకొంటూ ఒక చోటనుండి తీసుకవెళ్లి మరొకచోట పెట్టటం, తిరిగీ వాటిని వాటిస్థానాల్లో చేర్చటం అనేది ఈ ఈడు బిడ్డకు అత్యంత ఆహ్లాదకరమైన ఆట. ఒక చెంబునుండి ఇంకొక చెంబులోకి నీళ్లుపోయటం, గంగాళంలోనుండి నీళ్లు చెంబుతో, గిన్నెతో ముంచి క్రింద పారబోయటం, లేదా, మోసుకొని వెళ్లి మరెక్కడనో పారబోసి రావటం, తన పాలును చల్లార్చు నిమిత్తం ఒక గిన్నెనుండి ఇంకొక గిన్నెలోకి పోయటం ఈ విధంగా విసుకు విరామమన్నమాట లేక అనేక పర్యాయములు చేస్తుంది. ఇట్టి ఆటలలో అనేకమార్లు బిడ్డ నీళ్లుకాని, పాలుకాని క్రింద ఒలక బోయటం, గిన్నెనో, పాత్రనో జారవిడవటం, అవి పగిలిపోవటం సాధారణంగా జరుగుట పరిపాటి. అట్టి సందర్భములలో, బిడ్డ వేరొకగిన్నె, పాత్రను తెచ్చుకొని తిరిగి తన ఆటను ఆరంభించుతుంది. అయితే, ఈ మారు మెళకువతో పట్టుకొని తన పనిని సాగించుటకు ప్రయత్నిస్తుంది. (జారవిడవకుండా)· ఈ విధంగా పదేపదేచేస్తూ చివరకి తన లక్ష్యమును సాధించి తీరుతుంది. ఇట్లుచేయుట వలన బిడ్డకేర్పడు శక్తులు ముఖ్యంగా రెండు విధములని చెప్పవచ్చును :—

ఒకటి —దైహికం, అనగా, కండరములు, ఎముకలు పెరిగి బలపడుతవి. తత్ఫలితంగా, అవయవ పటుత్వము ఏర్పడుతుంది. బిడ్డ తన దేహమును చక్కగా స్వాధీనం చేసుకొంటూ, నేర్పును సంపాదించుకొంటుంది.

రెండు బుద్ధివికాసము ·—క్రొత్త విషయములను కనుగొనుటకు యత్నించుట, కారణమును కనుగొనుటకాలోచించుట, అవగాహనము చేసికొనుట, సంక్షిప్తంగా—పరిసర పరిస్థితుల పరిజ్ఞానము పొందుతూ, పొందు పరుచుకొను శక్తిని సంపాదించుతుంది.

కాబట్టి, తల్లి ఈ వయస్సున బిడ్డకేర్పడు ఇట్టి సూక్ష్మగ్రాహ్యదశలో గమనము చలనములకు సంబంధించిన ప్రేరిత చేష్టలను, వాటి ఫలితంగా బిడ్డకు కలుగనున్న శక్తులను అవగతం చేసికొని తోడ్పడుట అత్యావశ్యకము. అయితే తల్లి మంచి తెలివితేటలనుపయోగించి తోడ్పడుట అత్యవసరము. ఏలాగంటే, సామాను విరిగిపోతుందనో, ఇల్లు మురికియైపోతుందనో, తన ఇంటిపనుల కభ్యంతర మేర్పడుతుందనో, లోభత్వము, ఆతురత, విసుకు మొదలైనవి వెలిబుచ్చరాదు; ఎంతమాత్రం ముఖంలో చీకాకు కనబరచరాదు. ఇంత మాత్రమేకాదు, నిర్మాణయుక్తమైన సలహా ఇచ్చి సానుభూతితో సహాయపడాలి. బిడ్డ నీళ్లలో ఆడుకొను తరుణ

ములో చెట్లకు నీళ్లు పోయులాగున సూచించాలి. పగిలి పోయిన గాజుముక్కలను—బిడ్డ తన ఆటలతో సంతృప్తి చెందిన తరువాత—ఏరి బుట్టలో వేయటానికీ, క్రింద ఒలక బోసిన నీటిని బట్టతో తుడవటానికీ చిందర వందరగా పడ వేసిన వస్తువులను యథాప్రకారముగ వాటి స్థానాల్లో చేర్చ టానికీ తనకు తోడ్పడమని అర్థించుతూ అదొక ఆటగా బిడ్డ అనుకొనులాగున తల్లి వర్తించాలి. ఏవిధంగా పాలును చల్లార్చాలో నీళ్ల నేవిధంగా తోడాలో చూబెట్టుతూ బిడ్డను ఆ విధంగా చేయనివ్వాలి.

బిడ్డ స్వేచ్ఛగా ఆడుటకు, నడయాడుటకు అవకాశము లేనట్టి చోట్లలో—అపరిచితుల ఇండ్లు, రైళ్లు, సభలు, నాటకాలు, సినిమాలు మున్నగు చోట్లలో—బిడియంచేత, ఇరుకుగా నున్నందుచేత, లేక నిర్బంధంచేత బిడ్డ గంటల కొలది కదలక మెదలక ఒక మొద్దువలె కూర్చొని వుండుట మనేది పసిబిడ్డకెంత బాధకరమైనదో తల్లి ఊహించు కొనుట ఎంతైనా అవసరముకదా; భరించరాని అట్టిబాధల వలనే బిడ్డ ఏదో ఒక సాకు పేరట చిలిపితనం చేయుటో, మంకు పట్టుపట్టుటో గుక్క విడవకుండ ఏడ్చుటో చేస్తూ వుంటుంది. బిడ్డ స్వేచ్ఛగ తిరుగుటకు అవరోధం కలిగినందు చేత దానికి కలుగు బాధలను గ్రహించలేని తల్లి బిడ్డచేత మిఠాయినిపెట్టి బుజ్జగించి ఊరడించటానికి యత్నిస్తుంది; తన యత్నం విఫలమైతే భయపెట్టటం, తిట్టటం, తుదకు బాదటం కూడ చేస్తుంది. కాని ఇట్టి నయభయా దులకన్న బిడ్డకేర్పడు ప్రేరిక చేష్టలు బలవత్తరమైనవను విషయం విస్మరించరాదు. ఒకవేళ నిర్బంధించి లొంగ దీసి నట్లైతే బిడ్డ అభివృద్ధికవరోధము కలుగుటెగాక అనేక విధములయిన కీడుకూడ సంభవిస్తుంది. ఇంత మాత్రంచేత బిడ్డను బంధుమిత్రుల ఇండ్లకు, క్రొత్త చోట్లకు తీసికొని పోరా దని తలచరాదు. అయితే బిడ్డ బిడియమును పోగొట్టుటకు, కొంతయైన స్వేచ్ఛగా కదలుటకు, అవకాశము కలిగించి, కష్టమైన ఆటను ఆడు పరిస్థితిని కల్పించాలి. కాని, నాట కాలు, సినిమాల విషయంలో మాత్రం తల్లి తన బిడ్డను వెంటబెట్టుకొనిపోవుట అత్యంత అనుచితమైన కార్యమని చెప్పక తీరదు. ముఖ్యంగా మనదేశంలో తల్లులు కొందరు—అజ్ఞానంచేతనైతేనేమి, అనుకూల పరిస్థితులులేనందుచేత నైతేనేమి—బిడ్డలను సినిమాలకు వెంటబెట్టుకొని వెళ్లుట పరి పాటి. పంజరంలోని పక్షిలాగున పసిపాపడు తల్లిఒళ్లో బధింప బడి, గంటల తరబడి, కదలక మెదలక, మౌనంగా కూర్చుండి వుండాలి. ప్రొద్దస్తమానం వాగుతుండే బిడ్డ పెదిమెలు కూడ కదపకుండ వుండాలి. బిడ్డ బాధలింతటితో అంత మొందవు, తెరపై, వింత వినోదముల గొలుసు కొన్ని దృశ్యాలను బొమ్మలను పసిబిడ్డలు ఏ కొద్దిసేపో ఉత్సా హంతో వీక్షించగలరు. కాని ఏకాగ్రతతో ఎంతో సేపు చూడలేరు. బిడ్డ శ్రద్ధాసక్తులు అత్యంత పరిమితంగలవి. కాన, గంటలకొలది వీక్షించటమంటే సామాన్యమైన విష యంకాదు. ఎంతో బాధాకరమైనది. ఇంతేకాదు. అన్ని టిని మించిన బాధలను కలుగజేయునట్టివి మరెన్నో వున్నాయి. అందులో ముఖ్యంగా, కొన్ని సందర్భములలో ప్రదర్శితమగు వికారఘట్టాలు, భయంకరమైన సంఘటనలు, చెవులు చిల్లులు పడుధ్వనులు, వీటివలన పసిపాపడు అనుభ వించు భీతి మొదలయిన ఉద్రేకములు బాధలనుగురించి చెప్ప టానికే అశక్యము. బిడ్డ కాదృశ్యాలు బూటకములు కావు. కొన్ని ఎంతో యదార్థంగా వుంటాయి, మరికొన్ని అగమ్య గోచరంగా వుంటాయి, అన్ని గంటలకాలం, అన్ని విధముల యిన ఉద్రేకములు, బాధలు అనుభవించుటచేత బిడ్డ కెన్ని విధములగనో హాని సంభవించుట తథ్యము. బిడ్డ ఒంటరిగా నున్నపుడుకాని, నిద్రలోకాని, భీతిలోకేకలు పెట్టడం ఉలిక్కి పడిలేవటం, కలవరించటం చేస్తుంది. ఇట్టి ఉద్రేక ములవలన నాడీసంబంధమైన వ్యాధులతో బిడ్డ నీరసించి పోవుటేగాక మానసికంగా భీతి భ్రమలకు గురి అవుతాడు. కాని, సంగీతం, నృతం, మున్నగు లలితకళలను కొద్ది సేపు మాత్రం బిడ్డ వీక్షించుట వాని అభివృద్ధికి తోడ్పడుతవి.

ఈ ఈడు బిడ్డ వెలిబుచ్చు స్వతస్సిద్ధమైన మరికొన్ని చేష్టలను తల్లి గ్రహించి వాటి కనుగుణంగా తోడ్పడుట అవశ్యకము :—

రెండున్నరనుండి మూడు ఏళ్లు వరకున్న దశలో బిడ్డ తఱచుగా ఒంటరిగా ఆడుకొనుటకు (సమూహంగా ఆడుకోడు.) తన పనులను స్వయంగా చేసికొనుటకు వాం

ఛించుతుంది ; ఉదయం ఆహారం పుచ్చుకోగానే సామాన్యంగా బిడ్డ తన ఆటవస్తువులున్న గదికో లేదా తన ఆట సామానులను మోసుకొని ఏదో ఒక మూలనో, అరుగు మీదనో ఒంటరిగా కూర్చుని ఆడుకొంటుంది, ముఖ్యంగా నర్సరీ స్కూళ్లకు వెళ్లు అలవాటున్న బిడ్డ తమకని నిర్ణీతమైన ఆటవస్తువులు లేని యెడల బయటికి వెళ్లిపోతుంది. లేదా నీళ్ల గదికి వెళ్లి సబ్బుతో, నీళ్లలో ఆడుకొంటుంది. ఇట్టి తరుణమును కనిపెట్టి తల్లి బిడ్డకు స్నానం చేయించితే బిడ్డ చక్కగా ఆడుకొంటూ ఆనందంగా స్నానంచేస్తుంది. కాని, బిడ్డయే స్వయంగా సబ్బు పట్టించుకొని తోముకొంటూ నీళ్లు పోసుకొంటున్నదను భావం కలుగు లాగున తల్లి వర్తించాలి. అదే రీతిగ దుస్తులు తొడుక్కొనుట, తల దువ్వుకొనుట మున్నగు విషయాలలో తల్లి చాకచక్యంతో వర్తించాలి ఉదా :—బిడ్డ నీళ్లు పోసుకొనుట పూర్తిఅయిన వెంటనే, తుండు గుడ్డను తీసుకొని ఒళ్లు తుడుచుకొమ్మని సూచించడం బిడ్డ తనగదికి వెళ్లి లాగు, చొక్కా తొడుక్కొమ్మని సలహా ఇవ్వాలి. బిడ్డ తరగతికి గబగబ వెళ్లి దుస్తులను తొడుక్కోటానికి అనేక పర్యాయములు ప్రయత్నిస్తుంది. కాని, చక్కగా తొడుక్కో జాలదు. చివరకు తల్లి సహాయము నపేక్షించుతుంది. లేదా అట్టి సూచన కనబరచినపుడు తల్లి బిడ్డకు చొక్కాలాగు తొడుగుకొనుటకు, గుండీలు వేసుకొనుటకు నేర్పాలి.

బిడ్డగది —

ఈ వయస్సు బిడ్డ తఱచుగా తనగదికివెళ్లి లేదా మరే చోటనైనా సరే తన ఆటసామానులతో ఒంటరిగా ఆడుకోటాని కిష్టపడుతుందని ఇదివరకే అనుకొన్నాముకదా! బిడ్డ యొక్క ఇట్టి సహజ చేష్టలను అవకాశముగ తీసుకొని తల్లి బిడ్డయొక్క సర్వతోముఖాభి వృద్ధికి మంచి తెలివితేటలతో తోడ్పడాలి. అనగా, బిడ్డయొక్క అవయవ పటుత్వమునకు, నేర్పుకు, జ్ఞానేంద్రియము. వికాసంద్వారా బుద్ధి వికాసమును పొందుటకు, తోడ్పడునట్టి వస్తుసామగ్రిని, ఆటసామానును బిడ్డ గదిలో అమర్చుట అత్యావశ్యకమన్న మాట :—

1—బిడ్డ తన దుస్తులను తగిలించుటకు అనువుగా (దాని కందుబాటులో వుండునట్లు) ఒక చిలుక కొయ్య, లేదా చిన్న స్టాండు, వుండాలి.

2—ఒక చిన్న బల్లపై అద్దము, దువ్వెన,

3—గదిగోడలకు, ఆకర్షణీయమైనరంగు చిత్రములు బిడ్డ వీక్షించుట కనువుగా క్రిందికి తగిలించివుండాలి. అవి, బిడ్డ పలుమారు పరికించునట్టి, పరిచయమున్నట్టి చెట్లు, తీగెలు, పువ్వులు, పక్షులు జంతువులు, మున్నగు ప్రకృతి దృశ్యములుగల చిత్రములగా నుండాలి. ముఖ్యంగా తనకు పరిచయమైనవారివి, తన బంధు మిత్రుల, తోటి పిల్లల ఛాయాపటములుండుట మంచిది.

4—స్వయంగా ఊచుకొనుట కనుకూలమైన ఊయల అమర్చబడివుండాలి కాళ్లు నేలమీద అంటే ఊని ఊచుటకు వీలుగా,

5—మరొక చిన్నబల్ల, ఒకటి రెండు చిన్న కుర్చీలు, రంగుల చాపలువుండాలి. బల్లమీద కొన్ని కాగితాలు లేదా పుస్తకము, వివిధరంగుల క్రేయాన్సు రంగు పుల్లలు, లేదా పెన్సిల్సు, గోడకానించి నల్లబల్ల, సీమసున్నం, తుడుచుటకు గుడ్డ మున్నగునవి, ఒక క్రమము ననుసరించి అమర్చబడాలి.

ఆట సామానులు —

గోపురము, మెట్లుకట్టుట కుద్దేశింపబడిన రంగుల కొయ్యలు, ముఖ్యంగా మాంటిసోరి విద్యాబోధక సామానులు, వంతేన, రైలు, మొదలగు వాటిని కట్టుటకు కొయ్య ఇటికెలు, చొక్కా, లాగు, బట్టలను తొడుక్కోటానికి నేర్పును కలుగజేయు కొన్ని చట్టములు పెద్ద రంగుపూసలు, లావైనదారము, రబ్బరుబంతి, మున్నగు ఆట వస్తువులను చక్కగా వెవ్వేరుగా అమర్చాలి. గది చిమ్ముటకు, చిన్న చీపురకట్ట, బల్ల, కుర్చీ, ఇతర సామానులను తుడుచుటకు ఒక గుడ్డ ఒకచోట పెట్టివుండాలి. ముఖ్యంగా ఈ వయస్సు బిడ్డకు ఎరుపురంగు అధిక ఆకర్షణీయమైనది. కాబట్టి, కొన్ని ఆటసామానులు ఎరుపురంగులో వుండటం అవసరము. కాని అన్నీ ఒకే రంగులో వుండకూడదు. వివిధ రంగులలో నుండాలి. ముఖ్యంగా ప్రధాన రంగులగు ఎఱుపు, నీలము, పసుపులోను, మిశ్రమరంగులగు ఆకుపచ్చ, ఊదా రంగులలో నుండాలి. కొంత గాఢంగా వుండుట ఉత్తమం.

సశేషము.

★

నేటి సాహిత్యం

* శ్రీ వసంతరావు రామకృష్ణరావు *

"ఆనందాదేవ ఖల్విమాని భూతానిజాయంతి,
ఆనందాదేవ జాతానిజీవంతి
ఆనందం ప్రయాన్త్యభి సంవిశంతి"—

ఈ భూతసృష్టియంతయు ఆనందమునుండి ఉత్పన్నమగుచున్నది—ఆనందమున వర్ధిల్లుచున్నది — ఆనందము దిక్కునకు ప్రవహించుచున్నది—తుదకు ఆనందమునందు ప్రవేశించుచున్నది—అనగా మతము ఆనంద సాక్షాత్కారమునకై పాటుపడుచున్నదని దీని భావము.

సూక్ష్మముగా ఆలోచించినచో శిల్పసృష్టి ఆనందసాక్షాత్కారమునకై పాటుపడుచున్నట్లు తెలియగలదు. శిల్పమనగా కల్పనాశక్తి ఫలితముగా అందుండి అవతరించిన అపూర్వ సృష్టులు అని చెప్పవచ్చును. శిల్పి, భక్తుడు, కవి, గాయకుడు, చిత్రకారుడు—వీరుకాక మరి ఎట్టి కళారూపియైనను, ఏది సత్యం శివం సుందరమో దానినే దర్శించుటకు ఉత్సాహించుచుందురు.

కీట్సు అను సుప్రసిద్ధ ఆంగ్లేయ కవి సౌందర్యమే సత్యము, సత్యమే సౌందర్యము అని చెప్పిఉన్నాడు. వీనిని బట్టి కవిత్వము లేదా సాహిత్యముయొక్క ప్రయోజనమును సులభముగా గుర్తించవచ్చును. కీట్సు సౌందర్యమును పోషించిన కవి—సాహిత్యము యొక్క పరమావధిని గుర్తించి తదనురూపమైన సాహితీ శిల్పమును సృష్టించువారు, సాహిత్యమునకే కాక, సమాజమునకు సేవచేసినవారు కాగలరు. సాహిత్యవేత్త సమకాలీన పరిస్థితులనుండి తాను గ్రహించిన కావ్యవస్తువును సద్వినియోగముచేసికొని, కావ్య ప్రయోజనమును సాధించి, లోకోత్తరమైన ఆనంద విభావపరిపుష్టమైన శిల్పమును సృష్టించవలెను.

సాహిత్యముయొక్క ప్రయోజనమును ఈ క్రింది శ్లోకములో, మన ఆలంకారికులు వ్యక్తపఱచి ఉన్నారు—
"కావ్యం, యశసేర్థకృతే, వ్యవహారవిదే శివేతరక్షతయే—
సద్యఃపరనిర్వృతయే కాన్తా సమ్మిత తయోపదేశయుజే."—

దీనిని బట్టి ఆనందాస్పదమైన రసోత్పాదనమే సాహిత్యముయొక్క ముఖ్య ప్రయోజనమని తెలియుచున్నది. ఏదేని శిల్పముయొక్క ప్రయోజనము వస్తువు నావరించిన మనోహరత్వమును మూర్తీభవింపచేసి, తన్మూలముగా ఆనందమును ప్రసాదించుట యని దీనిభావము.

మన ఆలంకారికులు దృష్టాంతము నే ప్రసిద్ధ జర్మను కవిశేఖరుడు, కాళాపిపాసియైన గెతె (Goethe) కూడా అంగీకరించియున్నాడు. అతడు—ప్రతి యుగంలోనూ సౌందర్యగానం జరిగింది. తననుండి ఆవిర్భవించిన సౌందర్యాన్నే కవి ఉపాసిస్తాడు అని చెప్పిఉన్నాడు.

సాహిత్యముయొక్క ప్రయోజనము సద్యః పరనిర్వృతిని ప్రసాదించుట మాత్రమేకాదు. సాహిత్యము సజీవవిలసితముగానుండుటకు సమాజ సేవచేయుటకు ప్రయత్నింపవలెను. ఇట్టి విశాలదృక్పథముతో పూర్వులు మహాకావ్యములను సృష్టించి, తమ కవిత్వకల్పనాశక్తితో రసోత్పాదనమొనరించి, సాహిత్యమునకు, సమాజమునకు శక్తివంతమైన సేవచేసియున్నారు. కావ్యమును, సాహిత్యమును, ప్రాణవంతముచేయు అపూర్వశక్తిగలదు. సంస్కృత లక్షణికులు నిర్ణయించిన సూత్రాలు పాటింపబడు నంతకాలము, సాహిత్యము శక్తివంతముగా, జీవయాత్ర సాగించుచుండును. ఈ లాక్షణికులు సాహిత్యమునకు జీవితమని తాము నమ్మిన ప్రధానసూత్రాలను ప్రపంచానికి వెల్లడించారు. వామనుడు కావ్యమునకు రీతి ప్రాణమనినాడు—రసమే కావ్యజీవితమని విశ్వనాథుడు, మమ్మటుడు నిర్ణయించారు—"ఔచిత్యం రససిద్ధస్య స్థిరం కావ్యస్యజీవితం" అన్నాడు క్షేమేంద్రుడు.

పైన వీరుసూచించిన సూత్రాలు కావ్యానికి, సాహిత్యానికి జీవితప్రాయములే. క్షేమేంద్రుడు ఔచిత్యానికి చాల ప్రాముఖ్యము చూపించెను. మహాకవుల కావ్యసంపదను పరిశీలిస్తే సంస్కృత లాక్షణికులు నిర్దేశించిన సూత్రాలకు వారు చూపిన ప్రాధాన్యత వ్యక్తమవుతుంది.

నేటి సాహిత్యం

కాలానికి ఆద్యంతాలు కనుపించవు. కాలం ఉద్వేలమైన మహా ప్రవాహం—సకల జీవరాసులు ఈ ప్రవాహంలో మునిగిపోతాయి.

కాలప్రభావం అనంతమైనది—అపూర్వమహిమా సంపన్నమైనది. సాహిత్యానికి, కాలానికి పరస్పర సంబంధం వున్నది.

అందువలన మహా కవులు నిర్మించిన సాహితీ శిల్పము నుండి, ఆనాటి సమకాలీన సాంఘిక పరిస్థితులు, ప్రజల జీవన ప్రాథవాదులు, సులభముగా ఊహించవచ్చును. సమకాలీన పరిస్థితులు తదభ్యుదయ పరిణామములు, సాహిత్య దర్పణములో ప్రతిఫలిస్తాయి. నాగరికతావ్యాప్తి సౌందర్య పిపాస, హైందవ సంఘమున చక్కగా విలసిల్లియున్నట్లు, ఆనాటి మహా కావ్యములు కళారూపములు వెల్లడిచేయుచున్నవి. ఈ సందర్భమున సాహిత్యము సంఘముయొక్క ఉచ్చ నీచస్థితులను తెలియచేయుటకు సాధనమని మనకు తెలియుచున్నది.

పరిస్థితులు మారినవి—ప్రజల విశ్వాసములు, ఆచార వ్యవహారములు మారినవి—ఆదర్శములు, ఆశయములు మారినవి—ఈ మార్పు సాహిత్యమున అనివార్యమని చెప్పవచ్చును. సాహితీ శిల్పము సృష్టినుండి నేటివరకు నిరంతర పరిణామమునకు లోనగుచున్నది. కావ్య నిర్మాణ విధానములలో, శిల్ప సౌందర్యాల సృష్టిపద్ధతులలో, అనివార్యమైన పరిణామములు వచ్చినవి. ఇట్టి పరిణామము అభిలషణీయమైనను కాకపోయినను, అనివార్యమని చెప్పక తప్పదు. కాలక్రమములో ప్రజలలో, సాహిత్య వేత్తలలో, బుద్ధికి బలము వృద్ధిఅయినది. భావమునకు ప్రాముఖ్యము హెచ్చినది. నేటి సాహిత్యములో భాషకన్న భావము ఎక్కువ ప్రాధాన్యత సంతరించుకొన్నది!

నేటి సాహిత్యం అభ్యుదయ సాహిత్యమని, ఆదర్శకరమైనదని, సాహితీ పరులు నిర్దేశిస్తున్నారు, ప్రతి భాసమన్వితమైనదని, శక్తివంతమైనదని వాదిస్తున్నారు. ఈ విషయంలోని వాస్తవికతను మనము నిర్దేశించుట కష్టము—కాలము గడిచిన వెనుక నేటి సాహిత్యములోని మేలు కీడులు రెండును ప్రపంచమే గుర్తించగలదు.

కాని సూక్ష్మ దృష్టితో పరిశీలించువారికి, నేటి సాహిత్యమునగల ప్రధానలోపము సులభముగా తెలియగలదు. నేటి సాహిత్యములో రససిద్ధమైన విభావ పరిపుష్టమైన ఆహ్లాద చమత్కృతి వెల్లివిరియుచున్నది. నేటి సాహిత్యానికి రసరామణీయకతలున్నవి. కాని అన్ని శిల్పములకు అత్యంత ఆవశ్యకమైన, రసపోషకమైన "సభ్యత" నేటి సాహిత్యంలోని ప్రధానలోపం అనడం అతిశయోక్తికాదు. ఏది అభ్యుదయ సాహిత్యం? పురాణయుగపు దౌర్భాగ్యబానిస భావాలను పోగొట్టి, ప్రజల జీవన సమస్యలకు పరిష్కారం చూపి నూతనమైన దృక్పథం అలవరుచునట్టిది అభ్యుదయ సాహిత్యం. ప్రజలుకాని, కవులుకాని, సాహిత్యాన్ని అభ్యుదయమార్గంలో నడిపించాలని అనుకోరు. మనకు తెలియకుండానే అభ్యుదయం పరిస్థితుల ఫలితంగా అవతరిస్తుంది. మనలో చెలరేగుతున్న అశాంతి, అభ్యుదయానికి దారితీస్తుంది! ప్రతియుగంలోను ఒక్కొక భావం ప్రాధాన్యం వహిస్తుంది. కవులు, రచయితలు, సంస్కర్తలు ఆభావంపై తమ దృష్టిని కేంద్రీకరించి ఒక కార్యక్రమం సాగిస్తారు. ఈ భావం బాగా ప్రాబల్యం సంతరించుకొని, ఒక నాయకుడిని సృష్టిస్తుంది. ప్రజలు నాయకుడిని అనుసరిస్తారు. నాయకుడి ఆశయాలు సాహిత్య రూపంలో అవతరించి సమాజంలోను, సమకాలిక ప్రజలలోను అభ్యుదయాన్ని సాధిస్తాయి. ఈ సాహిత్యం సమకాలీన పరిస్థితులను కూడా దాటి ముందుకు పోగలదు. సంఘంలోని అనర్థకారకమైన దురాచారాలను నిర్మూలించి, ప్రజలలో ఆత్మ విశ్వాసాన్ని, నైతిక శక్తిని ప్రతిపాదిస్తుంది. సాహిత్యం, సమాజ సంస్కృతికి, ప్రజాపురోగమనానికీ తోడ్పడుటకు సభ్యత అవుసరం—సభ్యతలేని సాహిత్యంలో నైతిక శక్తి నశిస్తుంది. అట్టి సాహిత్యం చైతన్యరహితమైనది, మృతప్రాయమైనది. సభ్యతలేని సాహిత్యానికి విశిష్టత లేదు. దానివలన సంస్కృతిరాదు—సంఘంలోని అనేక విధములైన అనర్థములకు మూలకారణ మవుతూంది నేటి సాహిత్యం.

నేటి సాహిత్యంలో "సెక్స" విజ్ఞానం అనే పేరుతో ఒక పైశాచిక శక్తి బయలుదేరింది. తాత్కాలికమైన ఈ సాహిత్యంవల్ల, నేటి నాగరికతా సమాజంలో అనేక ప్రమా

నేటి సాహిత్యం

దాలు వస్తున్నాయి. సభ్యత లేని సాహిత్యాన్ని సృష్టించిన వారు సాహితీ పరులు కారు—సంఘ సంస్కర్తలుకారు—వారు సామాజిక శత్రువులుగా పరిగణింపబడాలి. సభ్యతారహితమైన సాహిత్యంవలన సమాజంలో ఎంతటి విపత్కర పరిస్థితులు ఏర్పడునో అనే భయం కలుగుతూంది. అట్టి రచనలవలన అభ్యుదయం రాదనే విషయాన్ని అందరూ గుర్తించాలి. సాహిత్యం సాంఘిక పతనానికి దారితీయరాదు. నేటి సాహిత్యంలో సభ్యతా దృక్పథంతో అందరూ కృషిచేయాలి. రచయిత తాను సాహిత్యానికి సంఘానికీ బాధ్యుడని గుర్తుపెట్టుకోవాలి.

★

(34-వ పేజీలోని ఆలోచనలకు సమాధానములు)

1. బంగారమును తూచుటకు ట్రాయ్ మానమును, ఇనుము తూచుటకు అవర్డుపాయ్ మానమును ఉపయోగింతురు. ట్రాయ్ పౌనుకు 12 ఔన్సులు. అవర్డుపాయ్ పౌనుకు 16 ఔన్సులు. కాబట్టి ఒక పౌనుకు 16 ఔన్సులు తూగే ఇనుమే ఎక్కువ బరువు

2. నేయి, నీళ్లు కలవవు—

3. 550 చెప్పులు

4. $69\frac{4}{9}$ రూపాయలు

★

అవసరము లేనప్పుడు అన్నిచోట్ల లభ్యమయ్యేది, అవసరమైన సమయానికి అపురూపమయ్యేది—అప్పు.

★

ఇంట్లో హాస్యం - బావ

❋ శ్రీమతి అచ్యుతుని గిరిజ ❋

ఆనందం, తృప్తి వున్నచోట హాస్యం అతిసహజంగా వెల్లివిరుస్తుంది. ప్రతి మాటలోను వుత్సాహము, సంతోషము ఇమిడివుంటయ్. వేళాకోళపు మాటలు, ఛలోక్తులు వినిపించుతు వుంటయ్. అట్లాగని ప్రతివాళ్లతోను ఛలోక్తులు ఆడలేము. తగిన పాత్రలేనిదే యేదీ రాణించదు. ఎంత చక్కగా, చమత్కారంగా మాట్లాడగలిగినవాడయినా అక్క దగ్గరకో తండ్రి దగ్గరకో వెళ్లి, గేలిచేస్తే, నవ్వులాడితే వాళ్లు సంతోషించకపోగా, వరసా వాయి లేకపోతే సరి, అని నాలుగు అక్షింతలు వేస్తారు. అందువల్ల ఎటువంటి హాస్యమైనా నిరాఘాటంగా నిస్సందేహంగా చేయతగిన పాత్ర బావ.

బావ అంటే ప్రతివాళ్లకు నవ్వులాట. ప్రతివాళ్లకు చనువు. అన్నింటికీ వేళాకోళమే కాని కలలోకూడ నవ్వటానికి హక్కులేని, పరిహాసమాడటానికి అనుజ్ఞలేని బావలు వుంటారు. భర్త అన్నలు యీ బావలు. వీళ్లను ప్రమాదవశాన కూడ యేమీ వేళాకోళం చేయరాదు కాబట్టి "బావగార్లు" అనే చీటీ తగిలించి వేరే దూరానవుంచారు. ఇంక అన్నివిధాల హాస్యానికి గురి అయ్యేవాళ్లు యిద్దరు బావలు. మేనత్త మేనమామల కొడుకు మేనబావ, అక్క పెనిమిటి బావ. అందులోను మేనబావ అంటే కొంత ఆత్మీయత, అభిమానం చూపవలసి వస్తుంది కాబట్టి అతనిని ఒక కొలతవరకే హాస్యం చేస్తాం. అక్క పెనిమిటి బావను చూస్తే అందరికీ ఆనందమే. పాపమాయనను బావమరదులు చిట్టి మరదళ్లు ఎన్నెన్ని విధాల వెక్కిరించాలో, ఎగతాళి చేయాలో, అన్ని విధాలచేసి తీరుతారు. సంపూర్ణ అవకాశం వినియోగించుకుంటారు. బావను నవ్వులాటపట్టించే విషయంలో బావ మరదులకు మరదళ్లకు పరిపూర్ణమైన స్వేచ్ఛను ఇచ్చారు పెద్దలు.

జామాత దశమగ్రహమని కొంతమంది అనుభవజ్ఞులు అంటారు. కాని బావను అట్లా అంటే మరుదులు మరదళ్లు ఒప్పుకోరు. వాళ్ల దృష్టిలో బావంత నవ్వేమనిషి, బావంత సరదామనిషి మరొకళ్లు వుండరు. బావ తమ యింటికి వచ్చిన నాలుగు రోజులు బావమరదులు అడుగులకు మడుగులొత్తుతారు. అడుగడుగునా పల్లేరుకాయలో, సబ్బుముక్కలో వుంటయ్యని బావకు సందేహమే. చిట్టి మరదలు అడుగడుక్కీ ఫలహారాలు అందిస్తుంది. కాని పకోడీలలో చింతపప్పులు వున్నవేమోనని, కజ్జికాయల్లో కొబ్బరి పీచు వుందేమోనని బావకు ఎప్పటికీ అనుమానమే. తమలపాకు కిల్లీ బావకు ఇచ్చామనుకోండి. అందులో వక్కపొడివుందో, చెక్కపొడే వున్నదోనని బావకు వెంటనే అనుమానం వస్తుంది. అందువల్ల విప్పిచూసి తినాలనుకుంటాడు. కాని విప్పితే, బావకు కిల్లీ అట్లానే విప్పకుండా తినాలని తెలియదనుకుంటారేమోనని భయం. నెమ్మదిగా, మాటల సందర్భంలో బావకు సయించనివస్తువు కనుక్కుంటారు. భోజనాల సందర్భంలో "బావకు ఆ పదార్థం చాలా యిష్టం ఇంకా కొంచెం వడ్డించ" మని తల్లితో అంటారు. పాపం అల్లుడు మోమాటు పడుతున్నాడనుకుని అత్తగారు "ఒద్దుబాబో" అని అల్లుడు అంటున్నా లెక్క చెయ్యక ఎక్కువగా విస్తట్లోకి దొర్లించి వెళ్తుంది. పారేస్తే ఏమనుకుంటారోననే భయంతో బావ ఏమీతోచక చూస్తూవుంటే మరుదులు, మరదళ్లు పకపకా నవ్వుతారు. బావ పంక్తినభోజనమంటే పిల్లలందరికీ ఎంతో సరదా.

బావతో ఛలోక్తులాడటానికి వయసుతో నిమిత్తం లేదు. "బావాబావా పన్నీరు బావను పట్టుకు తన్నేరు" అని ఒక చిట్టి మరదలు పాడుతుంది. తలా లతా అయినా చదవటంరాని బావమరది తల్లకిందులుగా పుస్తకం పట్టుకుని బావపిలక కందపిలక——బావమాట నీటి బాట అని చదవటం మొదలు పెడతాడు. ఇంకొకడు బావ పక్కనచేరి ముద్దుబావకథ, రేజీకటి అల్లుడికథ అన్నీ వినిపించటం మొదలు పెడతాడు. పాపం అన్నిటికీ బావ చిరునవ్వునవ్వి వూరుకుంటాడు, దేనికీ కాదనడు, దేనికీ

కోపగించుకోడు. బావతో మాట్లాడేటప్పుడు నాజూకు అక్కరలేదు. ఎంతగోలచేసినా బావ నవ్వి వూరుకుంటాడు. ఒక్కొక్కప్పుడు బావను అనేమాటలకు మనమీద అక్కయ్యకే కోపం వస్తూవుంటుంది.

బావను ఎంత మందిలోనైనా పరిహాస మాడవచ్చు. నిండు పెళ్లిపందిట్లో బావముక్కు చింతగింజ అనో పొడుం బుర్రఅనో, యిష్టం వచ్చినట్లు అంటుంది మరదలు. అనటమేమిటి పాటల్లో నిరాఘాటంగా వర్ణిస్తుంది. అంతటితో వూరుకుంటుందా ? జాగ్రత్తతో తాను స్వయంగా తయారు చేసిన చీపురు పుల్లల హారాలు, ఎండు మిరపకాయల దండలు, పసుపుబిళ్లల కాసులపేర్లు, శెనగబద్దల నెక్లేసులు అన్నీ ఎంతో దర్పంతో బావకు అలంకరిస్తుంది. యావన్మంది కలకలా నవ్వుతారు. కాని బావకు పిసరంతయినా చికాకు రాదు. బావకు మామగారిచ్చిన కట్నాలు కాను కలకన్నా యీ అలంకారాలు వెక్కిరింపు పాటలు ఎంతో విలువయినవి. ఎంతో ఆప్యాయంగా స్వీకరిస్తాడు. బావ చాలా విశాల హృదయం సరదా కలవారు లేకపోతే యీ హాస్యమంతా నిండు హృదయంతో ఏట్లా స్వీకరిస్తాడు చెప్పండి ? పిల్లలతో సమానంగా ప్రవర్తించి ఆడటానికి బావకు బావే సాటి.

కాలక్రమాన బావా బావమరుదులు మరదళ్లు అంతా పెద్దవాళ్లవుతారు. తలొక దోవన విడిపోయి ఎప్పుడో కలుసుకుంటారు. కాని యివేవీ బావను హాస్యమాడటానికి అడ్డురావు. బావ కనపడగానే మరదలు తను నలుగురు పిల్లల తల్లినని మరచిపోయి "ఓహో భావగారా ఎప్పుడురాక" అంటుంది. ఆ కంఠధ్వనిలోనే బావను వేళాకోళం చేయటానికి పూనుకున్నట్లు తెలుస్తుంది. బావ మరినాలుగు రోజుల్లో ఉద్యోగంలోనుంచి రిటైరు కాబోతున్న వయసువాడైనా, యీ మరదళ్లను బావమరుదులను చూసి ఒక్కసారిగా చిన్నవాడుగా మారిపోతాడు. ఎంతో సరదాతో వాళ్లందరి హాస్యపు మాటలు, ఛలోక్తులు వింటాడు. వాళ్ల వేళాకోళానికి మనసార నవ్వుతాడు. బావతో పరిహాసమాడటానికి, గేలిచేయటానికి బావ వయసుతోగానీ మన వయసుతోగాని పనిలేదు. బావ ఎప్పటికీ బావే.

బావను పరిహాసంచేయటం కొత్త విషయం కాదు. కృష్ణుడికి అర్జునుడు బావ. అందుకే కృష్ణుడు ఎట్లాంటి సమయమైనా లెక్క చెయ్యక ముందు పరిహాసంచేసేవాడు. నవ్వులాట లాడేవాడు. ఆ తర్వాతనే రాజకీయాలు. శివుడు విష్ణువు చెల్లెలు—వైష్ణవిని పెళ్లిచేసు కోవటాన ఆయనకు బావ. బావను నవ్వులాట పట్టించటం ఎంతో యిష్టమైన సంగతి కాబట్టే విశ్వమోహిని రూపం ధరించి విష్ణువు శివుడిని నానాగల్లంతుచేసి చివరకు "ఇదంతా తమాషా బావా" అన్నాడు. దేవతలు పురాణ పురుషులే బావలను అన్నివిధాల అపహాస్యంచేసి వేళా కోళంచేసి మార్గం చూపిస్తే మానవ మాత్రులం మనం ఎట్లా వూరుకోగలం? అందువల్ల బావను హాస్యమాడి తీరవలసినదే.

బావతో హాస్యమాడటం కేవలం మన దేశాచారమే కాదు. ఆడవాళ్లు ఘోషా పట్టించే ప్రదేశాలలో బావను బావమరుదులు, మరదళ్లేకాదు, వూళ్లో స్త్రీలంతాకూడ హాస్యంచేస్తారు. పెళ్లి వేడుకల సందర్భంలో కొత్తబావను వూళ్లో యువతులంతా కలిసి నానా అపహాస్యం చేస్తారు. కొత్తబావనే కాక పురోహితుడిని కూడ వేళాకోళం పట్టించే విషయం అందరికీ తెలిసిందేకదా. అంటే బావను హాస్యం చేసేపట్ల అన్ని ప్రాంతాలవారు, అన్నిరకాలవారు ఒకటే అవుతారన్నమాట.

బావను హాస్యమాడటం అందరికీ ఇంతగా నచ్చిన విషయం కాబట్టే ఆ హాస్యం అంత సహజంగా, కోమలంగా వుంటుంది. బావను హాస్యమాడడం యేదోమర్యాదకోసమో, పద్ధతికోసమో చేసేపనికాదు. మనస్ఫూర్తిగా ఎంతో సరదాతో చేస్తాం. అందుకే ఆ హాస్యంలో తెచ్చికోలు తనం కనిపించక స్వచ్ఛంగా వుంటుంది. ఇంట్లో అనుదినం అనుకోకుండా అప్రయత్నంగా వెల్లివిరిసే హాస్యరసానికి మూలం బావ.

[ఆలిండియా రేడియోవారి సౌజన్యంతో]

★

परवाह లక్ష్యము (స్త్రీలింగము).
परवाह करना లక్ష్యము చేయుట.
तोड़ डालना విరుగకొట్టుట.
नाहक़ వ్యర్థముగా, వృధాగా.
मार बैठना కొట్టుట.
जान पड़ना తెలియుట.
गिरफ़्तार करना అరెస్టు చేయుట.
कह देना చెప్పి వేయుట.
शरारत తుంటరితనము. (స్త్రీ.)
मौक़ा అవకాశము, తరుణము (పుంలింగము).
शोर मचाना అల్లరి చేయుట.
दोपहर మధ్యాహ్నము.
इन्तज़ारी करना కాచుకొని యుండుట.

వాక్యములు.

वह रोज़ यहाँ आया करता है।	అతడు నిత్యము యిక్కడ వచ్చుచు (ఉంటు) న్నాడు.
वह बहुत दिनों तक पढ़ा किया।	అతడు చాల రోజుల వరకు చదువుచూనే వుండెను.
वह क्या कर रहा है, देख आओ।	అతడు ఏమి చేయుచున్నాడో, చూచి రమ్ము.
मैं कभी कभी उनके यहाँ जाया करता हूँ।	నేను అప్పుడప్పుడు వారి యింటికి పోవుచూ వుంటాను.
कृष्ण राव कभी किसी बात की परवाह नहीं करते।	కృష్ణారావు యెన్నడును, దేనిని కూడ లక్ష్యము చేయరు.
मैं कल वहाँ नहीं जा पाया।	నేను నిన్న యచ్చటికి వెళ్లి జాలక పోతిని.
आप कल मेरे घर आ जाइये।	తమరు రేపు నాయింటికి వచ్చి వేయండి.
उस लड़के ने यह खिलौना तोड़ डाला।	ఆ బాలుడు ఈ బొమ్మ (ఆటవస్తువు) విరుగగొట్టెను.
तुम उसे नाहक़ मार बैठे।	నీవు యనవసరముగా వానిని కొట్టితివి.
जान पड़ता है कि वे कल ही चले गये।	వారు నిన్ననే వెళ్లి పోయిరని తెలియుచున్నది.
क्या आपने अपनी क़लम ले ली?	తమరు (తమ) కలము తీసికొంటిరా ?
जल्दी करो, गाड़ी आया चाहती है।	త్వరపడుము (రైలు) బండి రాబోవుచున్నది.
कल पुलिस ने उसे गिरफ़्तार कर लिया।	నిన్న పోలీసులు వానిని అరెస్టు చేసిరి.
मैं तुम्हारी शरारत मास्टर साहब से कहे देता हूँ।	నీ తుంటరితనము మాస్టరుగారితో చెప్పి వేసెదను.

వాక్యములు

समझकर बात करो ।	తెలిసి మాట్లాడు.
मेरे आते ही वह चुप हो गया ।	నేను రాగానే అతడు ఊరకుండి పోయెను.
आपको यहाँ आये कितने दिन हुए ?	తమరిక్కడికి వచ్చి ఎన్ని దినములాయెను ?
पूरा एक महीना हो गया ।	పూర్తిగా ఒక నెల అయినది.
मैं परसों जानेवाला हूँ ।	నేను యెల్లుండి వెళ్లువాడను (వెళ్లుచున్నాను).
मेरा दोस्त ऊपर वाले कमरे में रहता है ।	నా మిత్రుడు పైనుండుగదిలోనుంటున్నాడు.
आपका शुभनाम क्या है ?	తమ పేరేమి ?
यह घर तुम्हारे घर से बड़ा है ।	ఈ యిల్లు నీ యింటికంటె పెద్దది.
मैं उनसे मिलना चाहता था ।	నేను వారిని చూడ గోరుచుంటిని.
लेकिन (मुझे) मौका नहीं मिला ।	కాని (నాకు) అవకాశము దొరకలేదు.
रवींद्रनाथ ठाकुर हमारे देशके सबसे बड़े कवि माने जाते हैं ।	రవీంద్రనాథ్ ఠాకూరు మనదేశపు సర్వశ్రేష్ఠ కవియని యెంచబడుచున్నారు.
लड़के क्यों इतना शोर मचा रहे हैं ?	బాలురు ఎందుకింత అల్లరి చేయుచున్నారు ?
वह दोपहर से तुम्हारी इन्तज़ारी कर रहा है ।	అతడు మధ్యాహ్నమునుండి నీ కొఱకు కాచుకొని యున్నాడు.
ज़रा उनका पता लिख दीजिये ।	వారి అడ్రసు వ్రాసి యివ్వండి.
क्या तुमने तुलसीदास की रामायण पढ़ी है ?	నీవు తులసీదాసు రచించిన రామాయణము చదివియున్నావా ?
तुम कब की बात कह रहे हो ?	నీ వెప్పటి సంగతి చెప్పుచున్నావు ?

*

గృహ వైద్యముగా 'హోమోపతి'

* శ్రీ చక్రవర్తి రంగస్వామి *

స్త్రీలు శారీరకంగా అనేక మార్పులు చెందుతూ పొందే వివిధావస్థలలో ఎన్నో తాత్కాలిక వ్యాధులకు పాల్పడుతూ ఉండటము సహజము. పిల్లలు ఐదేండ్లు నిండేవరకు తరుచు రొంప, దగ్గు, వాంతులు, విరేచనాలు మొదలైన బాలారిష్టాలతో బాధపడుతూ ఉండటము మామూలు. వీటి అన్నిటికీ అయాచితంగా ఇగురు పొరుగువారి వైద్యసలహాలు లభ్యపడుతూ ఉండటమూ, అందులో ఎవరి సలహాను పాటించలేమో వారికి మనమీద దురాగ్రహం రావటమూ అందరికీ అనుభవంలో ఉండే విషయాలే. సలహాలు ఇచ్చే వారందరు మన శ్రేయోభిలాషులే అయినప్పటికీ ఫలితం మంచిని ఎంతవరకు చేకూర్చేదీ అందరికీ తెలిసినదేకదా.

పిల్లలు ఉన్న ఇంటిలో రోజూకొన్ని వైద్యావసరాలు తప్పకుండా ఉంటాయి. గృహయజమాని రోజూ సీసాలను మోసుకొని వైద్యశాలలకుపోయి తన సమయాన్నీ, ధనాన్నీ ఎంతని వ్యయ పరచగలడు? గృహిణి ఎందరినని వైద్యభిక్షయాచిస్తూ ఉంటుంది? వివిధ ఔషధ ప్రయోగాలవల్లవచ్చే మంచిచెడ్డ ఫలితాలను గురించి కూడా ఆలోచించవలసిన బాధ్యత తల్లిదండ్రులపై ఉంటుందికదా. ఎవరి సలహానో ఒకరి సలహాను అనుసరించి ఏదో ఒక ఔషధాన్ని ప్రయోగించ తలచుకున్నప్పుడు కూడా ఎన్నో చిక్కులుంటాయి—ముఖ్యంగా పిల్లల విషయంలో, చేదుగానో, ఘాటుగానో ఉండేద్రావకాలను, రసాలను తన బిడ్డచేత త్రాగించవలసి వచ్చినప్పుడు తల్లిపడే అవస్థ అంతాఇంతా కాదు. ఎలాగో కష్టపడిత్రాగిస్తే చివరకు భరించలేక బిడ్డ వాంతిచేసివేసుకుంటుంది. ఇక తల్లికి చేయగలిగిందేముంటుంది?

ఇట్టి చిక్కులు హోమియో పంచదార మాత్రలను వాడటములో లేవు. పిల్లలు ఈ ఔషధాలను ఆనందంతో అడిగి తీసికొనితింటారు. సామాన్య వ్యాధులకు వాడబడే హోమియో ఔషధాలు చాల నిరపాయకరమైనవి. కఠిన పథ్యముతో పనిలేనివి. అస్వాభావికమైన దురభ్యాసములు పిల్లలలోను స్త్రీలలోను ఉండవు. కాబట్టి వీరి వ్యాధులను ఈ ఔషధాలు సునాయాసంగా నివారింపగలవు.

చదువుకున్న గృహిణికి హోమియో వైద్యవిధానము సులభ గ్రాహ్యంగా ఉండి పిల్లలకు, తనకు, ఇరుగుపొరుగు స్త్రీలకు వచ్చే సామాన్యవ్యాధులకు తనంతతానే వైద్యం చెయ్యడానికి అవకాశాన్ని ఇస్తుంది. గృహ వైద్యంగా హోమియో ఔషధాలను ఉపయోగిస్తూ ఉంటే కూరగాయ వైద్యాలవల్లకలిగే అనేక కష్టనష్టాలు తొలగిపోతాయి. ఇందువల్ల అనవసర వ్యయం, ఆందోళన, శ్రమ తగ్గిపోవటం యథార్థం.

కోరింత దగ్గులు, లివరువ్యాధులు మొదలైన దీర్ఘకాలం పిల్లలను వేధించే వ్యాధులలోను, ఋతుశూల, వేవిళ్లు, జీర్ణకోశ దోషాలు మొదలైన స్త్రీలకు ఆందోళన కలిగించే వ్యాధులలోను హోమియో ఔషధాలను వాడుకొంటూ త్వరగా, తక్కువ శ్రమతో, మితవ్యయంతో అద్భుతంగా మంచి ఫలితాలను పొందవచ్చు.

అక్షరాస్య ఐన గృహిణికి హోమియో వైద్య సాహిత్యాన్ని చదివి అర్థంచేసుకోవడం కష్టమైన పనికాదు. ద్వాదశలవణచికిత్స, సారూప్యౌషధ (హోమియో) చికిత్స అనే విషయములపై తెలుగులో వ్రాయబడిన గ్రంథాలను దగ్గరవుంచుకొని, అందలి సూక్ష్మ విషయాలను గ్రహిస్తూ ఔషధాలను సామాన్యవ్యాధులకు ఉపయోగిస్తూ ఉండటం నిజముగా మనస్సుకు సంతోషాన్ని కలిగించే ఉపయోగకరమైన వ్యాసంగంగా ఉంటుంది. సామాన్యవ్యాధులన్నిటినీ 30—40 ఔషధాలతో కుదర్చవచ్చును. ఔషధం ఒక్కొక్కటీ నాలుగణాలు వెల మాత్రమే ఉంటుంది కనుక ఎక్కువ ధనముతో అవసరముండదు.

గృహిణికి ఆరోగ్యానికి సంబంధించిన విటమినులు మొదలైన కొన్ని విషయాలను, థర్మామీటరు, ఎనిమా

(తరువాయి 47-వ పేజీలో)

సంగీతము

* శ్రీమతి ఆదుర్తి భాస్కరమ్మ *

[రాజమంద్రి, త్యాగరాజవర్థంత్యుత్సవమునకు అధ్యక్షత వహించిన శ్రీమతి, భాస్కరమ్మగారి ఉపన్యాసము]

సంగీతము—చిత్రలేఖనము, సాహిత్యము, నృత్యము మొదలగు లలిత కళలలో నొక కళ. ఈ లలిత కళలకును, ప్రకృతికిని చాలా దగ్గర సంబంధము కలదు. ప్రకృతినుండియే యీ కళలుద్భవమందినవి.

అందువలననే పుట్టుకనుండియు సహజ జ్ఞానము కలవారికి గాని ఈ విద్యలలో నేదియు పట్టువడజాలదు. సహజముగా కవితా ధోరణిగల వారి కవిత్వమువలె అది లేని వారి కవిత్వము ఎంత నేర్చుకొన్నను, వ్యాకరణ చంధశ్శాస్త్రజ్ఞాన మెంతయున్నను, భాషా పాండిత్యమెంత విశాలమైనదైనను, అంత స్వేచ్ఛగా, అంత సరళముగా, అంత రసవంతముగా నడువఁజాలదు.

సహజ స్వాభావిక పరిజ్ఞానముగల చిత్రకారుని చేతి యందలి తూలికవలె తక్కిన వారి చేతితూలిక చిత్రవిచిత్రములగు స్వాభావిక వర్ణములతో, అతి విన్నాణములును, సున్నితములు నగు రేఖలతో పరుగిడఁజాలదు. స్వాభావిక వయ్యారమునకును, కొనితెచ్చుకొన్న వయ్యారమునకును, నమితమగు తారతమ్యము నృత్యములో గన్పట్టుచునే యుండును. కోకిలస్వరమునందుగల మాధురి సృష్టియందుగల మరి యేయితర పక్షి స్వరమునందును వినఁజాలము. హంస నడకయందలి వయ్యారము నేర్చుకొంటే వచ్చినదికాదు. నెమలి నృత్యములోని సౌంద ర్యవిలాసములు భరత శాస్త్రజ్ఞాన నైపుణివలన నలవడలేదు. అందువలననే యీ లలిత కళలకును, సృష్టికిని నెంత దగ్గర సంబంధము కలదో స్పష్టపడుచున్నది.

ఈ సృష్టికంతకూ, ఈ కళలకన్నిటికీ కర్తయైన భగవంతుని తరువాత భగవంతుని యవతారములని చెప్పదగు బుద్ధివైభవము, విజ్ఞానముగల మానవులు పై కళలకు కొన్ని హద్దులేర్పరచి, శాస్త్రములను సృష్టించి ప్రకృతిలో నొక్కొక్క కళ యొక్కొక్క వ్యక్తిలో ఉంటే ఈ కళలన్నింటినీ మానవులభ్యసించి వానికి వన్నెతెచ్చుటకు తగిన యవకాశము నొసఁగిరి.

కావుననే మన ప్రబంధములలో నీ కళల నభ్యసించిన స్త్రీలను గురించి వర్ణించేటప్పుడు కవులు "శారికా కీరపంక్తికి చదువు నెప్పు, బర్హిసంఘములకు మురిపెములు గరపు, మదమరాళములకుఁ జూపు మందగతులు" అని వర్ణిస్తో వచ్చారు. అనగా సృష్టిలో సహజముగాఁగల యీ కళలకు, అట్టి కళలను సహజముగా తమలో కలిగియున్న యా స్త్రీలు ఆ యా కళలకు సంబంధించిన శాస్త్రములను గూడ నభ్యసించి వాటికి వన్నెతెచ్చినట్లు తెలుస్తోంది.

పై కళలన్నిటిలో సంగీతము సర్వజనసామాన్యమై సులభముగా గ్రహించుటకును, ఆనందించుటకును తగిన కళ.

సంగీతము సర్వజన సామాన్యమై, సులభముగా గ్రహించుటకును, ఆనందించుటకును తగినకళ. పిపీలకాది బ్రహ్మ పర్యంతముగల సకల జీవరాసి గాన మాధుర్యమును గ్రోలి తన్మయము నొందగలవు. సంగీతము వినినంతనే రాళ్లు కరగును, మోళ్లు చిగుర్చును, నాగులునాట్యము చేయును, బాలలు జోలల విని నిదురింతురు—భక్తులు పరవశులగుదురు—కావుననే సంగీతము కళలన్నింటిలోనూ ఉత్తమోత్తమమైనదని చెప్పవలెను.

త్యాగరాజు, క్షేత్రయ్య మొదలగు వారాంధ్రులైనా, వారువ్రాసిన కృతులు, పాటలు ఆంధ్ర భాషలోనున్నా, వాటిని చక్కగా పాడగలిగినవారు తమిళ్లేగాని, మన యాంధ్రులలో లేకపోవుట చాల శోచనీయము.

కవిత్వమును జూచి మెచ్చుకొనుటకును, ఆనందించుటకును భాషాపాండిత్యముండాలి. చిత్రలేఖనమును మానవులు మాత్రమేచూచి యానందింపగలరు. నృత్యములోని నైపుణ్యము భరత శాస్త్రజ్ఞానము కలవారికి మాత్రమే బాగుగా తెలియును.

సంగీత మట్టిదికాదు. దీనియందలి మాధుర్యము పిపీలకాది బ్రహ్మపర్యంతముఁగల జీవరాసులు మాత్రమేగాక వృక్షములు, రాళ్లు మొదలగు నిర్జీవ పదార్థములుగూడ నీ గానామృతమును గ్రోలి తన్మయము నొందఁగలవు. శ్రీకృష్ణుని వేణుగాన ధ్వనిని వినగానే గోపికలందరూ గృహములను విడచి యాతనిచుట్టునూ చేరుచువచ్చిరి. గోవులు మేతను సహితము మాని యాతనికి వశమయ్యెను. సంగీతము వినినంతనే మోళ్లు చిగుర్చును, రాళ్లు కరగును. నాగస్వరము వినగానే పాములు తమ క్రూర స్వభావములను వదలి సర్పములను విప్పి వయ్యారముగా నాడదొడగును. తల్లుల జోలపాటలకు పసిబిడ్డలు తమ యేడ్పులనుమాని సొక్కి నిద్రింతురు. చక్కగా పాడువారి చుట్టూ పదిమంది చేరుదురు. భరింపరాని దుఃఖములో నున్నవారి దుఃఖము నుపశమింపఁజేయుటకు సంగీతము దివ్యౌషధము. సంగీతము భక్తుల పరవశులనుజేసి తాండవమాడించును. కావుననే సంగీతము కళలన్నిటిలో నుత్తమోత్తమమగు కళయని చెప్పకయే చెప్పుచున్నది.

ఈ కళ నభ్యసింప నర్హులు ముఖ్యముగా స్త్రీలేయని, ఆ విద్య స్త్రీలయొక్క సొత్తని భగవంతుడు వారికిచ్చిన మృదుమధుర గాత్రములె వేనోళ్ల చాటుచున్నవి. వారి గాత్రములకు జంత్రవాద్యములతో నిమిత్తములేదు. వీణాతంత్రులు ఆ గాత్రములలోనే యమర్పఁబడి యున్నవి. వీణ ఊరక వానికి సహాయము మాత్రమే. విద్యలన్నిటికీ అధి దేవత సరస్వతి. పూర్వపు మన ప్రబంధములు, నాటకములు, కావ్యములు, పురాణములు వేనియందు జూచినను అందు వర్ణింపఁబడిన రాజపుత్రికలందరూ ఈ లలిత కళలన్నిటిలోనూ నేర్పరులై యున్నట్లు, అభ్యసించుచున్నట్లు గన్పట్టును. కాఁబట్టి బాలికల కొసగు విద్యలో నీ లలితకళల కన్నిటికీ ప్రాముఖ్యమీయవలయును. అందు ముఖ్యముగా సంగీతమునకు ప్రాధాన్య మొసగవలసి యున్నది.

అరవదేశములో నీ సంగీతకళ చాల యభివృద్ధిలో నున్నది. వారీ కళనింకను నుచ్ఛస్థితికి గొనివచ్చుటకు చాలా ప్రయత్నములు చేయుచున్నారు. ఆ దేశములో బాలికలకు సంగీతమురానిచో వారికి పెండ్లి యగుటయే దుర్ఘటము. అందువలన నెంత పేదవారైనను కొద్దిగనో గొప్పగనో బాలికలకు సంగీతము నేర్పించెదరు. మన ఆంధ్రదేశములో బాగా సంగీతము పాడగలవారున్నారని చెప్పుటకేలేదు. త్యాగరాజు, క్షేత్రయ్య మొదలగువారాంధ్రులైనా, వారు వ్రాసిన కృతులు, పాటలు ఆంధ్రభాషలోనున్నా వాటిని చక్కగా పాడగలవారు తమిళులేకాని మన యాంధ్రములో లేకపోవుట శోచనీయము.

★

(తరువాయి 45-వ పేజీలో)

మొదలైన సాధనాల ఉపయోగాన్నీ తెలుసుకోవడం చాలముఖ్యం—సులభముకూడా. ఇందువల్ల అనేక వ్యాధులను నివారించనూవచ్చు; నిరోధించనూవచ్చు.

ఈ విధంగా గృహ వైద్యానికి సంబంధిచిన విజ్ఞానాన్ని ఆకళింపు చేసుకోవటానికి కావలసినంత సాహిత్యం తెలుగులో ఉన్నది. తెలుగు సోదరీమణులు గృహ వైద్యంగా హోమోపతిని ప్రయత్నిస్తే తమగృహాలను ఆనంద నిలయాలుగా మార్చగలరు.

★

శ్రీమతి గిడుగు
లక్ష్మీకాంతమ్మగారు

శ్రీమతి లక్ష్మీకాంతమ్మగారు శ్రీ వక్కలంక గౌరరాజు గారి పుత్రిక. చిన్న నాటనుండి సంస్కరణ పరాయణ మైన విద్వత్ పరిసరములలో పెరిగినది. ప్రభుత్వ విద్యా శాఖ వుద్యోగి అయిన కీ॥ శే॥ శ్రీ. గిడుగు రామమూర్తి పంతులుగారి ధర్మపత్ని. పితృగృహమందు అభ్యసించిన విద్యా సంగీతములు కొద్ది పాటివి అయినా, భర్తృ సహ చర్యంలో ఈమె మంచి సాహిత్య సంగీతములను అలవరుచు కొని నిత్య జీవిత సమస్యలకు సంబంధించిన విషయములను పద్యకావ్య రూపములో రచించిరి.

వీరి అడ బడుచు కీ॥ శే॥ శ్రీమతి జొన్నలగడ్డ శారదాంబ గారితో కలిసి లక్ష్మీశారదా సుభాషితములు, కుమారీ నీతి, అనుపద్యకావ్యములు వ్రాసిరి. వీరి సుభాషితాలు చక్కటి శైలిలో మంచి వుపమాన వుపమేయములతో నీతి ప్రబోధ కముగానున్నవి.

వీరి 'కుమారీనీతి' వివాహితయగు యువతీ ధర్మాన్ని, హిందూ ధర్మ సాంప్రదాయాల్లో స్త్రీ యొక్క వున్నత స్థానాన్ని ఎత్తి చూపుతున్నది. వారు రచించిన లేఖ దూత భార్యా భర్తలయొక్క అన్యోన్యం ఎట్టి సాహిత్యానికి కారణం కాగలదో వుదాహరిస్తుంది. 1942 లో శారదాంబగారి మృతి, 1943 లో రామమూర్తిగారి మృత్యువు వలన కలిగిన దుర్భరదుఃఖమువలననూ, యిక్కట్లవలననూ, అప్పటినుండీ పదిమంది బిడ్డలతోగూడిన సంసార భారం పూర్తిగా వహించవలసి వచ్చుటవలననూ, సాహిత్యంలో ఈమె కృషిచేయలేదు.


విద్యావతి అయిన ఈమె, డాక్టరు కేసరిగారిచే యీయ బడిన గృహలక్ష్మి స్వర్ణకంకణమును పొందుటకు ఎంతయూ అర్హురాలు. కంకణ గృహీతకు మా హృదయ పూర్వక అభినందనములు.

'ఆంధ్ర మహిళ'

★



శ్రీమతి లక్ష్మీకాంతమ్మగారు.



సుగిమూరా క్యొకో—జపాన్ స్త్రీ.

న్యూ ఢిల్లీలో, మార్చి 4 నుండి. 11వ తేదీ వరకు జరిగిన ఆసియా ఖండపు ఆటల పోటీలలో, 11 ఆసియా దేశాలు పాల్గొన్నవి. స్త్రీల బ్రాడ్‌జంప్ పందెములో, 19 అడుగుల 5 అంగుళములు దుమికి, ప్రథమ బహుమానమును బడసిన జపాన్ యువతి.


ఆంధ్ర మహిళ చందాదారులకు

మే నెలలో ఆంధ్ర మహిళ పత్రికకు 7 సంవత్సరములు నిండుతవి. ఇంత కాలము పత్రిక నిర్విఘ్నముగా, జయప్రదముగా వెలువడుటకు సహకరించిన మీ అందరికి హృదయ పూర్వక కృతజ్ఞత. మున్ముందు పత్రికను ఇంకా సౌష్టవముగా, సర్వాంగ సుందరముగా ప్రచురించ గలమని ఆశించుచున్నాము.

ఈ మధ్య తిరిగి కాగితము ఖరీదు, అచ్చు ఖర్చులు కూడా హెచ్చు కావటము వల్ల తప్పని సరిగా పత్రిక ఖరీదు పెంచవలసి వచ్చినది. అందువల్ల మే నెల నుండి జన్మదిన సంచికతో సహా సంవత్సర చందా 5 రూ. బదులు 6 రూ చేయడమైనది. ఈ స్వల్పవ్యత్యాసమునకు మీరు సంకోచింపక మునపటిమాదిరి ఆదరాభిమానములతో మాకు ప్రోత్సాహము ఇవ్వగలరని ఆశించుచున్నాము.

ఈ మనవిని ఏప్రిల్ సంచికలో కూడ ప్రచురించి యున్నాము.

మేనేజరు
ఆంధ్ర మహిళ



బూగండారాణీ—నాబాగెరేక.

భారత స్త్రీల చీరె కట్టు విధానం, అత్యంత సుందరవంత మైనదిగా విదేశీ స్త్రీలు తలుస్తారు. బూగండారాణీ చీరె కట్టుకొని తీయించుకున్న ఛాయా చిత్రం.

గృహలక్ష్మి స్వర్ణకంకణ ప్రదానోత్సవము

2–3–51 శుక్రవారం నాడు రాయపేట (మద్రాసు) యందలి కేసరికుటీరము భవనమునందు గృహలక్ష్మి స్వర్ణ కంకణ ప్రదానోత్సము వైభవోపేతముగా జరుపబడినది.

ఈసారి కంకణము శ్రీమతి గిడుగు లక్ష్మీకాంతమ్మగారికి ఇవ్వబడినది. శ్రీమతి అన్నాప్రగడ చన్నఘంటమ్మగారు ఎం. ఏ. యల్. టి. ఉత్సవమునకు అధ్యక్షత వహించిరి.

ప్రార్థనానంతరము, అధ్యక్షురాలిని, కంకణ గృహీతను వేదికపై కాహ్వానించుచు వెంకటప్పగారు వారుభయులను సభవారి కెరుకపరచిరి. మరియు, నాటి సభకు విచ్చేసి యున్న పూర్వకంకణ గృహీతలగు శ్రీమతి చిల్కపాటి సీతాంబగారును, ఏలూరులో యోగవ్యాయామాశ్రమము నడుపుచున్న కమ్ముల అప్పన్నగారును సభవారికి పరిచయ మొనర్పబడిరి.

తదుపరి తమకీ అపూర్వ గౌరవము నొసంగినందులకు శ్రీమతి చన్నఘంటమ్మగారు కేసరిగారి నుగ్గడించి సభాకార్య క్రమమును యథాప్రకారముగా నడిపించిరి.

సందేశములు చదువబడిన పిమ్మట శ్రీ కేసరిగారస్వస్థులై యున్నందున వారి ఉపన్యాసమును గృహలక్ష్మి సహాయ సంపాదకురాలు శ్రీమతి ములుకుట్ల సుశీలగారు చదివి వినిపించిరి. ఆ పిదప శ్రీమతి గిడుగు లక్ష్మీకాంతమ్మగారికి స్వయముగా కేసరిగారు కంకణము నర్పించిరి. కంకణ స్వీకరణానంతరము శ్రీమతి లక్ష్మీకాంతమ్మగారు కేసరిగారి నభినందించుచు గంభీరోపన్యాసము గావించిరి. ఆ పిదప దాతను, గృహీతను అభినందించుచు పలువురు కవులంపిన పద్యములను కోట సోదరకవులలో పిన్నవారు చదివిన పిమ్మట, శ్రీమతి సీతాదేవిగారును, శ్రీమతి బి. కామేశ్వరమ్మగారును ఉపన్యసించిరి. కడపట శ్రీమతి చన్నఘంటమ్మగారు కేసరిగారి వివిధోద్యమములు స్త్రీ జనాభ్యుదయమున కెట్లు ప్రయోగించుచున్నది విశేషముగా నగ్గడించి, స్త్రీల కర్తవ్యములను హెచ్చరించుచు గంభీరోపన్యాసము నొసంగిరి. అంతవందన సమర్పణముతో సభ ముగిసినది.

*　　*　　*

రాజమండ్రి

ఆంధ్ర మహిళాగాన సభలయొక్కయు త్యాగరాజ వర్ధంతి యొక్కయు 19 వ వార్షికోత్సవము

ఈ యుత్సవము ఫిబ్రవరి నెల 18 వ తేదీ నుండి 24 వ తేదీ వరకు శ్రీమతి ఆదుర్తి భాస్కరమ్మగారి అధ్యక్షత క్రింద జయప్రదముగా జరిగినవి.

ఇందు పలువురు స్త్రీలు, బాలికలు సంగీత నృత్యము లలో పాల్గొని సభ్యుల నానందోత్సాహములలో నోలలాడించిరి.

ఈ సభలలో పాల్గొన్న వారికందరకు పై సంఘము వారు రాజమండ్రి మునిసిపలు కమీషనరు శ్రీ వి. వాసుదేవర్ గారి సతీమణిగారిచేత •రజితపాత్రలు, కుంకుమభరణెలు, రజత పతకములు బహుమానములుగా నిప్పించిరి.

*　　*　　*

రాజమహేంద్రపుర స్త్రీల గృహ పరిశ్రమల సహకార సంఘము

పనిలేక, జీవితము జరిగే మార్గములేక, ఇబ్బందిపడుతూ ఉన్న బీదస్త్రీలకు పనికల్పించి వారికి జీవనోపాధిని కలిగించుటకును, గృహ పరిశ్రమలను ప్రోత్సహించవలయునని

యుద్దేశముతోడను క్రిందటి సంవత్సరము జూలై నెలలో ఇక్కడి కోఆపరెటీవు సెంట్రలు బ్యాంకులో స్త్రీల సమావేశమొకటి యేర్పాటు చేయడమైనది.

14–12–1950 ని సంఘము రిజిష్టరు చేయఁబడినది. జాయింట్ రిజిష్ట్రారి గారైన శ్రీ ముద్దు కృష్ణయ్య నాయుడు గారి ఆధిపత్యముక్రింద ప్రారంభోత్సవము జరుపఁబడింది.

శ్రీమతి ఆదుర్తి భాస్కరమ్మగారు—అధ్యక్షురాలు
,, చెట్లపిల్లి స్వరాజ్యంగారు—కార్యదర్శినిగా
ఎన్నుకొనబడిరి.

డిసెంబరులో సంఘము రిజిష్టరు అయినప్పటినుండి పని బాగా, చురుకుగా జరుగుచున్నది. ఒక సామాన్య సభ్యురాండ్ర మహాసభయు, నాలుగు పాలకవర్గ సభలును జరిగినవి. నవారు నేయువారు 40 మంది సభ్యురాండ్రుగా చేరినవారు నేత ప్రారంభించిరి. ప్రస్తుత మా నేత బాగా జరుగుచున్నది. ఇక్కడ కోఆపరేటీవు సెంట్రలు బాంకువారు ఒక కుట్టు మెషీనును బహుమానముగా నొసంగిరి. దుస్తులు కుట్టు పనికూడ ప్రారంభింపబడును. ఇంకా ఆకులు కుట్టుట, ఆటవస్తువులను తయారు చేయుట, చాపలల్లుట మొదలగు పనులు కూడా ప్రారంభింపబడును.

ఈ నగరమునందలి ప్రతి పేటలోను ఈ సంఘము యొక్క శాఖల నేర్పాటుచేసి ప్రతి పేటలోను ఏదో యొక పనిచేయుటకు నిశ్చయింపంబడినది. 12–2–51 ని ఇన్నీసు పేటలో నొక శాఖ నియమింపఁబడినది. అక్కడి స్త్రీలు కొంతమంది ఆకులు కుట్టుటకుత్సాహము కనబరచిరి.

మా సంఘమునకు ఇక్కడ బాగా శ్రద్ధతీసికొని చాలా సహాయపడుచున్న వారికందరకు మేము కృతజ్ఞులము.

ఆ. భాస్కరమ్మ
అధ్యక్షురాలు.

* * *

బొంబాయి ఆంధ్ర మహిళాసభ

ఉపాధ్యక్షురాలు

శ్రీమతి మామిడిపూడి వెంకమ్మగారి ఉపన్యాసం

16—2—'51, శుక్రవారం, బొంబాయిలో, శ్రీమతి. బుర్రా రాజిసోమిదేవమ్మగారి, అధ్యక్షత క్రింద, ఆంధ్ర మహిళా సభలో జరిగిన సమావేశమందు, ఉపాధ్యక్షురాలగు శ్రీమతి. మామిడిపూడి వెంకమ్మగారు, హిందూ కోడ్ బిల్లుపై ఉపన్యసిస్తూ, ఈ 'హిందూలా' మన స్త్రీలకు ఎంతవరకు అవుసరమో, అంతవరకైతే చాలు నని, వారి అభిప్రాయం తెలియచేశారు.

ఋషుల కాలంనుండి వస్తూవున్న, ఈ హిందూ ధర్మశాస్త్ర చట్టాలన్నీ, స్వరాజ్యం వచ్చినంత మాత్రాన ఎందుకు మార్చాలని కొందరు విరుద్ధంగా వున్నారు. కాలం మార్పు చెందడంవల్ల, కాలానికనుగుణ్యంగా, చట్టాలుకూడా మారాలని, మరికొందరి అభిప్రాయం అని, యీ తెగ వారితో తానేకీభవిస్తున్నాననీ తెలియచేశారు.

ఆస్తిపాస్తుల పంపక విషయంలో, ఇతర జాతులవారు, అంటే, (మహ్మదీయులు, క్రైస్తవులు) వీరిలో, మూడవ భాగమో, నాలుగవ భాగమో, స్త్రీలకు చెందుతూనే యున్నది, కాని, హిందువులలో మాత్రం, అటువంటిదింకా లేకపోవటం శోచనీయమనీ, అదీగాక, అనాది నుంచీ వస్తున్న ధర్మశాస్త్ర ప్రకారం, ఆస్తి, పితృకార్యం జరిపేవారికిగాక, దాయాదుల కెవరికో పోవటం జరుగుతూ వస్తున్నదనీ, చట్టం మార్పువల్ల, ఇటువంటి అభ్యంతరాలు తొలగి, కొంత కాకపోయినా కొంతైనా, లాభం వుండ వచ్చుననీ, అందుకోసం, మనస్సులను, అభిప్రాయాలను, మార్చుకొంటేగాని, చట్టం యొక్క ఆవశ్యకత తెలియదనీ, చెప్పారు. అంతేగాక, రాబోయే ఎలక్షనులో, 'ఓటింగ్ పవర్' స్త్రీలకున్నది గనుక, ఓట్లివ్వడానికి, చట్టం అమలులోకి వస్తేనేగాని వీలుండదని, వీరి అభిప్రాయం తెలియజేశారు.

చిత్రసమీక్ష:

విజయా వారి 'పాతాళభైరవి'

విజయా వారి రెండవ చిత్రం పాతాళభైరవి, మార్చి 15 వ తేదీనుండి విడుదలయై, ఆంధ్ర దేశమంతటా విజయవంతంగా చూపబడుతూ ఉంది. ఇందలి కథా వస్తువు 'Alladın and the wonderful lamp' అనే కథ, విక్రమార్క చరిత్రలోని కొన్ని ఘట్టాలు, ఆధారంగా గల ఒక జానపదగాథ. అయితే దేశీయ జానపద గాథలకుండవలసిన వాతావరణం యీ చిత్రంలో అతి నిక్కచ్చిగా చూపబడినది.

"ధైర్యేసాహసే లక్ష్మి" అనే ఆర్యోక్తిననుసరించి, అతి సాహసవంతుఁడు, కడు ధైర్యశాలి, మిక్కిలి బలవంతుఁడునైన తోటరాముఁడు అనే డింభకుఁడు, బీదవాడయ్యూ, ఉజ్జయినీ రాజకుమారిని వరించి, ఆమె పాణిగ్రహణౌచిత్యమును బడసే కృషిలో, పాతాళభైరవి అనే మంత్రశక్తిని సంపాదించు నిమిత్తము సాహసవంతుఁడైన తనను బలియీయదలచిన నేపాళదేశపు మాంత్రికుని మాయలో చిక్కి, నానా కష్టములుపడి, చివరకు, పాతాళభైరవి శక్తి వలన, అష్టైశ్వర్యములను బడసి, రాజకుమారిని పరిణయ మాడును.

ఇందలి ముఖ్యమైన పాత్రలు మాంత్రికుఁడు, తోటరాముఁడు నని చెప్పవచ్చును. మాంత్రికుని శిష్యుఁడు, రాముని పెదతల్లి కొడుకు అంజనేయులు, రాణీగారి తమ్ముఁడు, రాజకుమారి, వీరందఱు కథ నడవడానికి సహాయ. పాత్రలు. ఇందు మాంత్రికుని పాత్రనటించిన రంగారావు చాలా అద్భుతంగా, అపూర్వంగా నటించాడని, చెప్పాలి. కథా ఘట్టాలకనువైన అతని నటనకుతోడు, అతని దుస్తులు, యాసతోగూడిన అతని సంభాషణలు, ఒక వింత వాతావరణను కలిగించాయి. తోట రాముడుగా ఎన్. టి. రామారావు తన పాత్రను చక్కగా పోషించాడు. రేలంగి తన నటనను చూచి నవ్వని వారిని 'తప్పు తిప్పం' టాడేమో ననిపిస్తుంది. అంజనేయులు తోక ఒకటి తక్కువకాని, మరీ చివరి ఘట్టాలలో, విశ్వాసానికీ, చాకచక్యానికీ, రామాయణంలోని హనుమంతుని స్మరణకు తెస్తాడు. మొదటి ఘట్టాలలో యితని హాస్యం సందర్భోచితంగానే ఉంది. కథకు ఆధారమని తప్పితే, రాజకుమారి పాత్ర అంత ప్రధానమైనది కాదు. అయినా ఉన్నంతలో మాలతి తన పాత్రను చక్కగానే నిర్వహించింది

మొత్తం మీద పాతాళభైరవి కథ మొదటినుండి కొసవరకు ప్రేక్షకుల ఆసక్తిని తగ్గకుండా ఉంచుతుందని అనాలి. మధ్యలో రాముఁడు, మాంత్రికుని చంపి, పాతాళభైరవిని తెచ్చి, రాజకుమారిని వివాహమాడునప్పుడు కథ అంతటితో అయిపోయిందనే అంత నమ్మకం కలిగి, అక్కడ ఏర్పడ్డ డాన్సులు మొదలైనవన్నీ కాలయాపన అన్నట్టు అనిపిస్తుంది గాని అంతలోనే మరల కథ తారుమారై, చచ్చిన మాంత్రికుఁడు బ్రదకటం, పాతాళభైరవి అపహరింప బడటం, మాయామహలుతో సహా రాజకుమారి మాంత్రికుని వశము కావటం సంభవిస్తుంది. ఈ కథ అడ్డం తిరగడంలో ప్రేక్షకుల ఆసక్తి ద్విగుణీకృతమై, తుదివరకు అస్థాయిలోనే ఉంటుంది.

కథ సుఖాంతం. సత్యవిజయం ఇందలి అంతర్భూతమైన ఆదర్శం. అడవులు, కొండలు, లోయలు, గుహలు, గారడీ, యిందలి వాతావరణం. యిందలి సెట్టింగులు, అందూ ముఖ్యంగా గుహ నిర్మాణము, మాంత్రికుని దుస్తులు, అతని పరికరములు, యీ వాతావరణాన్ని పూర్తిగా ప్రేక్షకుల కండ్లకు కట్టినట్టు చూపాయి. దీనికి కారణభూతమైన గోఖలేగారి కళాదర్శకత్వమూ, కె. వి. రెడ్డిగారి దర్శకత్వమూ, పింగళివారి పాత్రోచిత సంభాషణలు, మిక్కిలి అభినందించదగినవి. పాటలో, నే పద్య సంగీతంలో అంత ఎక్కువగా చెప్పవలసినదేమీ లేదు. మాయామహల్ గాలిలో ఎగరటం చూపడంలో ఉపయోగించిన క్రొత్త టెక్నిక్ మెచ్చుకో తగ్గది. వాహినీ స్టూడియోలో గల ప్రత్యేక సదుపాయాల నన్నింటినీ వినియోగించుకొని, ప్రజా హృదయాలను ఆకర్షించి, వినోదాన్ని కలిగించే ఒక చక్కటి జానపద చిత్రాన్ని దర్శకులు తయారు చేసారని చెప్పాలి.

'ధరా'

★

రోహిణీ వారి 'నిర్దోషి'

బారిష్టరు విజయ జమీందారు వాసుదేవ రావుగారి కొడుకు. తార విజయ మేనత్త కూతురు. చదువుకున్న నవీన నాగరికత గల యువతి. ఆమె హృదయం కుమార్ అనే బీద యువకుని ప్రేమించింది కాని విజయుడి గౌరవ, సంపాదనల మీది వ్యామోహంతో అతనినే పెండ్లాడా లని చూస్తుంది. తార అభిప్రాయాలకూ, విజయ అభి ప్రాయాలకూ చాలా తేడా వుంటాన, విజయ పల్లెటూరి పిల్ల అయిన నిర్మలను రిజిష్టరీ వివాహం చేసుకుంటాడు.

కాని వీరి వివాహం, చిన్న తనంనుంచీ నిర్మలను ప్రేమించి, ఏవిధంగా నైనా పెళ్లాడాలని చూస్తున్న చంద్రయ్యకు విజయుని ప్రథమ భార్య తారకు ఆటంకాన్ని కలుగజేస్తుంది. నవనాగరికురాలైన తన్ను కాదని అనా గరికురాలైన నిర్మలను వివాహం ఆడడం తార సహించ లేక పోతుంది.

నిర్మల విజయుల అన్యోన్య దాంపత్యాన్ని ఏలాగేనా నిర్మూలం చెయ్యాలని కంకణం కట్టుకున్న తార చంద్ర య్యను పెళ్లి చేసుకుంటానని మభ్యపరచి, అతని సహకా రంలో కుట్రపన్నుతుంది. మూడు మూర్తులా నిర్మలను పోలిన ప్రమీల అనే నటికి డబ్బు ఆశపెట్టి, చంద్రయ్యతో ఆమె పార్కులో సరస సల్లాపాలాడేటట్లు ఏర్పాటుచేసి, ఈ దృశ్యాన్ని విజయునకు చూపిస్తుంది.


ఆ సమయానికే విజయ కారు ప్రమాదంవల్ల చావు బ్రతుకుల్లో వున్నాడనీ, వెంటనే ఆసుపత్రికి రమ్మనీ, నర్సు చెప్పినట్లు తానే ఫోనులో చెపుతుంది. ప్రమాదానికిలో నయింది తన భర్తకాడని తెలుసుకాని, నిర్మల ఆనందంతో యింటికి వస్తుంది. రౌద్రాకారంతో నిర్మల చెప్పిందేమీ వినకుండా, ఆమె గర్భవతి అని అయినా కనికరించకుండా తార ఆడించిన నాటకాన్ని నమ్మి, నిర్మలను యింటినుండి తరిమి వేస్తాడు విజయ.

నిర్మల యిలువెడలి ఎన్నో కష్టాలకు గురియై తల్లిదండ్రు లను కూడ గోల్పోయి, ఆఖరికి తన కంతకష్టాన్ని కల్పించి నది తారేనని తెలుసుకొని, తన శిశువుతో భర్తవద్దకువచ్చి తాను 'నిర్దోషి'నని రుజువు పరచుటకు యత్నించినది. కాని విఫలురాలై ఆత్మహత్య చేసుకొన యత్నించినా విజయ చలించడు. చివరకు ప్రమీలవల్ల నిర్మల నిర్దోష త్వాన్ని తెలిసికున్న విజయ తారను గొంతుపిసికి చంపపో తాడు. కాని తార తుదకు చంద్రయ్య నౌకరుచేత కాల్చ బడుతుంది. నిర్మల ఎవరిచేతనో రక్షించబడి, విజయను కలిసికొని, సుఖంగా జీవిస్తుంది. ఇది ఇందలి ఇతివృత్తం.

ఇతర సాంఘిక చిత్రాలకన్న నిది త్రొక్కిన క్రొత్త దోవ కనబడదు. సామాన్యంగా, నవనాగరీక వ్యామోహితుడైన భర్త దుశ్శీలయగు పరస్త్రీవలలో చిక్కి ధర్మపత్నిని హింసించి, తుదికి కాల పరిభ్రమణములో, రెండవ యువతిచే పరాభవింపబడి, పశ్చాత్తప్తుడై యిలుసేరి, క్షమాశీలయు, పతివ్రతయు నగు భార్యతో సుఖించుట యితి వృత్తంగా గృహలక్ష్మి ప్రారంభంగా తీసిన ఆ సాంఘిక చిత్రాలలో చిన్న చిన్న మార్పు లతో చూస్తాం. ఇందులో నవనాగరీకురాలైన ఒక స్త్రీ, ఈర్ష్యా ప్రేరణ ఎంతటి దుర్మార్గానికైనా వెనుదీయని సాహసి, అమాయిక శీలవతి అయిన స్త్రీ యొక్క దాంపత్యానికి ముప్పు తెస్తుంది. భర్త దుర్మార్గత చేగాకుండా, తన శీలాన్ని శంకించడం వల్ల నిర్మల కష్టపడుతుంది. ఇదే యీ వృత్తంలో చూపిన కొంత క్రొత్త అని చెప్పవచ్చు.

చిత్రం అంతంలో పెద్దలోప మొకటి కనిపిస్తుంది. కథ ఊరికే పెరిగిపోవటంవల్ల కొన్ని సంఘటనలు ప్రేక్షకులకు పూర్తిగా అవగాహన చేయటానికి దగ్గకులకు సావకాశము లేకపోయినది. ఒక అంశాన్ని తెస్తే, మరొకటి దానికదే పెరిగి పెద్దదవుచున్నది. నిర్మలనెవరు రక్షించారో, తార చేసిన ఫోను అందుకున్న పోలీసు యినస్పెక్టరేమైనాడో, విజయకి తీర్పు చెప్పందే ఏలా బయటపడ్డాడో, నిర్మల తన నిర్దోషిత్వం ఎవరి ఎదుట ఋజువు పరుచుకుందో ఇవన్నీ చూపితే కథ పెద్దదవుతుంది కాబట్టి ఎక్కడ దక్కడ తెంపేశారు. అందువల్ల ముగింపు సమగ్రంగా లేదు.

(తరువాయి 56 వ పేజీలో)



భిక్షుకి

రచయిత: శ్రీ సభాపతి

వెల రూ. 2—0—0

ప్రతులకు ఆనందబోధిని కార్యాలయం.

నెం 6 లాయర్ చినతంబి మొదలి వీధి, మద్రాసు.

కథ: నంజుండప్ప అనే సాహుకారు ఉంటాడు. అతని జాలప్ప అనే నౌకారు తన శక్తినంతా ధారపోసి పని స్తుంటాడు. జాలప్ప భార్య మల్లమ్మ, కూతురు బంగారు ఇది అతని సంసారం. ఒకరోజు జాలప్ప రాత్రి పన్నెండు గంటలకు ఎద్దుకు గడ్డితెచ్చి వేస్తుంటే ఎద్దు వచ్చి జాలప్ప డొక్కలో పొడిచింది. జాలప్ప డొక్క చీలిపోయింది. ఈ విషయం తెలిసికూడా సాహుకారు నంజుండప్ప ఏ విధమైన సానుభూతి చూపలేదు, సహాయం చేయలేదు. జాలప్ప చనిపోయాడు. దానితో అతని కుటుంబానికి కష్టాలు ప్రాప్తించడం ప్రారంభ మయ్యాయి. పిదప మంగమ్మ బంగారును వొంటరిగాచేసి ఈ లోకాన్ని విడిచి పోయింది. నంజుండప్ప బంగారును పిలచి తండ్రి చేసిన అప్పు తీర్చమంటాడు. బంగారు తీర్చలేనంటుంది. దానికిగాను బంగారును తన ఇంట్లో పనిచేయమంటాడు. బంగారుకు ఈ లోకమే విరోధి అవుతుంది. ఒక రోజురాత్రి నంజుండప్ప కొడుకు నారాయణ తనతోటి వారితోకలసి బలాత్కారంగా బంగారు శీలాన్ని నాశనం చేస్తాడు. ఇక బంగారు ఆశ్రయాన్ని విడిచి అనేక కష్టాలుపడి, చివరికి పాకీ పని చేసి బ్రతుకుచున్న గౌరయ్య తాత దగ్గర చేరుతుంది. గౌరయ్య బంగారును ఎంతో ప్రేమతో చూస్తుంటాడు. తరువాత బంగారుకి వివాహం కావడం, సంజీవి (బంగారు భర్త) ఆమెను విడచి వెళ్లడం, దానితో తిరిగి కష్టాలు ప్రారంభ మవ్వటం జరుగుతుంది. తుదికి భిక్షుకిగా తయారౌతుంది ఇది నవలలోని కథ.

రచయిత 'భిక్షుకి' వ్రాసేటప్పుడు, ధనికవర్గ నిరంకుశత్వ నిరూపణయనే ఆశయముతో, ఆద్యంతాలు, డబ్బున్న ప్రతిపాత్రకూ ఊహాతీతమైన రాక్షసత్వాన్ని అంటకట్టి, హృదయంలేని పశుత్వాన్ని ఆరోపించి, సాధారణ సంఘ వాతావరణం కాకుండా, ఒక అలౌకికమైన, పత్యేక వాతావరణాన్ని చిత్రించారు. ఇందువల్ల కథలోని సహజత్వం నశించి, ధనికవర్గం మీద తమకు గల ప్రత్యేక కక్షసాధించే నిమిత్తం రచయిత కల్పించిన కథగా చదువరులకు తోస్తుంది. కథ ప్రారంభంనుండి ఒకే రకంగా నడుస్తుంది. దుర్మార్గులుగా తాము చిత్రించ దలచిన ఒక పాత్రలోకూడా, ఏ సంఘటనలోనూ, క్షణమాత్రమైనా, యిసుమంత కరుణగాని, సానుభూతిగాని, పశ్చాత్తాపముగాని చూపకపోవటం, కనీసము ఒకరిలోనైనా పరివర్తన అనేది చూపక పోవటంచేత బొత్తిగా నాస్తికరచన అనిపించుతుంది. చివరకు కథానాయిక అయిన భిక్షుకి పాత్రకూడ మిగతా వాతావరణంవల్ల రక్తికట్టదు. మొత్తం మీద యీ కథ ధనిక వర్గ హృదయాలలో తమ యందుచేసిన యీ ఆరోపణలకు క్రోధాగ్నిని, దరిద్ర హృదయాల్లో విప్లవాగ్నిరగులు కొలుపుతుంది. మధ్య తరగతి వారి హృదయాల్లో అసహ్యం, విసుపు, విరక్తి కలిగిస్తుంది. ఈ విధంగా ఇందులోని అసహజత్వం, అతిశయోక్తి 'ఎవరి హృదయాలను రజింపజేయలేక పోవుటయేగాక, ఈ కారణంచే, వివిధ వర్గ హృదయాలలో రగుల్కొన్న అగ్నుల పర్యవసానమేమగునో అనిపిస్తుంది. ధనికులకు నిరంకుశత్వము లేదనలేము. దరిద్రులది దుర్భర జీవితం కాదననూ లేము. ప్రస్తుత మన సమాజవ్యవస్థలో యీ రెండు వర్గాలకు

గ్రంథ సమీక్ష

ఆర్థికరీత్యా ఏర్పడ్డ జీవిత వ్యత్యాసాలు తొలగిపోవాలనే కాంక్ష సమంజసమైనది, సంఘశ్రేయస్సుకై అభిలషణీయమైనది కూడా. ఆపరిణామమే లక్ష్యంగా గల్గిన ఏ నిర్మాణాత్మకరమైన చర్యఐనా అభినందనీయమైనదే—కాని, ప్రస్తుత రచనలో రచయిత కేవలం ఆరోపణలతో ఆపివేయటం, అందులోనూ అమితమైన అతిశయోక్తిని ప్రయోగించడంవల్ల, లక్ష్యశిద్ధి వికృతరూపందాల్చ గలదు. అగ్ని జీవితమున కత్యంతోపయుక్తమైన సాధనమయ్యూ, ప్రమత్తతవల్ల వినాశకారిగా పరిణమించునట్లు, సంఘ సంస్కరణకు విప్లవము అత్యంతోపయుక్తమైన సాధనమయ్యూ, హద్దు మీరినప్పుడు భస్మాసురుని వరమువలె ఆత్మ వినాశన కారణమౌతుంది. అందువల్ల ప్రజల హృదయాలలో విప్లవాగ్నులు రగులు కొల్పే అభిప్రయాలాను ప్రపంచం మీదకు తమ రచనలద్వారా విసిరేటప్పుడు రచయితలు తమ గురుతర బాధ్యతను గుర్తించుకోవాలి. అదీగాక సుందరవస్తు భావర్ణనలలోని అతిశయోక్తి అహ్లాదాన్ని కలిగిస్తుంది. వికృత వస్తు భావవర్ణనలలోని అతిశయోక్తి వికారమునే కలిగిస్తుంది గనుక, సాహిత్యంలో సామాజక వ్యవస్థలను పరిశీలించి, సంస్కరణను ప్రభోదిద్దామనే అభ్యుదయ కాంక్షులు, తమ హద్దులను అతి జాగరూకతతో నిర్మించుకొనకపోతే, సంఘమునకు వారుచేసే సేవకన్న హానియే ఎక్కువ అవుతుందని చెప్పాలి.

‘ధరా’

★

ఆంధ్ర మహిళా సభలో

కీ॥ శే॥ సి. ఆర్. రెడ్డిగారి స్మారక సభ

మార్చి 15 తే. సాయంత్రం 5 గంటలకు ఆంధ్ర మహిళా సభలో సభ్యరాంధ్రుడు కీ॥ శే॥ కట్టమంచి రామలింగా రెడ్డిగారి మృతికై సానుభూతి సభ జరిపించిరి. మహిళా సభ ఆంధ్రోపాద్యాయుడు శ్రీ. గంధం అప్పారావుగారు, ఆంధ్ర ప్రముఖుడు, విద్యావేత్త మహా మేధావి, యైన శ్రీ. రెడ్డిగారి సర్వతో ముఖ ప్రజ్ఞను విపులంగా వర్ణించుచూ సానుభూతి తీర్మానమును ప్రతి పాదించగా సభికులందరూ నిశ్శబ్దముగ 2 నిముషములు నిలచి ఆయన ఆత్మశాంతికై భగవంతుని ప్రార్థించిరి.

(54వ పేజీ తరువాయి)

నటీ నటులందరూ కూడా చక్కగా వారివారి పాత్రలను పోషించుకొచ్చారు. అందులోనూ తారగా వేసిన జి. వరలక్ష్మి నిర్మలగా వేసిన అంజలీదేవి, విజయగా నటించిన ముక్కామల ప్రత్యేక సామర్ధ్యం చూపించారు. మధు చిన్న పిల్లవాడైనా, ఎంతో చాక చక్యంగా నటించి ప్రేక్షకులకు ఆనందాన్ని కల్గించాడు. నాయకా పాత్రను ధరించడం ముక్కామలకు యిదే మొదటి సారైనా, ఈ పాత్రను విజయవంతంగా నిర్వహించాడు. ప్రభాకర రావుకూడ తగిన శ్రద్ధతో తన పాత్రను పోషించ ప్రయత్నించాడు.

ఇందు చూడవలసిన భాగాలు, పల్లెటూరు, అందు నిర్మల తనతోటి స్నేహితురాంద్రతో ఆడుట, మొదలగునవి చక్కగానున్నవి. కథంతా ఎంత రక్తికట్టి మొదటినుంచీ చూచుట కెంత ఆనందంగానున్నదో చివర సీను అంత నిరుత్సాహంకలిగించింది. శ్రీ శ్రీ సంభాషణలు ఆత్రేయపాటలు చక్కగా ఉన్నాయి. పాటలు హిందీట్యూన్ల అనుసరణవల్ల అంత ఉల్లాస కరంగాలేవు. నే పద్య సంగీతం హృదయరంజకంగా ఉంది. మొత్తం మీద యీ నాటి సాంఘిక చిత్రాలలో ‘నిర్దోషి’ చిత్రం ఒక పై మెట్టు నందుకున్నది.

★

Edited and published by G. Durgabai, M.A., B.L., at the Andhra Mahila Sabha, Mylapore, Madras,
Printed by M, Satyanarayana at the H, Prachar Press, 12, Thanikachalam Chetty Road, T'Nagar, Madras